దేశంలో అత్యధికంగా చదవబడుతున్న ఏకైక తెలుగు మాసపత్రిక

జ్యోతి

09-1980



సెప్టెంబర్.80

రూ.3/-

వెలుతురులో-చీకటి - నెల్లూరు కేశవస్వామి

సంస్థాపకులు

కీ॥ శే॥ వి. వి. రాఘవయ్య

మేనేజింగ్ ఎడిటర్

శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

సెప్టెంబర్ 1980

సంపుటి 18 — సంచిక 8

విషయసూచిక

ఈ నెల నవలానుబంధం

వెలుతురులో చీకటి

రచన: నెల్లూరి కేశవస్వామి

ముఖచిత్రం : 'పసుపు పారాణి'లో సుజాత

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, మద్రాసు-600 024. ఫోన్ : 423123

సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) 43 రూపాయలు



దేశగౌరవ భంగాలు!

తొలిమాట

ఒకజాతి చరిత్రను దాని నైతిక ప్రవర్తన ఆధారంగా రాయవచ్చునంటారు. ఇదే నిజమైతే రేపటి భారత చరిత్రకారులు, ఈ రేపుల నైతిక వర్తనని గురించి యేమని లిఖిస్తారు?

రైల్వేప్లాట్ ఫారాల నుంచి, ప్రజాసంరక్షక కేంద్రాలుగా భావించబడుతున్న పోలీసు స్టేషన్ లవరకూ, ఈ మానభంగాలతో మచ్చపడని ప్రదేశమంటూ యేదయినా భారతదేశంలో మిగిలివుందా?

మానభంగాలకి గురైన మహిళల సంరక్షణ గురించిన, ఈ అత్యాచారాల నివారణకు తీసుకొనవలసిన చర్యలను గురించిన అంశాలు పొందుపరచబడిన లా కమిషన్ 84వ నివేదిక పార్లమెంటుకు సమర్పించబడి, భయవిహ్వాలలైన భారతమహిళలకు కొంత ఊరడింపు లభిస్తున్న దశలో, ఉత్తరప్రదేశ్ లోని బాగ్ పట్ లో అమానుషమైన మరొక ఉదంతం జరిగింది. ముగ్గురు పురుషులను బహిరంగంగా కాల్చివేసి, వారిలో ఒకరి భార్యను (ఆమె గర్భవతికూడానని తరువాతి వైద్యపరీక్షలు వెల్లడిచేశాయి!) వీధులలో నగ్నంగా ఊరేగించి పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్ళి క్రూరంగా, ఘోరాతిఘోరంగా చెరిచి భారతదేశం ముఖాన మరొక వికృతచిహ్నాన్ని ముద్రించారు పోలీసులు. విశృంఖలతా, స్వేచ్ఛాలైంగిక సంబంధాలూ విపరీతంగా వున్న పాశ్చాత్యదేశాల ప్రజలకు సైతం విభ్రాంతి కలిగిస్తున్న ఈ కిరాతకాలను అంతమొందించడానికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదిక మీద ఆచరణ సాధ్యమైన ఆలోచనలు చేయడం అవసరం.

౦౦౦ హైదరాబాదులో "శుభోదయ"మైంది! ౦౦౦

'శంకరాభరణం'తో భారతదేశ చలనచిత్ర రంగలో సంచలనం కలిగించిన అచ్చ తెలుగు దర్శకుడు కె. విశ్వనాథ్ రూపకల్పన చేస్తున్న మరొక మహత్తర చిత్రం 'శుభోదయం' జూన్ 23 నుంచి జూలై 23 వరకు హైదరాబాదులో షూటింగు జరుపుకొంది. ఆగస్టు 5 నుంచి 15 వరకు కాళహస్తిలో జరిగే చివరి షెడ్యూలుతో చిత్రీకరణ ముగుస్తుంది. వేటూరి రాసిన ఆరు గీతాలలో అయిదింటి చిత్రీకరణ పూర్తయింది.

శ్రీరామ్ ఆర్ట్ పిక్చర్స్ పతాకంతో సి. హెచ్. నరసింహారావు నిర్మిస్తున్న ఈ వర్ణ చిత్రంలో చంద్రమోహన్, సులక్షణ, సాక్షి రంగారావు, మనోరమ, చారుహాసన్, పొట్టిప్రసాద్ విజయకుమార్, దాస్, అన్నపూర్ణ, కృష్ణప్రియ, భానుప్రకాష్, ముఖ్యపాత్రలు ధరిస్తున్నారు.

కథకుడు, దర్శకుడు. కె. విశ్వనాథ్, సంగీతం: కె.వి. మహాదేవన్, మాటలు: జంధ్యాల, కెమెరా : కస్తూరి, ఆర్ట్, తోట, ఎడిటర్, సమర్పకుడు, జి. జి. కృష్ణారావు.

శుభ ఛత్ర ఛాయలో....

శుభోదయం ఔట్ డోర్‌లో దర్శకుడు కె. విశ్వనాథ్, చంద్రమోహన్.
ఎదుటి పేజీలో సులక్షణ, విశ్వనాథ్, చంద్రమోహన్ వున్నారు.






శుభోదయం ! శుచిత్రోదయం !!



ఇప్పుడు మీరు అతని పళ్లను
పిప్పిపళ్లు కాకుండా చెయ్యవచ్చును.



వాడండి సిగ్నల్ 2

పళ్లను గట్టిపరచి దంత క్షయాన్ని నివారించేందుకు
దీనిలో అత్యంత ప్రభావంగల ఫ్లోరైడ్ ఫార్ములా ఉంది.

హిందూస్థాన్ లీవర్ వారి ఉత్పత్తి.

లింటాస్-SIG. 1A-1779 TL

పంటినొప్పివల్ల కలిగేది కేవలం బాధ మాత్రమే కాదు. దంతక్షయానికి అది సంకేతం కూడా. అశ్రద్ధ చేస్తే దంతక్షయం మరింతగా పెరిగి పిప్పి పళ్ళు అయిపోతాయి.




హోటల్ తీసే ఆమ్లాలు పళ్లలోకి చొచ్చుకుపోయి దంతక్షయాన్ని కలిగించకుండా మామూలు టూత్ పేస్టులు ఆపలేవు.

సిగ్నల్ 2లో అత్యంత ప్రభావంగల ఫ్లోరైడ్ ఫార్ములా ఉంది. అది హానికర ఆమ్లాలు పళ్లలోకి చొచ్చుకుపోయి దంతక్షయం కలిగించకుండా అరికడుతుంది.


పిప్పి పళ్ళను నిరోధించే టూత్ పేస్ట్

పరిస్థితి విషమించక ముందే మీ కుటుంబంలో వారంతా వాడండి! సిగ్నల్ 2—దంతక్షయాన్ని నిరోధించడంలో నిరూపించబడిన టూత్ పేస్ట్. దీనిలోని ప్రత్యేకమైన ఫ్లోరైడ్ ఫార్ములా పళ్ళతో కలిసి వాటిని గట్టిపరుస్తుంది, పళ్ళకు హాని కలిగించే పోటి ఆమ్లాలను నిరోధించేందుకు మరింత శక్తి నిస్తుంది—పిప్పి పళ్ళు కాకుండా కాపాడుతుంది. దంతక్షయాన్ని అరికట్టడంలో దీనికి మించిన టూత్ పేస్ట్ లేదు. మేం చెప్పిందని మీరు నమ్మక్కర్లేదు. మీ దంత వైద్యుణ్ణి కూడా అడగండి.



ఫ్లోరైడుతో
సిగ్నల్ 2

కుటుంబంలో వారికి పిప్పి పళ్ళు
రాకుండా నిరోధిస్తుంది.



లింటాస్-SIG. 1B-1799 TL

ఏజంట్లూ, రచయితలూ, ప్రకటనకర్తలూ
దయచేసి గమనించండి!

ఆగస్టు 15, 1980 నుంచి 'జ్యోతి' కార్యాలయం హైదరాబాదులో పనిచేయడం ప్రారంభిస్తుంది. జ్యోతిలో అన్ని ఉత్తరప్రత్యుత్తరాలూ కింది చిరునామాతో జరుపవలసిందిగా కోరుతున్నాము —ఎడిటర్.

జ్యోతి కొత్త చిరునామా :

జ్యోతి
సచిత్ర మాసపత్రిక
1-8-4/1/1, చిక్కడపల్లి
హైదరాబాదు-500020

ముఖ్య గమనిక : ఏజంట్లు డ్రాఫ్టులూ, మనియాడర్లు కూడా ఈ కొత్త చిరునామాకే పంపాలి.

మచిలీపట్నంలో రచయిత్రుల మహాసభలు

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారు మచిలీపట్నంలోని సాహితీ సంస్థ 'స్పందన సాహితి' సహకారంతో మచిలీపట్నంలో జూన్ 27 నుంచి 29 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి రచయితుల మహాసభలు విజయవంతంగా జరిగాయి.

కథ, నవల, కవిత, మొదలైన సాహితీ ప్రక్రియలపై జరిగిన సమగ్ర చర్చలలో పలువురు రచయితులు యెంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. మహాసభల చివరిరోజున "సమాజం మీద సినిమాల ప్రభావం" అనే అంశంమీద ఆసక్తికరమైన ప్రసంగాలు జరిగాయి. ఈ విషయంమీద ప్రసంగించినవారిలో జ్యోతి మేనేజింగ్ ఎడిటర్ శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య, శ్రీమతి కోడూరి లీలావతి, నందివాడవుతలీ కష్ణమూర్తి శ్రీమతి సి. వేదవతీవున్నారు.

ప్రముఖ రచయిత్రులు శ్రీమతి తెన్నేటి హేమలత, శ్రీమతి సి. ఆనందారామం, శ్రీమతి ఐ. వి. యస్. అచ్యుతవల్లి డా. ఆలూరి విజయలక్ష్మి శ్రీమతి అక్కల సరస్వతీ బాబూరావు, శ్రీమతి శారదా అశోకవర్ధన్ మున్నగువారు కథ, నవల ప్రక్రియలమీద జరిగిన చర్చలలో పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీమతి అమరేశ్వరి సభలను ప్రారంభించారు. శ్రీమతి తి. కోటేశ్వరమ్మ అధ్యక్షత వహించారు.


ప్రముఖరచయిత్రి శ్రీమతి ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ కన్వీనర్‌గా జరిగిన ఈ సభలు విజయవంతం, కావడానికి స్పందన సాహితి కార్యకర్తల నిర్విరామకృషి బాగా దోహదం చేసింది.

కవయిత్రుల కవితా గోష్ఠిలో రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా. బెజవాడ గోపాల రెడ్డికూడా పాల్గొనడం, రాష్ట్ర మాజీ మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు వేదిక యెక్కిన రచయిత్రులకు హితోపదేశం చేయడం ఈ సభలకు సంబంధించిన యితర విశేషాలు.

గౌ॥ శ్రీ పి. శివశంకర్‌కి మద్రాసులో ఘనసన్మానం!



కేంద్ర న్యాయశాఖామంత్రి శ్రీ. పి. శివశంకర్ పదవీస్వీకారానంతరం మొదటిసారిగా మద్రాసు విచ్చేసిన సందర్భంగా ఆయన గౌరవార్థం తాజ్ కోరమండల్ హోటల్‌లో జరిగిన ఒక అభినందన సభలో ప్రముఖ పారిశ్రామికవేత్త, యల్. వి. ఆర్. చారిటీస్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ యల్. వి. రామయ్య సత్కరించారు. పై చిత్రంలో గౌ. శివశంకర్‌ని సత్కరిస్తున్న శ్రీ ఎల్. వి. రామయ్య, కింది చిత్రంలో వేదికమీద శ్రీ ఎల్. వి. రామయ్య, త. నా. గవర్నర్ శ్రీ ప్రభుదాస్ పట్వారి, గౌ. శివశంకర్, శ్రీరామప్రసాదరావు ప్రభృతులున్నారు.



కొత్త పుస్తకంతో కొంతసేపు

[అగ్నిగుండం: రచన: మహీధర రామమోహనరావు;162 పేజీలు. వెల: 8 రూపాయలు: ప్రచురణకర్తలు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్; చంద్రం బిల్డింగ్స్, విజయవాడ-520004]

మన సగటు నవలల్లోని ఇతివృత్తాలు, పాత్రలు చాలా వరకు నేలవిడిచి సాము చేస్తాయి. అయినా అందులో కల్పించబడే సంఘటనలు, పాత్రల మనస్తత్వాల మధ్య ఏర్పడే సంఘర్షణ, నాటకీయత మొదలైన అంశాలు పఠితులను సులభంగా ఆకట్టుకుంటాయి. ఈ 'రచయిత లేదా రచయిత్రి వాస్తవికతకు సన్నిహితంగా వున్న ఇతివృత్తాన్ని తీసుకుని, రాసివుంటే ఎంత బావుండును' అన్న అభిప్రాయం-మంచినవలలను ఆశించే పఠితలకు కలుగుతుంది. 'సీరియస్' ఇతివృత్తాన్ని తీసుకుని, కథాకథనంలో ఆసక్తిని కలిగించలేక పోయినప్పుడు కూడా అటువంటి పాఠకులకు కొంతబాధ కలుగుతుంది 'ఇంతకంటే ఈ ఇతివృత్తాన్ని రసవత్తరంగా రాసివుండవచ్చునే' అని; ప్రముఖ రచయిత మహీధర రామమోహనరావుగారు ఒక 'బర్నింగ్ ప్రాబ్లమ్'ను తీసుకుని రాసిన 'అగ్ని గుండం' చదివాక అటువంటి నిరుత్సాహమే ఏర్పడుతోంది.

1967 జూన్‌లో ఒక రాష్ట్ర ప్రభుత్వం 'రిట్రెంచ్‌మెంట్' పథకాన్ని అమలుజరిపి, ఉపాధ్యాయులను ఎంత క్షోభకు గురిచేసిందో, తత్ఫలితంగా వ్యక్తులలో, వాళ్ల ఆలోచనాధోరణిలో ఎలాంటి మార్పులు వచ్చాయో ఈ నవలలో చర్చించడం జరిగింది.

'అగ్ని గుండం'లో నాయకుడు 'రిట్రెంచ్‌మెంట్' కు గురయిన ఉపాధ్యాయుడు రామారావు. ఉద్యోగం పోవడంతో, అతని భవిష్యత్ పథకాలు తలక్రిందులవుతాయి.


'రిట్రెంచ్‌మెంట్' సృష్టించిన సమస్యలు; వాటి పరిణామాలు కథకు ఆలంబన అయినప్పటికీ వాటిని నవలలో మలిచిన తీరు ఉత్సాహకారంగా లేదు. కథనంలో సమస్య తీవ్రత కనిపించదు. నవలలోని కొన్ని సంఘటనలు వాస్తవికతకు దగ్గరగా వున్నా, అవి కథాగమనానికి తోడ్పడలేదు. రామారావు వంటి ఒకరిద్దరో నవలలో రాజకీయాలు మాట్లాడుకుంటే బాగానే వుంటుంది కాని, ఎక్కువ పాత్రలు చాలా తరచుగా రాజకీయ చర్చలు జరుపుతూ, రచయిత పరోక్షంగా చెబుతున్న ప్రతిపాదనలను, కొన్ని వాదనలను వివరిస్తూ వుండడంతో పాత్రలపట్ల అనుభూతి, తాదాత్మ్యత ఏర్పడవు.

'అగ్నిగుండం' లోని కొన్ని సంఘటనలు విడివిడిగా పరిశీలిస్తే, బావున్నట్టే కనిపిస్తాయి కానీ అవి కథాగామనంలో ఇమడక పోయే సరికి మొత్తంమీద రసస్ఫూర్తిని కలిగించలేక పోయాయి.

"మార్క్సిజాన్నిగాని, మరో ఇజాన్నిగాని దేశకాల ప్రాంతాలకు సమన్వయం చేసుకోవాలి. అలాగాక ఆ బోధల్ని (ఇక్కడ బోధలు-బాధలుగా అచ్చయింది. ఇలాంటి ఘోరం జరిగినప్పుడే-ముద్రారాక్షసం అనేమాట చాలాసరైన పదం అనిపిస్తుంది;) రూళ్ళ కర్ర సూత్రాలు చేసుకున్నా ర్చుంటే, వచ్చే ఇబ్బంది ఇది;"

—సత్యాపతి

మహీధర రామమోహనరావు నవల—అగ్నిగుండం







29 సీరియల్

కాలింగ్ బెల్ బర్రుమన్న శబ్దానికి సుధీర్‌కి మెలకువ వచ్చింది. వులిక్కిపడి లేచాడు.

క్షణంసేపు తను ఎక్కడ వున్నదీ అర్థం గాలేదు. కళ్లు నులుముకుని చూశాడు. నిద్ర యింకా కళ్ళమీదకు ఒరుగుతూనే వుంది. కాలింగ్‌బెల్ మళ్ళీ బజ్‌మంది. సుధీర్ లేచి వెళ్ళి తలుపు తీసాడు. ఎదురుగా టైపిస్టు నిలబడి వున్నాడు. అతను సుధీర్‌కు వుత్తరం అందిస్తూ "స్వప్నగారు లేరట సార్!" అన్నాడు.

"స్వప్న లేదా? ఎవరు చెప్పారు?"

"ఒక మీసాలాయన వున్నారు."

"నేను చెప్పానుగా ఆయనకి యివ్వద్దని?"

"ఉత్తరం నేను యివ్వలేదు. ఆమె కావాలని అడిగాను. పని యేమిటో చెప్పమన్నారు. చెప్పటానికి వీల్లేదు ఆమెని ఒకసారి కలవాలని చెప్పాను. మీరు యింట్లో లేరని, మీరు లేకుండా ఆమెని యెవ్వరూ కలవటానికి వీలులేదని చెప్పారు. నేను మళ్ళీ యింకోసారి అడిగి, "స్వప్నగారూ!" అని పిలవబోతుంటే కళ్ళెర్రజేసి కొట్టవచ్చారు. నన్ను మెడపట్టి బైటకి తోసి తలుపు వేసేసారు. అందువల్ల మీరిచ్చిన వుత్తరం యివ్వటానికి వీలులేకపోయింది."

సుధీర్ ఆ వుత్తరం తీసుకున్నాడు. "సరే నువ్వు వెళ్ళు" అన్నాడు. గదిలోకి తిరిగివచ్చిన అతనికి అణువణువులోనూ ఆగ్రహం లాటిది వ్యాపించసాగింది. డామిట్! అసలు నేనొక ఫూల్‌ని! స్వప్నని తీసుకుని వచ్చేయాల్సింది అనుకుంటూ తలుపువేసి, తాళంచెవులు తీసుకుని బైటకి వచ్చాడు.



అతని కెందుకో చాలా కోపంగా వుంది. తన శాంతిని, ఆనందాన్ని భగ్నం చేయటానికి అస్సలు వీళ్ళంతా యెవ్వరు? స్వప్న తనది. స్వప్న కావాలని కోరుకున్నాడు. భార్యగా చేసుకున్నాడు. ఆ పెళ్ళి చెల్లదుట. తనకే చెబుతున్నారు. తను ఒక లాయరుననే సంగతి వీళ్ళంతా మర్చిపోతున్నట్టున్నారు.

బైట జోరున వాన పడుతోంది. గాలి ఎడా పెడా వీస్తోంది. బాప్‌రే! యిదేం వాన! యెన్నడూ యెరగనంత కుంభవృష్టిగా కురుస్తోంది. సుధీర్ వచ్చి కారులో కూర్చునే లోపలే తల, బట్టలు మొత్తం తడిసిపోయినాయి. కారు స్టార్టు చేసాడు. లైట్ల కాంతిలో వాన నీళ్ళస్థంభాలుగా కన్పిస్తోంది. వాటిని తోసుకుంటూ, ఛేదించుకొంటూ వెళ్తున్నంత బరువుగా కదులుతోంది కారు. రోడ్డుమీద ఒకటి, అరా తప్ప కారుల రద్దీ కూడా లేదు.

సుధీర్ డ్రైవ్ చేస్తూనే ఆలోచిస్తున్నాడు. బి.పి.తో తను పడిన గొడవ అంతా స్వప్న వింటూనే వుంది. ఈ రగడకి తనకి సిగ్గుగా వుంది. కానీ ఏంచెయ్యటం. వాళ్ళు తనని వదలరు! స్వప్నకి కోపం వచ్చి తన మీద పోట్లాడితే ఫర్వాలేదు. స్వప్నకి నచ్చ చెప్పవచ్చు. కానీ స్వప్న ప్రభావమే చిత్రం! ముడుచుకు పోతుంది. ఆగ్రహం కంటే, బాధ ఎక్కువ పడుతుంది. తనని తాను నిందించుకుంటుంది. ఘనీభవించిపోయినట్టుగా నిరాసక్తి నిండిన చూపులతో పాషాణంలా వుండే ఆ స్వప్న అంటే సుధీర్‌కి లోలోన భయం! స్వప్నలో చాలా మంది స్త్రీలలో కనిపించని అసాధారణమైన నాజుకు భావాలు వున్నట్టే మరో విపరీతమైన మనస్తత్వం వుంది. ఎవరితోనయినా తగాదావస్తే, యెదురు తిరగదు, తర్కించదు. ముందే తనే తల వంచేస్తుంది. ఆ వంచేయటం ఉత్తుంగతరంగ తాకిడికి తల వంచినట్టుగా వుంటుంది.

సుధీర్ కళ్ళముందు ఎన్నెన్నో దృశ్యాలు కదులుతున్నాయి. అర్ధరాత్రివేళ యెప్పుడయినా మెలకువ వచ్చి, తాను లేచి చూస్తే పక్కన స్వప్న వుండేదికాదు. ఏమయిందా అని లేచి చూస్తే మంచానికి దూరంగా, ఏ కుర్చీలోనో, కిటికీలోనో గోళ్ళు కొరుకుతూ కూర్చుని వుండేది. తను లేచి వచ్చేవాడు.

భుజాల మీద చేతులు వేస్తూ "యిక్కడెందుకు కూర్చున్నావు?" అనేవాడు.

"నిద్ర రావడం లేదు" చిన్న పిల్లలా కళ్ళెత్తి చూస్తూ భయంగా అనేది.

"ఎందుకని?"

"కాస్త నిద్రపడితే చాలు పీడ కలలు వస్తాయి."

"ఏమని?"

స్వప్న తనవైపు చూస్తున్నదల్లా కళ్లు దించుకునేది.

"చెప్పు. ఏమని?" రెట్టించేవాడు.

"మోహాన్ని చంపుతున్నట్టు. అతను నా మీదకి వస్తున్నట్టు!" ఆ చూపులో దీనత్వం వుంది.

సుధీర్ తల దించుకున్న స్వప్నవైపే చూస్తూండిపోయేవాడు. స్వప్న భుజంమీద

అని వున్న అతని చెయ్యి క్రమంగా భుజాన్ని వ్రేళ్ళతో గుచ్చి పట్టుకునేది. మరుక్షణం స్వప్నని రెండు భుజాలు గుచ్చి పట్టుకుని గుండెలకి హత్తుకుంటూ "సారీ డియర్!" అనేవాడు. స్వప్న అతని గుండెలకు చిన్న పిల్లలా హత్తుకుపోయేది.

"సారీ! రియల్లీ సారీ!"

"ఎందుకు?" ఆ కంఠం అస్పష్టంగా అతి నెమ్మదిగా వుండేది.

"నేను ఒళ్లు మరిచి నిద్రపోయినందుకు. నీకు నిద్రపట్టకుండా లేచి కూర్చుంటే నేను నిద్రపోయాను. నాకు సిగ్గుగా వుంది."

అతని గుండెల్లో ముఖం దాచుకున్న స్వప్న చెయ్యి చాచి అతని నోటికి అడ్డం పెడుతూ, 'దయయుంచి అలా అనకండి' అనేది.

స్వప్నని అతను చేతులతో లేవనెత్తి తీసుకు వచ్చి మంచం మీద పడుకోబెట్టేవాడు! స్వప్నని తన వైపు తిరగమని, ఆ ముఖం తన గుండెల్లో ఒదిగిపోయేలా చేసి, ఒక చెయ్యి తలమీద వేసి జుట్టులోకి వేళ్లు జొనిపి నిమిరేవాడు. అలా పట్టుకుని తల మీద నిమురుతూ చిచ్చికొడుతున్నట్టుగా, బుజ్జగిస్తున్నట్టుగా తడుతూ వుంటే క్రమంగా స్వప్నకి నిద్ర వచ్చేది.

"ఇప్పుడెలా వుంది?" అంటే ధైర్యంగా వుంది అనేది.

"నిద్ర వస్తోందా?" అంటే 'ఊ!' అనేది.

కాసేపటికి స్వప్న నిద్రపోయేది. నిద్రపోయిన స్వప్నని చూస్తే అతనికి మనసు ప్రేమతోనూ, జాలితోనూ నిండిపోయేది. స్నప్నని చూస్తూ అతను ఆలోచనలో పడేవాడు. స్వప్నా! నీ దగ్గర నుంచి నేను మానసికంగా, శారీరకంగా యింత ఆనందం సుఖం అనుభవిస్తున్నాను. నువ్వు యెందుకు ధైర్యంగా వుండలేకపోతున్నావు? నా ప్రేమలో ఏదయినా లోపం వుందా? నీకది బలం యివ్వలేకపోతోంది యెందుచేత? నా ప్రేమ బలమైనది అయితే నీలో ఆ భయం, పిరికిదనం పోగొట్టితీరాలే! అనుకునేవాడు. తను యింత దగ్గరగా అయానని అనుకున్నా, స్వప్నలో మారుమూల భాగం ఏదో చీకటిగానే వుండిపోతోంది. ఆ మారుమూల వున్న చీకటి వేగానికి తన ప్రేమ కిరణాలు చేరలేకపోతున్నాయి.

ఎందువల్ల?

ఉదయం లేస్తే స్వప్న మళ్ళీ మామూలుగానే వుండేది. నవ్వుతూ, నవ్విస్తూ చిలిపిగా, హుందాగా వుండేది. స్వప్నలాటి భార్య వుంటే ఏ మగవాడికయినా జీవితం ఎప్పుడూ బోర్ కొట్టదేమో! ఎందుకంటే స్వప్నలాటి వ్యక్తులు నదిమీది సూర్యోదయంలా చూసినకొద్దీ ఆనందం లభించే ప్రత్యేకత గలవాళ్ళు!

సుధీర్‌కి డ్రైవ్ చేయటం కష్టంగా వుంది. కుంభవృష్టిగా పడుతున్న వానని వైపర్స్ తుడవలేకపోతున్నాయి. అతను జాగ్రత్తగానే డ్రైవ్ చేస్తున్నాడు. స్వప్న ఏం చేస్తోంది? ఇంట్లోంచి వెళ్ళిపోయి యింటికి రాలేదు. పిరికివాడు. అని తనని అసహ్యించుకుంటుందేమో! స్వప్న అలా అసహ్యించుకున్నా తప్పేం లేదు. అసలు ఆ

బి. పి. అన్నయ్యని యింట్లోంచి వెడలగొట్టి తను గెంటేయాల్సింది. గెంటేసేవాడే. తనకి మొహమాటం ఏమీలేదు. కానీ అమ్మ! ఈ సంగతి విని అమ్మ యింకా బాధ పడుతుందేమోనని భయమేసింది. స్వప్నమూలంగా తను అందరినీ నిర్లక్ష్యంచేస్తున్నానని అమ్మ అనుకోకూడదు. ఆయన వుంటే, స్వప్న తను సుఖంగా వున్నామని అమ్మకి తెలుస్తుందేమోనని ఆశపడ్డాడు. అనుకున్నది ఒకటయితే మరోటి జరిగింది.

డ్రైవ్ చేస్తున్న సుధీర్ ఎదురుగా లారీ రావటంతో సడన్‌గా పక్కకు తిప్పాడు. కారు మళ్ళీ అతను ఆశించిన విధంగా రోడ్డుమీదకి రాలేదు. రోడ్డుమీదనించి జారి, బురద లోయలో క్రిందకు వెళ్ళిపోతోంది. అతను బ్రేకుని యెంత వత్తినా లాభంలేకపోయింది. సుధీర్‌కి బ్రేక్ ఫెయిలయిందని తెలిసింది. కారు స్లోప్‌లో వేగంగా వెళుతోంది. అతను డోర్ తెరిచి దూకుదామని హాండిల్‌మీద చెయ్యివేసి పక్కకి తిరిగేసరికి మీద పెద్ద బరువు పడినట్టయింది. అతని తల దిమ్ముగా అయింది. తర్వాత ఏమయిందో అతనికి తెలియలేదు.

30

సుధీర్‌కి మళ్ళీ స్పృహ వచ్చేసరికి యెదురుగా ముఖం మీదకి తల్లి వంగి అడుగుతోంది 'సుధీ! సుధీ!'

అతను చేయి చాచాడు. దూరంగా, యెక్కడనుంచో వినిపిస్తున్నట్టుగా వుంది. 'అమ్మా!' అతను ఆ కంఠాన్ని పట్టుకోవాలన్నట్టుగా శూన్యంలోకి వెతకసాగాడు. తల్లి అతని చేతిని పట్టుకుంది. 'సుధీ!'

"అమ్మా! నేనెక్కడున్నాను? నాకేమయింది?"

"నీకా! యేం కాలేదు."

"ఎక్కడున్నానమ్మా?"

"మనయింట్లోనే! నా దగ్గరే!"

అతని తల దిమ్ముగా వుంది. శరీరం అంతా ముళ్లుగుచ్చుతున్నట్టుగా బాధ! అతనికి నిద్ర వచ్చేసింది. 'యేమైంది? నాకేమైంది?' అతనికి అర్థం గావడం లేదు. మెలకువ వస్తోంది. పోతోంది. వస్తోంది. పోతోంది. యెవరివా మాటలు? తల్లి కంఠం వింటే అతనికి శక్తి వచ్చినట్టుగా అన్పిస్తోంది.

ఆ సాయంత్రానికి స్పృహ వచ్చింది. 'స్వప్నా!' పిలిచాడు.

"సుధీ!" తల్లి పలికింది.

"అమ్మా!" అతను తల్లిని గుర్తుపట్టి లేవబోయాడు.

"ఆ ఆ లేవకు" మేనమామ కంఠం వినిపించింది.

సుధీర్ అటు తిరిగాడు. అక్కడ మామయ్య, బి. పి. అన్నయ్య. విమల, అత్తయ్య అందరూ వున్నారు. అందరినీ చూశాక అతనికి అపరిమితమైన ఆనందం కలిగింది. అతని కళ్ల హఠాత్తుగా ప్రశ్నార్థకాలు అయినాయి. 'స్వప్న యెక్కడ?' యెవ్వరూ మాట్లాడలేదు.

"స్వప్న ఏది?"

ఎవ్వరూ జవాబు చెప్పలేదు.

అతను లేవబోతుంటే తల్లి ఆపు చేసింది. "అమ్మా! స్వప్న యేది?"

"నువ్వు కసేపు పడుకో! తర్వాత చెబుతాను."

"స్వప్న ఏది?"

ఆవిడ అన్నగారి వైపు చూసింది. ఆయన సుధీర్‌మీద చేయి వేస్తూ "సుధీ! స్వప్న లేదురా! మాకు కనిపించలేదు."

"ఏమిటి! స్వప్న లేదా? కనిపించలేదా? యెక్కడికి వెళ్ళింది? యెంతసేపైంది?"

"నీకు యాక్సిడెంట్ అయి యిది మూడోరోజు. ఈమూడు రోజులనుంచీ మాకు కనిపించలేదు. యెక్కడికి వెళ్ళిందో మాకు తెలియదు. మాకు యెవ్వరికీ చెప్పలేదు."

"అబద్ధం!" సుధీర్ అరిచాడు. "స్వప్న యెక్కడికీ వెళ్ళదు. నన్ను వదిలి వెళ్ళదు. మీరు, మీరే ఏదో చేసారు. స్వప్నని చంపేసారా! బెదిరించారా? యేం చేసారో చెప్పండి."అతన్ని తల్లి పట్టుకోబోతే చేతులు విదిలించి కొట్టాడు. మేనమామ మీదకి వురకబోయాడు. అతని అరుపులకి గది దద్దరిల్లింది. ఇంతలో డాక్టరు వచ్చాడు. అతన్ని నర్సులు పట్టుకున్నారు. బలవంతంగా యింజక్షన్ యిచ్చారు.

పది నిముషాలకి అతను నిద్రపోయాడు.

(సశేషం)

ఉన్నతుడు



దేవీకిషన్

పది సంవత్సరాలనుండి ఉద్యోగ రథాన్ని హైస్కూలులో తెలుగు మాస్టర్‌గా ఈడుస్తున్న నా వయసు ముప్పై మూడు నిండి ముప్పై నాలుగులో అడుగిడింది. ఈ ముప్పై నాలుగేళ్ళలో ఊహ తెలియని నాలుగు సంవత్సరాలు మినహాయించగా మిగిలిన ముప్పై సంవత్సరాల కాలంలో ఎంతరో తారసిల్లారు చదువు ఉద్యోగంవున్న, అందరికివలెనే నాకూను క్లాస్‌మేట్స్‌గా, వీధిమేట్స్‌గా, రూమ్‌మేట్సుగా, ఊరిమేట్సుగా, పరిచయస్తులుగా, ఫ్రండ్స్‌గా, క్లోజ్‌ఫ్రండ్స్‌గా, కోవర్కర్స్‌గా, కజిన్స్‌గా, బంధువులుగా, ఆత్మబంధువులుగా ఇంకా వగైరా వగయిరాగా. వారంతా ఇప్పటికీ నా స్మృతుల పుటలలో భద్రంగానే వున్నారంటానికి నిదర్శనం తీరిక వేళల్లో గతాన్ని నెమరు వేసుకునే సమయంలో ఒక్కొక్కరే భద్రంగా చెక్కు చెదరని తమ రూపు రేఖలతో హావభావాలతో ప్రత్యక్షం కావడమే—

చదువుకునే రోజుల్లో, ఉరకలువేసే పొంగు వయసులో ఒకటి రెండు ప్రేమ కథలు కాలేజి మాగజైన్స్‌లో రాశాను నా వూహా సుందరీ మణులను నాయికలుగా చేసి విషాదాంతాలుగా ముగిస్తూ— లెక్చరర్స్‌చే మెప్పు కూడ పొందాను "బాగా రాశావు వృద్ధిలోకి వస్తావు నీవు" అని.

తర్వాత క్లాసొచ్చిన మాస్టర్ డిగ్రీకి ఈడయిన ఉద్యోగం దొరక్క మానసికంగా దెబ్బ తిని, అమ్మ తృప్తికోసం పెళ్ళాడి, పెళ్ళాంగా వచ్చిన ఆడమనిషి నా మనస్తత్వానికి పూర్తిగా విరుద్ధం అని తెలిసి మరింత చికాకుపడి, అయిష్టమైన అసంతృప్తురాలయిన యిల్లాలితో సుఖాలనుభవించినందుకు శిక్షగా ముగ్గురు ఆడపిల్లలను కని బేజారెత్తిపోయి, టి.టి.ఎ.లు యివ్వని పరిషత్‌వారిచే మంత్రించి వదలబడిన ట్రాన్స్‌ఫర్ నన్ను ఉలిపిరి కౌగితం అపారవేగంతో తుఫాన్‌లా వచ్చి సంవత్సరానికో ఊరు విసిరి వేస్తూంటే, అది నిర్దాక్షిణ్యంగా విసిరిన చోటల్లా నడ్డి విరుగ చతికిలబడుతూ, అంతరంగంలో చచ్చి, పైకి శవప్పు నవ్వు నవ్వుతూ, బ్రతుకు బండి లాగుతూ, రోజు రోజుకూ నిస్త్రాణ చెందుతూన్న నాకు కథలు రాయాలనే వుత్సాహం, వ్రాయటానికి తగిన మృదు హృదయం లేకుండా పోయి పది సంవత్సరాలు కావస్తున్నా "వ్రాయాలి, వ్రాయాలి" అన్న వ్యసన బుద్ధి మాత్రం ఇంకా పూర్తిగా అంతరించిపోలేదు.

ఈ మధ్య కన్పించిన, రచనా వ్యవసాయంలో వున్న ప్రతి మిత్రుడూ నేను కన్పించగానే వేసే మొదటి ప్రశ్న— "ఏమయినా రాస్తున్నావా?" అని.

"రాయడం లేదు" అన్న జవాబు విని, నిరుత్సాహపడిపోతూ, please you write something నీలో ఆ శక్తి వుంది, దాన్ని అంతరించిపోనీయకు. నెల తిరక్కుండా నీ కృతి ఒకటి మా కంట పడనిదే మాకు తృప్తి వుండదు" ఇలాంటివే కొన్ని మాటల్తో గాలి కొట్టడం, నేను పొంగిపోయి "అవును నేను కూడ రచనలు చేయాలి" అని నాలో నేను తలపోయడం, వెంటనే కథకు మంచి ప్లాట్ ఏది? అనే ప్రశ్నకు తటుక్కున మెరిసే జవాబు "పోచాలు" మాస్టారు.

ఎన్నిసార్లు "కథకు మంచి ప్లాట్ కోసం" గత సంఘటనలనూ సన్నిహితంగా వచ్చిన వ్యక్తులను గురించి ఆలోచనల్లో మునిగినా, వాళ్ళందర్నీ తోసుకుని ముందుకు వచ్చి పళ్ళు బిగబట్టి వికారంగా నవ్వుతూ, ఎడమచేత కుడి మీసాన్ని మెలివేస్తూ ప్రత్యక్షమయ్యేవాడు పోచాలు మాస్టారు—నవ్వొక్కటే వికారం గాని, అందగాడే అని చెప్పొచ్చు. మాట కొంచెం ముతక, పరుషం—స్టాఫ్ ఎవరూ అతణ్ని లైక్ చెయ్యరు అతడు స్టాఫ్‌ను లైక్ చెయ్యడు—హెడ్‌మాస్టర్ దృష్టిలో పోచాలు, పోచాలు దృష్టిలో హెడ్మాస్టర్ పరస్పరం తృణఖండసములు. ఊరి వారికిక్కడ పోచాలు మాస్టారిపై దురభిప్రాయం కావల్సినంతవుంది. అధ్యాపక లోకానికే మచ్చలాంటివాడని పై వారందరి ఉమ్మడి అభిప్రాయం.

ఇంతమంది విజ్ఞుల దృష్టిలో చెడ్డవాడయిన పోచాలు మేస్టారు నా దృష్టిలో చెడ్డవాడు కాక

పోవడం, పైగా తన విలక్షణత్వాన్ని ప్రదర్శిస్తున్న విశిష్ట వ్యక్తి అని నేను గట్టిగా నమ్మడం, అందుకనే కథ కోసం స్మృతుల పుటలను తిరగేసినపుడల్లా మొట్ట మొదటివాడుగా విల్చే వాడు.

* * *

నా పదేళ్ళ సర్వీసులో ఎనిమిదవ స్టేషన్ అయిన "లింగాల" హైస్కూలులో పోచాలు మేష్టారు నాకు కొలీగ్ నాలుగు నెలలపాటు రూమ్మేటుగా ఉన్నానతన్తో. ఆ స్కూల్లో జాయిన్ అయిన వెంటనే నాకు సరయిన ఇల్లు దొరకనందున వివాహిత బ్రహ్మచారిగా అతని గదిలో వుండిపోయాను. సాధారణంగా అతను తన గదికి ఎవ్వరినీ రమ్మనడు, వుండమనడట. కాని నన్ను రమ్మన్నాడు. ఆశ్రయమిచ్చాడు. ఆ కృతజ్ఞత నాలో ఎప్పుడూ వుంటుంది. నాల్గు నెలలు అతని గదిలో ఉన్నందుకు "తాటి కింద కూర్చుని పాలు త్రాగినవాని చందమే" అయింది నా పని. అందులకూడ నేను విచారించ లేదు.

పోచాలు మాస్టారు వివరాలు: సెకండరీ గ్రేడ్ టీచర్, అవివాహితుడు, అందగాళ్ళలో లెక్కే. ఎపుడూ తెల్ల గ్లాస్కోపంచె, అర చేతుల తెల్ల టెరీకాటన్ చొక్కాలో ఎడమ చేత కుడి మీసాన్ని మెలిపెడుతూ కన్పిస్తాడు. స్వంత ఊరెక్కడో అక్కడికి ముప్పైమైళ్ళ దూరాన వున్న చిన్న పల్లెటూరు. అక్కడ అమ్మ, నాన్న ఉన్నారట. వాళ్ళ దగ్గరే ఇద్దరు తమ్ముళ్ళు కూడ వున్నారట. వాళ్ళింకా వయ సెరిగినవారు కారట. సెంటు భూమి లేకున్నా వాళ్ళమ్మా నాన్నగార్లక్కడే వుంటానికి కారణం వాళ్ళకు తమ జన్మస్థలంపై వున్న మమకారమేనట— నెలకోసారి జీతాలందిన రోజున వాళ్ళ ఊరు వెళ్ళి వస్తూంటాడు. అందరితో సొంతూళ్ళో తనకు వ్యవసాయం ఆస్తి పాస్తులున్నాయని చెప్తాడు. నాతో మాత్రం ఏమీ లేదని చెప్పాడు.

గ్లాస్కో పంచెలు రెండు, జేబుల్లేని, అర చేతుల తెల్లని టెరీకాటన్ చొక్కాలు రెండు, తెల్ల కట్ డ్రాయర్స్ రెండు, తెల్లగుడ్డతో లోపలి జేబులు పెట్టి కుట్టించిన చేతుల్లేని బని యన్లు రెండు, రెండు తెల్ల తుండ్లు, రెండు దుప్పట్లు, ఒక దిండు, పరచుకోడానికి ఓ ఈత చాప (అదే చైరూ, సోఫా అన్నీ పడుకోవడానికి ఓ నులక మంచం వుందిగాని, ఇంటి ఓనర్ చంద్రమ్మది అది.) సంవత్సరం వరకు పంచెధవళిమను చెక్కు చెదరనీక పోవడం, పారం వరకు చొక్కాను నలగనీయక పోవడం అతని ప్రత్యేకత. అతడు వాడే ప్రతి వస్తువు విషయంలో అతి జాగ్రత్త వహించడం పొదుపు వుపన్యాసాలకు మార్గదర్శకం వంటిది—కాలికి బ్లూ స్ట్రాపులున్న స్లిప్పర్స్ తెల్లని బాటంతో ఎల్లవేళలా తళతళ మెరుస్తూ ముద్దొస్తుంటాయి. వంటకు మూడు సత్తు గిన్నెలు, వాటిపైకి మూడు సత్తుప్లేట్లు, ఓ వత్తుల స్టవ్, తింటానికి సత్తు కంచం, త్రాగడానికి స్టీలుగ్లాసు, ఇత్తడి చెంబు, మంచినీటికో మట్టికుండ, స్నానానికి ఒక బకెట్, బి.సి.నాటి ట్రంకుపెట్టె ఒకటి, దానిలో బియ్యం, ఉప్పు, పప్పులు వగయిరా మూట గట్టిన అయిదారు పాతగుడ్డ సంచులు భద్రపరుచబడతాయి. తన కున్న అన్ని రకముల వస్త్రసంపత్తి గదిలో అడ్డంగా కట్టబడిన వెదురుగడ దండెంపై వ్రేలాడుతుంటుంది—ఆ గదికి వున్న ఒకే ఒక గోడ గూటిలో ఎరుపు రంగు ప్లాస్టిక్ కేసులో లైఫ్‌బాయ్‌సబ్బు, బ్లూరంగు ప్లాస్టిక్ కేసులో డెట్ సోపు, "ఇంద్ర నీలం, అరుణవజ్రం"లా భద్రంగా నిక్షిప్తములై వుంటాయి. సోపు కేసులు అపుడే షాపునుండి వచ్చిన వాటికి మల్లే మిలమిల్లాడుతుంటాయి. వాటి ప్రక్కనే కొబ్బరి నూనె సీసా ఒకటి గాజుది తెల్లది— గూటి పైభాగంలో చిన్న ఇనుప మేకుకు తగిలించబడిన అరచేతి వెలుపు చిన్న అద్దం— దువ్వుకున్న ప్రతి సమయం అద్దాన్ని మేకు నుంచి తొలగించి, దుమ్ము దులిపి, తుడ్చుకొని మళ్ళీ మేకుకు తగిలిస్తూంటాడు. నాలుగంగుళాల నిడివి చిన్న దువ్వెన అద్దం వున్నచోట వుండదు. అదెప్పుడూ ఒంటిమీదుండే బనీను లోపలి జేబులో దూరి దాక్కుంటుంది— పోచాల్ల మాస్టారి పంచెకట్టుకూడ విలక్షణమే. చెంగులు కుడివయిపు చూచేలా కడ్తాడు-ఆ చెంగు చివరలెప్పుడూ కుడి చేతిలో వుంటాయి. బర్కిలీ సిగరెట్ పెట్టె అగ్గిపెట్టెలతోపాటు— ఎడమ చేతివ్రేళ్ళు కుడి మీసాన్ని సవరిస్తూంటాయి—అతని చేతిలోని బర్కిలీ సిగరెట్ పెట్టెను మనం ఎప్పుడు చెక్ చేసుకున్నా సరే; ఛాలెంజి, దాంట్లో మూడు లేక అంతకు తక్కువే వుంటాయి సిగరెట్లు—అతను రోజు మూడు బర్కిలీ సిగరెట్లు, ఆరు మంగుళూరు బీడీలు కొంటాడు. బీడీలు గదిలో వున్నప్పుడు మాత్రమే కాలుస్తాడు. రెండు సిగరెట్లు తనకున్న రెండు లిజర్స్‌లో కాలుస్తాడు. ఒక సిగరెట్ సాయంత్రం స్కూలు వదిలిన తర్వాత అయ్యరు హోటల్లో సింగల్ టీ తాగి, తీరిగ్గా సెంటర్లో నుంచొని వచ్చే పోయేవారిని పలకరిస్తూ, దిలాసంగా కాలుస్తుంటాడు. అలా తన బర్కిలీ ధూమపాన స్టేటస్‌ను ప్రదర్శిస్తాడు. బర్కిలీ పెట్టె సహధర్మచారిణియైన 'అగ్ని పేటిక' అదొక మ్యాజిక్ పెట్టె. ఎప్పుడు చూచినా అందులో పదికి ఒకటి రెండు అటు యిటుగానే వుంటాయి పుల్లలు. అతణ్ని ఎవరయినా అగ్గిపెట్టె అడిగినా, ఆ అడిగినతను దానిలోని పుల్లల సంఖ్యను చూచి వీలయినంత వరకు అతి జాగ్రత్తగా ఒక్క పుల్లతోనే సిగరెట్ వెలిగించుకోడానికి శతవిధాల ప్రయత్నిస్తాడు గోడ చాటుకు వెళ్ళి, తల వంచి వెలిగిన పుల్ల గాలికి ఆరిపోకుండా ఎల్.ఐ.సి. వారి జ్యోతిలా, సిగరెట్ అంటుకొనేవరకు ఫీట్స్ చేస్తాడు. ఖర్మకాలి ఆరిపోయిందో రెండోది వెలిగించడానికి బిడియపడుతూ మాస్టారివంక చూస్తాడు. మాస్టారు పళ్ళు బిగబట్టి నవ్వుతూ "ఇంకోటిగూడ గీకు" అని అనుమతిస్తూనే "అయినా సిగరెట్ ఎల్గించుకో రాకపోతే సిగరెట్లెందుకు తాగాలె" అని చల్లగా చీవాట్లేసి అగ్గిపెట్టె మరొకసారి అడక్కుండా చేస్తాడు. ఒకసారి సందర్భం చూచి అన్నాను "మాస్టారూ అగ్గిపుల్ల దగ్గర అంత కోపీనం చూపుతున్నట్లు కన్పించడం మంచిది కాదేమో" అని.

పోచాలు మాస్టారు నవ్వాడు. "రెగ్యులర్‌గ సిగరెట్లు బీడీలు తాగే అలవాటుంది అగ్గిపెట్టె

కొనుక్కొనుటకు కౌపీనం చూపె గాడ్దికొడుకు లంచె నాకు మంట-గండుకె గట్ల ఇన్సల్ట్ చేస్త" అన్నాడు.

రోజూ ఆ వూరి జనాన్నంతటికీ టీ, కారా, పాన్ సిగరెట్ వగయిరా సప్లయి చేస్తున్న ఏకైక హోటల్ కమ్ పాన్‌షాపు ప్రొప్రయిటర్ అయిన "అయ్యర్"ను పద్దులు రాసే విషయంలో నెలవారి డబ్బు లిచ్చేప్పుడు పద్దులన్నింటినీ టోటల్ చేసే విషయంలో కొట్టివేతలు, తుడుపులు, చేర్పులు మార్పులతో ఏ కాస్త అవకాశం చిక్కినా మోసం చేసి లెక్క తగ్గించి యివ్వడానికి ప్రయత్నిస్తాడు. అయ్యరు కూడ ఇతనిపై అనుమానం వున్నా అది బయటపెట్టి, పద్దుల పుస్తకం పిచేతి కివ్వను రాయడానికి అని ఖచ్చితంగా చెప్పడానికి జంకుతాడు. ఒకసారి తగాదా పెట్టుకున్నందుకుగాను కసితో సానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు లేనిపోనివి చెప్పి, రప్పించి, పట్టించి పందరూపాయలు చిలుం వదిలించాట్ట.

"గీ అయ్యరు-ఇంకో పోటీ హోటల్లేదని గాడ్దికొగుకు మనల్నందర్ని ఎర్రిగాడ్దులనుకుని రోజూ 'నీల్లచా' పోస్తడు. అది 'చా' అంటరః కాదు సారూ కాదు. అది స్లో పాయిజన్, అవునంటరః కాదంటరః అహాః మీరే చెప్పండి. గందుకే నేను ఈ లమ్డికొడుకును సందు దొరికితె చాలు, మోసం చేస్త. నామీద అనుమానంతో చస్తున్నడు ముండకొడుకు" అహహ అంటూ నవ్వాడొకసారి.

"ఛ, తప్పుకాదా అది" అన్నాను.

"తప్పాః అంటూ మళ్ళీ నవ్వి, ఇసొంటి గాడ్దులగ్గర న్యాయం ధర్మం అనుకుంట నీతి మార్గం పోయినోడు తప్పు చేసినట్లు. కాని నేను చేసేది తప్పు కాదు. ఎట్లంటరేమో. చెబుత. ఈడిచ్చే నీల్ల చాకు లెక్కకొద్ది తప్పకుండ పయిసలి స్తే ఆనికి న్యాయంగ రావల్సిన లాభానికి నాలుగు రెట్లెక్కువిచ్చినోళ్ళం అయితం. బండకు బండ పావులబిల్ల మనమిస్తె కనీసం పది పయిసల ఖరీదు చేసె 'చా' అన్న పోస్తన్నడః మీరే ఆలోచించండ్రి. ఈడు డబ్బు దయ్యం పట్టిన దొంగ నా కొడుకు. న్యాయానికిపోయి లెక్కకొద్ది ఈనికి మనం పయిసలిస్తే పదేండ్లు పోయేసరికి పదిరవై వెయ్యిలు కమాయించి, ఆ పయిన ఏడాది తిరగకుండనే లక్షాధికార్లై అప్పుడు ఇగ చూసుకోండ్రి రక్తాన్నే తాగుతాడు."

కాని అతను చేస్తున్న తప్పు పనిని సమర్థించుకోవడానికి చేస్తున్న వితండ వాదమది అని నాకు తెలుసు. ఎక్కడో పరప్రాంతమయిన 'కేరళ' నుండి బ్రతుకుతెరువు కోసం వచ్చిన అయ్యరును మోసం చేయటం నాకిష్టంలేదు. అయ్యరు యొక్క అసహాయతపై మంచితనంపై జాలి, పోచాలు మాస్తారు దౌష్ట్యంపై ద్వేషం, మా స్కూలు స్టాఫ్‌కు పీకలబంటి వున్నట్లు పోచాలుగారి పరోక్షంలో వారి మాటల వల్లెప్పుడూ వ్యక్తమవుతూనే వుంటుంది. నేను కూడ వాళ్ళ అభిప్రాయంతోనే ఏకీభవిస్తుండేవాణ్ని. కాని "నీవు చేస్తుంది అక్షరాలా తప్పు నీ కిది న్యాయం గాదు" అని పోచాలు మాస్తారితో గట్టిగా వాదించి చెప్పాలని ఎన్నోసార్లు యత్నించి కూడ, అతని కళ్ళల్లోకి చూస్తూ చెప్పలేకపోయిన నా బలహీనత నా కిప్పటికీ అర్థం గానిది.

అయ్యరును అంతగా ద్వేషిస్తూ వంచిస్తూన్న పోచాలుగారి ఔన్నత్యం 'అయ్యరు' చనిపోయినపుడు నాకు బాగా తెలిసి వచ్చింది.

నా అన్నవాళ్ళెవరూ లేని ఆ కుగ్రామంలో గుండె జబ్బుతో అయ్యరు చనిపోతే శవ దహనం, దహన సంస్కారం సమస్య అయి కూర్చుంది ఆయన భార్యకు. ఊరివాడొక్కడు కూడ సహకరించలేకపోయాడు.

స్కూల్లో వున్న పోచాలు మాస్తారుకు విషయం తెలియగానే వెంటనే పర్మిషన్ పడేసి స్టాఫ్ రూమ్‌లో పేపరు తిరగేస్తున్న నావద్ద కొచ్చి, "సారూః మన హోటల్ అయ్యరు పోయిండట పాపంః అయన భార్య ఒక్కతి దిక్కుతోచక, సహాయంలేక ఏడ్చుకుంటూ కూర్చున్నదట పాపంః నేనక్కడికే పోతున్న. మీరు కూడా రావాలె" అన్నాడు. అది ఆదేశం అనుకోవచ్చు లేక అభ్యర్థన అనుకోవచ్చు-అతను మాటాడే తీరు, కంఠస్వరంలోని

మ్యాజిక్ అది.

"సరే! పదండి" అని హెడ్మాస్టారి వద్ద పర్మిషన్ తీసుకుని పోచాలుగారిని వెంబడిస్తూన్న నా వంక హెడ్మాస్టర్‌గారు వింతగా చూసిన చూపు నాకిప్పటికీ గుర్తుంది. ఆ చూపులో "ఆ త్రాగుబోతు వెధవతో నీకిదేమిటయ్యా చెడు సావాసం! నీవు కూడ అల్పవ్యక్తిత్వం గలవాడివేనా, ఛీ!" అని తిరస్కార భావం. కాని ఎవరి తిరస్కార చూపులు గాని, విమర్శలు గాని నన్ను పోచాలు మాస్టారిపై నాకు కలిగిన సద్భావం నుండి దూరం చేయలేకపోయాయి.

మేము వెళ్ళేసరికి వీధివారంతా గుమిగూడి నుంచొని సానుభూతి వచనాలు పల్కుతున్నారేగాని జరుపవలసిన కార్యక్రమం గురించి ఎవరూ ముందుకు రావడంలేదు. పోచాలు మాస్టారు గుంపును చీల్చుకొని వెళ్ళి, అయ్యరు భార్యను ఆత్మబంధువులా ఓదార్చి, శవాన్ని మోయడానికి తన మద్యపాన స్నేహితులిద్దరిని పిలిపించి (పోచాలుగారి ఆ స్నేహితు లిద్దరు నిరక్షరాస్యులు, ఆ వూరి సభ్యజనం దృష్టిలో కానీ విలువచేయని జులాయి వెధవలు, త్రాగుబోతులు, సభ్యసంఘ బహిష్కృతులు) అయత్తపరచి, నన్ను కేకేసి—

"సారూ! చచ్చి మీ కడుపున పుడత-మీరే మనుకోవద్దు. మీరు కూడ ఓ భుజం అందిస్తే 'అయ్యరు'ను ఇక్కణ్ణుంచి దాటించేద్దాం. ఇవి చేతులు కావు" అంటూ నా రెండు చేతులూ పట్టుకున్నాడు.

పోచాలు, అతని పానమిత్రు లిద్దరు, నేనూ మొత్తం నలుగురం కలిసి అయ్యరును ఊరు దాటించి దహన సంస్కారాలు జరిపించాము. శవం అంటేనే భయపడే నా చేత నిస్సంకోచంగా, నిర్భయంగా ఒక అనాధ శవాన్ని మోయించి, నాలోని నిజమైన దివ్యమానవుణ్ణి మేల్కొల్పి, నాపై నాకే గర్వాన్ని కలిగించిన పోచాలుగారి వ్యక్తిత్వాన్ని ఎప్పటికీ మరిచిపోలేను.

అయ్యరు దహనక్రియ జరిగిన తర్వాత చెరువులో స్నానం చేస్తుండగా పోచాలుగారు అన్న మాటలు నా కిప్పటికీ జ్ఞాపకం—కాని ఆ మాటలకు విలువిచ్చి అంగీకరించే పెద్దవాళ్ళెవ్వరు?

ఆ మాటలివి— "సారూ! అమీరుగాని, గరీబుగాని ఊరోడుగాని, పొరుగూరోడుగాని, ఏ మతపోడుగాని మనిషి చచ్చిపోంగనే, దహనమో, ఖననమో ఏదో ఒకటి వెంటనే చచ్చిపోయినోని కుటుంబానికి పైస ఖర్చులేకుండ ఊర్లో అయితే పంచాయతీవాళ్ళు, టౌన్లో ఐతే మున్సిపాలిటీవోళ్ళు తమ బడ్జెట్‌లోంచి ఖర్చుపెట్టి సింపుల్‌గ జరిపిస్తే, గరీబోనికి, పరదేశపోనికి ఏ బాధ వుండదు. అయ్యో! నేను చస్తే నా పీనుగు నెవ్వడు మోసుకెల్తాడు? ఎలా అంత్యక్రియలు జరుపుతారు? దిక్కులేని చావు చావవల్సి వస్తుందే అని విచారంలేక ఆ చచ్చేదేదో దిగులులేక చస్తడు. వాని భార్యా పిల్లలక్కూడ గిటువంటి నరకయాత నుండదు. ఏమంటరు? కాని అన్ని హంగులు అర్థబలం అంగ బలం ఉన్నోని ఏలుబడిల వున్న మన దేశంల ఈ పని జరిగేదే నంటర? వ్చ్"—

ఎంత లోతుగా ఆలోచించి అన్న మాటలవి. కాని అర్థం చేసుకొనే దెవరు?

* * *

అయ్యరు భార్య అందగత్తె. పాతికేళ్ళ స్త్రీ. మూడేళ్ళ కొడుకామెకు. భర్త పోగానే ఒంటరిదయిపోయి 'కేరళ' ప్రయాణం కట్టింది. అక్కడే కూలీ నాలీ చేసుకొని పొట్టపోసుకుంటానని. పోచాలు మాస్టారు ధైర్యం చెప్పి ఆమె అభిప్రాయాన్ని మాన్పించి, ఆమెకు అండగా నిల్చి, తీరిక సమయాన్నంతటినీ ఆమె హోటల్ నిర్వహణకు పూర్తిగా వినియోగిస్తూ హోటల్ యధాప్రకారం నడిచేలా చేశాడు.

ఇంతటి ఉన్నత వ్యక్తిత్వం వున్న పోచాలుగారు ఆ వూరి జనుల, మరియు తోటి అధ్యాపకుల దృష్టిలో నీతి బాహ్యుడుగా లెక్కింపబడడాని క్కారణం అతడు అందరిలా సంస్కారపు ముసుగును ప్రదర్శించక, తనలోని సహజ బలహీనతలను బాహాటంగా ప్రదర్శించడానికి సంకోచించకపోవడమే.

జనం అతనిలో వేలెత్తి చూపే అవగుణాలు రెండు. ఒకటి నిత్యం గోప్యం లేకుండ కల్లు త్రాగుతాడు. రెండు—తనకంటే యిరవయి సంవత్సరాలు అధిక వయస్కురాలయిన నలభయి ఐదేళ్ళ చంద్రమ్మతో వ్యభిచరిస్తాడు. (పైగా ఎవరయినా అడిగితే నిర్భయంగా నిజం ఒప్పుకుంటాడు) కాని నా దృష్టిలో అవి రెండు అవగుణాలు అన్పించలేదు. అంతకంటె ఘోరమైన దుర్వ్యసనాలకు, చీకటి తప్పులకు అలవాటుపడినవారెందరో సంఘంలో నీరాజనాలందుకుంటున్నారు మహాత్ములు, ఆదర్శపురుషులు అని. మరి పోచాలు మాస్టారు అపఖ్యాతిపాలు కావడాని క్కారణం, అతనిలోని నిర్భీకత, నిర్మొహమాటకారితనం - నాగరికులం సభ్య ప్రపంచమానవులం అని స్వయమ్మన్యులయిన వారు, తోటివాని నిర్భీకతను, నిర్మొహమాటకారితనాన్ని భరించలేరుకదా! అందుకే అతనిపై ఈ దుష్ప్రచారం అని నేననుకున్నాను. అయితే పోచాలు మాష్టారు కల్లు పాకలో అలగా జనం మధ్య కూర్చుని కల్లు త్రాగటం అలగా జనం కాని వారిచే దూషించతగిన విషయం కాదు అని నేను మాత్రం ఎలా అనగలను? ఆ విషయమే అతన్ని కదిలించాను.

"మాష్టారూ! మనం చదువుకున్నవాళ్ళం! పిల్లలకు జ్ఞానబోధచేసే మనకు ఇది తగదు" అన్నాను మెల్లిగా.

"తాగుడు తగందా? తగింది ఒక్క పంతుళ్ళకేనా లేక దేశమందరికా?" అన్నాడు.

"అబ్బబ్బ! దేశం గొడవ మనకెందుకండీ? మనం టీచర్స్ం గదా! కాస్త సభ్యతగా వుండాలి కదా!"

ఎడం చేత కుడి మీసం మెలేస్తూ, తలతిప్పకుండా నా వంక వంకరగా చూస్తూ, "సారూ! గీ సభ్యత అనే మాట ఇంకెవరన్నా అంటే నాలుగు దులిపి నోర్మూయించేటోణ్ణి. కాని మీతో చర్చిస్తాను. మీరడుగుండ్రి చెప్తాను "పంతుళ్ళు సభ్యతగ వుండాలె" అని గద మీ ప్రశ్న. అయితే నాకో అనుమానం. సభ్యత అంటే ఏంది సారూ?"

ఆ ప్రశ్నకు సరిపడే సరియైన జవాబు నా దగ్గర సిద్ధంగా లేదు. అయినా వివరించడానికి ప్రయత్నించాను. "సభ్యతంటే చదువూ సంస్కారం వున్న మనబోటివాళ్ళు నాగరికంగా వాక్శుద్ధి, అంతశ్శుద్ధి, కర్మశుద్ధి కలిగి ఇతరులచేత చెడ్డవాడని వేలెత్తి చూపించుకోకుండా, సాధ్యమయినంతవరకు ఇతరులకు ఆదర్శంగా వుండడము."

"సారూ! బాగా చెప్పిండ్రు! ఆదర్శం గురించి మనల్ని పాలించే నాయకుల దగ్గర చాల నేర్చుకుంటున్నాం. దాని గురించి చెప్పనవసరంలేదు. ఇకపోతే 'ఆ శుద్ధి ఈ శుద్ధి' అన్నారే మీరు, దానిలో నా దగ్గర లేని శుద్ధి ఏదో చెబితే సరిచేసుకుంట. చెప్పండి!"—అతని ప్రశ్న.

సరియయిన జవాబివ్వడానికి దిక్కు తోచక తటపటాయిస్తున్న నన్ను చూచి అన్నాడు—
"సారు! అగో! గదీ సభ్యతంటె"—

"ఏది?" అర్థంగాక అతని ముఖంలోకి చూశాను.

"ఏదా? మీది—మీది సారూ సభ్యత! ఓరీ పోచాలూ! పబ్లిక్‌గా తాగే సన్నాసీ! నీవు పంతులుద్యోగానికి తగవురా?" అని మీ మనసులో గొడవ పెడుతున్న మాటల్ని పెదవి దాటి రానియ్యలేకపోతున్నారు చూడు, గదీ సభ్యతంటె. అవునా సారూ?" అంటూ పకపకా నవ్వుతూంటే అతని కళ్ళల్లోకి చూడలేక తల తిప్పుకున్నాను.

తర్వాత తనే అన్నాడు—"పెద్ద పెద్దోళ్ళకే పెద్ద పెద్ద బలహీనత లుండంగలేనిది, ఏదో గింతింత చదివి పంతుల్నయిన నాకున్న గీచిన్న బలహీనతను తప్పు పడితె ఎట్ల సారూ? క్లబ్బుల్లో కేబరే చూచుకుంట తాగుతు, వ్యభిచారం చేస్తూ వెయ్యిలకు వెయ్యిలు లక్షలకు లక్షలు నాశనం చేస్తున్న పెద్దోళ్ళు గొప్పోళ్ళుగ చలామణి అవుకుంట ఆదర్శపురుషులు అయిత రెట్ల? కల్లు పాకల కూచుండి రూపాయి కల్లు మాత్రం తాగుతున్నందుకు నేను తప్పుడు ముండకొడుకు నెట్లయిత? అద్దాల మేడల విస్కీ తాగినోడు గొప్పోడున్ను కల్లుపాకల కల్లు తాగినోడు తాగుబోతా? మరి సర్కారు

కల్లు పాకలెందుకు పెట్టుకోనిచ్చినట్లు చెప్పండ్రి?

"ఇగపోతే మన్దగ్గర చదువుకొనే పిల్లలే మనుకుంటారు? అనిగద మీ అనుమానం!"

"కల్లు తాగడానికే వుంది" అని పిల్లలక్కూడ ఎరికే. అయితే కల్లు తాగడం ఒక దుర్వ్యసనం. బీడీ సిగరెట్లు తాగడం వంటి వ్యసనకంటె కూడ కల్లు తాగడం హానికరమైన వ్యసనం" అని వాళ్ళకు చెప్పితే ఏ గొడవ లేదు. అలా తాగడం మనిషిలోని బలహీనత. దానికి మీరు గురి కావద్దని చెపితె చాలు. అంతేగాని కల్లు సారా తాగేటోళ్ళు చెడ్డవాళ్ళు. పంతుళ్ళు మాత్రం అస్సలె తాగొద్దు. అట్లెవ్వడన్న తాగే పంతులుంటె వాడు పాపాత్ముడు, రాక్షసుడు, నీతి నియమంలేని కుక్క-వంటివాడు అని చెప్పటం తప్పు. అట్ల చెప్పేటోటి పంతుళ్ళు, పెద్దలున్నారు చూడుండ్రి—అగో గాళ్ళు—గా నా కొడుకులు చిన్నపిల్లల మనసులను మలినం చేసేటోళ్ళు-కాని నాలాంటోట్లుగాదు. తెల్సిందా సారూ?" అంటూ లెక్చర్ దంచేశాడు పోచాలు మాష్టారు—

చంద్రమ్మ యింట్లో ఓ గదిలో పోచాలుగారి నివాసం. అతన్తో నేను. చంద్రమ్మకు పెళ్ళయింది. భర్తను విడిచి ప్రియునితో లేచి వచ్చి 'లింగాల'లో కాపురం పెట్టింది. పిల్లలు లేరు. ఆమె చరిత్ర తెలిసిన గ్రామం ఆమెను చులకనగా చూస్తుంది. లేపుకొచ్చిన ప్రియుడు ఆ వూరిలో చంద్రమ్మతో కాపురం పెట్టి, చంద్రమ్మతో సుఖించి ఆమెకు చనిపోతూ ప్రతిఫలంగా మిగిల్చి పెట్టిన ఆస్తి ఒక చిన్న పెంకుటిల్లు, ఎకరం పొలం. పొలంలో వచ్చే గింజలతోనే చంద్రమ్మ సంవత్సరమంతా వెళ్ళదీసుకోవాలి. చంద్రమ్మ వయస్సు నలభై అయిదు సంవత్సరాలు. కాని పాతికేళ్ళ పోచాలుగారితో ప్రస్తుతం యింకా పూర్తిగా చావని కోరికల్ని తీర్చుకుంటుంది. అంత వయసున్నా ముఖంలో ఆకర్షణ గాని, ఒంటి పటుత్వంగాని చెక్కు చెదరలేదింకా. నే నా యింట్లో చేరినరోజే అంత వయసులోను సెక్సీగా కన్పిస్తున్న చంద్రమ్మ నన్నాకర్షించి, నాలో కొర్కెను రేకెత్తింప చేసింది—

ఆ గదిలో చేరిన నాల్గో రోజు పోచాలుగారు నన్నడిగారు "సారూ! ఒంటరిగుంటున్నారు వయసులో వున్నారు. వ్యభిచారం తప్పనాదనుకుంటె మన చంద్రమ్మను వాడుకొండ్రి. ఏమనదు. నేను చెప్పి వుంచిన. ఇగ మీ యిష్టం. మీకిష్టమయితే పెళ్ళదల్చుకుంటె మాత్రం దాని చేతుల పది రూపాయలు పెట్టుండ్రి పాపం దిక్కులేని ముండ. 'ఛ' ఇది తప్పు అని అనుకుంటున్నర-అయితే పోవద్దు, అది మిమ్ముల్ను బలవంతం చేస్తదేమో అని అనవసరంగ ఫికరు పడకండి. ఎంత చెడినా దానికి కూడ నీతి ఏడ్చి చచ్చింది-అది నా అటువంటిదె టోలాముండ."

నిర్లజ్జగా, అంత పచ్చిగా అతనడిగిన తీరుకు నాకు సిగ్గనిపించి "ఛ, ఛ ఏం మాటలండీ అవి-నేనలాంటివాణ్ణి గాను" అన్నాను. అంతరంగం సంతసించి అంగీకరించినప్పటికీ నా బూటకపు సభ్యత అంతరాత్మ నోరు నొక్కుతుందని నాకు తెలుస్తూనే వుంది ఒక వంక.

"పొరపాటు పడ్డాను. క్షమించండ్రి సారూ! ఇంకెప్పుడీ విషయం మీ ముందెత్తను. ఏమనుకోకుండ్రి" అన్నాడు. తర్వాత మా మధ్య చంద్రమ్మ ప్రస్తావన ఎప్పుడూ రాలేదు. చంద్రమ్మ పోచాలు తమ రహస్య సంబంధ కార్యక్రమాలను మూడో మనిషి ఒకడున్నాడు అనే ఇంగితంతో చాలా గోప్యంగా జరుపుకునేవారు మాకెంతమాత్రం అనుమానమయినా రాకుండా. అది సభ్యత కాదా?

పోచాలు మాస్టారి దిన చర్యలలో ఒక కల్లు త్రాగుడు, చంద్రమ్మతో సంబంధం మినహా మిగతా అన్ని విషయాల్లో నేను ఎప్పుడూ అతణ్ని వెన్నంటి వుండేవాణ్ని ఎవ్వరి విమర్శలను లెక్క చేయకుండా.

అయ్యరు పోయినప్పట్నుంచి రోజూ ప్రొద్దున్నే స్నానాదులు ముగించుకుని అయ్యరు భార్య హోటలుకు వెళ్ళి, టిఫిన్ కాఫీ తీసికొని, హోటల్‌కు కావల్సిన దినవారీ ఖర్చులు వగయిరా తెప్పించడంలో, లెక్కలు చూచి పెట్టడంలో పోచాలు గారితోపాటు నేనూ

తంటాలుపడుతున్నాను. పోచాలుగారిని వెన్నంటి హోటలు వ్యవహారంలో నేను కూడ సహాయం చేయడాని క్కారణం అయ్యరు భార్య అందం మీద నాకున్న పిచ్చి వ్యామోహం. దానితర్వాతే పరోపకార పరాయణత అనే పెద్ద మాట—ఆమెపై నాకు కల్గిన వాంఛ ఎంత బలీయమవుతూ వచ్చిందంటే క్షణం తీరిక దొరికినా నన్ను ఆమె ముందుకు లాక్కెళ్ళి కూర్చొబెట్టేది. రెండు మూడుసార్లు లీజర్ పిరియడ్సులో కూడ తలనొప్పి అన్చెప్పి పర్మిషన్ పడేసి ఆమె హోటలుకు వెళ్ళి టీ త్రాగుతూ కూర్చున్నాను ఆమెతో కబుర్లాడుతూ. ఆమెను కదిలించి కవ్వించి, ప్రేమ రగిలించి పొందగల లౌక్యం నాలో లేదు. కాని యీ పరకీయా వ్యామోహాన్ని జయించడం నాకు కష్టమయిపోయింది. ఉండబట్టలేక సందర్భం చూచి రడిగాను పోచాలుగారిని— "అయ్యరు భార్య కారెక్టర్ ఎలాంటిది" అని.

"కారెక్టరా? అంటే శీలం గురించేనా మీ అడుగుతుంది? చాల మంచిది. గుట్టుగ కాపురం చేసుకునే సంసార స్త్రీ, నిప్పులాంటిది" అని జవాబిచ్చాడు.

ఆ జవాబు నాకు సంతృప్తినీయకపోవడాని క్కారణం, ఆమెను గురించి నేను విన్నదానికి పోచాలు చెబుతున్నదానికి పొసగకపోవడమే. మా కో-టీచరయిన హిందీ మాస్టా రొకసారి బస్సులో వస్తూ ఈమె కూర్చున్న వెనుకసీట్లో కూర్చొని, సీటు క్రిందుగా కాలు ముందుకు పోనిచ్చి, కాలుతో రాయబారం నడిపితే ఒక్కసారి వెనక్కి తిరిగి చూసి నవ్వి తన కాలుతో తన కిష్టమేనని తెలిపిందట తన కాలును తొక్కించుకుంటూ, తొక్కుతూ. ఆ రెస్పాన్సును అసరా చేసికొని సీటు పైనుండి చేయి పోనిచ్చి, చెంపలు జుట్టు వ్రేళ్ళతో సవరిస్తూ వుంటే విసుక్కుంటూ చేతికందకుండా బాగా ముందుకు జరిగి కూర్చుందట జనం పసిగడుతున్నారేమో అనే భయంతో. ఈ విషయాన్ని లీజర్ పీరియడ్‌లో అక్కడున్న టీచర్స్‌తో బహు చక్కగా వర్ణించి చెబుతూంటే లొట్టలు వేసికొంటూ వింటూ కూర్చున్నవాళ్ళల్లో నేనొకణ్ణి. మొగుడు లేని సమయం చూచి కదిలించకపోయారా అని లెక్కల మాస్టారడిగితే నా కంత ఇంటరెస్టు ఏడ్చి చావలేదు లెండి ఆ కేరళ దానిపై" అంటూ ముగించాడు. అప్పటి నుండి ఆమె నడవడికను కనిపెడుతూనే వున్నాను. చీప్ మనిషిలా కన్పించలేదు కనీసం చూపుల్లోనయినా. అయినా సందేహ నివృత్తి కయి పోచాలుగారిని అడిగితే 'నిప్పులాంటి ఆడది' అని సర్టిఫై చేశాడు.

ఇహ లాభం లేదనుకొని హిందీమాస్టారు వర్ణించి చెప్పిన విషయాన్ని వివరించి అలాంటి స్త్రీని నిప్పులాంటిదని బలపరుస్తున్నా రేమిటీ? అవకాశం లేకకాని చిక్కితే హిందీ మాస్టారుతో వెళ్ళడానికి ఎలాంటి సంకోచం లేని స్త్రీ అనుకోవచ్చుగదా! అన్నాను.

నా మాటలకు పొట్ట చెక్కలయ్యేలా విరగబడి నవ్వాడు పోచాలు మాష్టారు. నవ్వి నవ్వి "సారూ! ఎం. ఎ. ఫస్టు క్లాసొచ్చినా మీకు లెక్చరర్ వుద్యోగం ఎందుకు రాలేదో నాకిప్పుడర్థమయింది. గామాత్రం లౌక్యం తెల్వకపోతే ఎట్లసారూ? గా హిందీమాష్టారు మాత్రం గింత సింపుల్ విషయాన్ని తనెట్ల వర్ణించి చెప్పిండు. ఆడంగినాయాలు! మీరెట్ల దీన్ని పెద్ద తప్పుగ అర్థం చేసుకున్నారు? వాడు చెప్పింది అక్షరాల నిజమే కావచ్చు. ఇద్దరు ఒకళ్ళ కాలొకలు తాకించుకుంట కొద్దిగ గా గడియ సేపు ఆనందం వీడూ అదీ పొందితే పొందవచ్చు. అది తప్పెట్లయితది? ఈనికి లేని తప్పు దానికే వచ్చిందా? గంతమాత్రాన అది వ్యభిచారం చేసే ఆడది అయిపోతదా? బుర్ర లేనివాడు గంత సింపుల్ విషయాన్ని పది మందిల గొప్పగ భావించి చెప్పుకుంటె చెప్పుకున్నాడు గావచ్చు అంతమాత్రాన మీరెట్ల గింత చెడ్డ అభిప్రాయానికి రాగల్గిండ్రు ఆమె మీద? బస్సుల్ల, రైళ్ళల్ల, సిన్మాల్ల ఎంతమంది ఆడ మగ కాలూ, చెయ్యి ఒళ్ళు రాసుకుంట కూచుంటలేరు! మీకు తెలిసినోళ్ళను అంత మడిగట్టుకొని "నన్ను ముట్టుకోకు నామాల కాకి" అనే విధంగ వుండే

టోళ్ళను ఒక్కల్ని చూపించుమంత్రి-నిజంగ అటువంటోళ్ళెవరన్న వున్నరంటే వాళ్ళు మానసికంగనో, శారీరకంగనో ఏదో రుగ్మత గలవాళ్ళయి వుండాలె. అంతే! మామూలు ఆరోగ్యంతో యవ్వనంలో వున్న మనుషులంత గట్లనే గా అయ్యరు భార్య తీరు హిందీ మాస్టరు తీరే వుంటరు. గాయింత గూడ సరదా లేని మనుషులు జీవమున్న శవాలు సారూ! అయ్యరు భార్య శవంగాదు. మనిషి. జీవం, యవ్వనమున్న మనిషి. తెల్సిందా? అయినా మన మగగాడ్దుల దగ్గరున్న దుర్గుణమే గిది— ఒక్క మన పెండ్లాం తప్ప లోకంల మిగిలిన ఆడోళ్ళంత శీలం లేనివాళ్ళే, వాళ్ళంత పీతిగ బతికేటోల్లయినసరె, ఇగో! గిటువంటి ఒక్క చిన్న సంఘటన దొరికితే చాలు, "అబ్బో! అది మొగుడు చాటున ఎంతశయిన సిద్దపడే ఆడదే" అని పర స్త్రీ గురించి దుష్ప్రచారం చేస్తరు. కాని తన పెండ్లాం కూడ ఆడదే, అందగత్తే, వయసు పొంగులో వున్నదే" ఆమె కూడ ఇటువంటి చిన్న చిన్న తియ్యని అనుభవాల్ని అవకాశం చిక్కినప్పుడు అందుబాటులో వున్న వాణ్ని కళ్ళతో తనివితీరా చూసో మరీ దగ్గరగా వుంటే పరాకును నటిస్తూ కాలో, చెయ్యో, క్షణ కాలం తాకించి నూతనానుభూతిని ఆనందాన్ని పొంది వుండదా! అని కలలోనయినా తలచుకొనడానికి భయడే పిరికి నన్నాసులు" అంటూ ఏకబిగిని లెక్చరిచ్చాడు.

సంసార స్త్రీలు అనగా నా దృష్టిలో పతివ్రతలు కూడా అలాంటి అనుభవాలు కాకతాళీయంగా సంభవించినప్పుడు మైమరచి, ఆ అనుభవాన్ని తీయని చిన్న అనుభవంగా తలంచి ఆనందం అనుభవిస్తారనే మాట నాకు నచ్చలేదు. అందుకే ఖండించాను అతని అభిప్రాయాన్ని సున్నితంగా.

"సారూ! ఇది సొంత పెళ్ళాం గురించిన చేదు నిజం ఎవనికి వానికే! ఈ నిజాన్ని అంగీకరించడం మన మగతనానికే తలవంపుకదా!" అన్నాడు.

ఇహ అతనితో వాదించడం కష్టమైపోయింది. సంభాషణను ముగించే వుద్దేశంతో అన్నాను చివరి ముక్కగా— "ఇంతకూ బస్సులో అయ్యరు భార్య ప్రవర్తనలో తప్పు లేదంటారు—అవునా?" అని.

"మీ దృష్టిలో తప్పు నా దృష్టిలో మనిషి యొక్క అతి సహజమైన నీటి బుడగవంటి చిన్న బలహీనత అది. అంతే! ఆ బలహీనత మోతాదెక్కువయినవారు, ఏకాంతం, అవకాశం లభించితే వ్యభిచరింతరు. అయినా సారూ! ఆడదాని శీలం గురించి చర్చించుకుంటూ, ఆడోళ్ళందర్ని అనుమానించుకుంటూ వుండేటోడు మానసిక రుగ్మత గలవోడన్నమాట! అటువంటోనికి ఎన్నడన్న సొంత పెండ్లాం మీద చీమ కాలంత అనుమానం వస్తే చాలు జుట్టు పీక్కుని, తల బాదుకుని పిచ్చెత్తిపోతడు. కనుక మనం గురివింద పగడమును విమర్శించే అటువంటి పద్ధతిని మానుకొంటె మంచిది. చాతనయితె ఇతర్ల చేత మాన్పించితే ఇంకా మంచిది. "మనం శీలంగ వుంటె చాలు సారు! లోకమంత శీలంగ వుంటది" చివరొక్క చక్కని హితవాక్యంతో అతని వుపదేశాన్ని ముగిస్తూ నా నోరు మూయించాడు.

* * *

తర్వాత వారం తిరక్కుండా జరిగిన విషయం—

పోచాలు మాష్టారు మూడేళ్ళ కొడుకున్న, అందమయిన అయ్యరు భార్యకు, తన పాత మిత్రులిద్దరు, నేను, ఇంకో అయిదారుగురు పెద్దల సమక్షంలో క్రొత్తచీర, రవిక పెట్టి కట్టించి నుదుట కుంకుమ పెట్టి "ఈ రోజునుండి ఈమెను నేను నా భార్యగా స్వీకరిస్తున్నాను" అని చెప్పాడు.

అతని నిర్భీకత, విశాల దృష్టికి నేను మదిలోనే జోహార్లర్పిస్తూ "చంద్రమ్మను వదిలి పెట్టినట్లేనా?" అని రహస్యంగా అడిగాను.

అతని మాటలు ఇప్పటికీ నాచెవుల్లో గింగురుమంటూనే వున్నాయి. ఆ మాటలివి: "సారూ! ఈ రోజునుంచి చంద్రమ్మ నాకు తల్లి, నా భార్యకు అత్త, నా కొడుక్కు నాయినమ్మ— కనుక మాతోనే మా దగ్గర్నే వుంటది." ▣

ఆకాశాన్ని సరిజేస్తున్నాను

ఎంత బాగుందనుకున్నావు జీవితం ఓహ్
నిరంతరానందమయంగా ఉంది ఆనందానికి
కొత్తకొత్త అర్థాలే కల్పించేస్తూ
తిరిగేస్తూ గుర్తుచేసుకుంటూ నేనొక
కలల వ్యాపారినై పోయాను ఇరు సంధ్యల
ఇరుసు పూడ్చి దివారాత్ర రథం మన
అంతరంగం దడదడమని బండలదారిలా
ప్రతిధ్వనిస్తూ రథం దూసుకుపోతుండగా ఏమీ
పట్టనట్టే ఈ గట్టున సమ్రాట్టులా
ఒత్తిగిలి ఓరగంట రసాన్ని స్పందననూ కలబోసి
వడబోసి నవ్వుకుంటున్నాను ఈ రాళ్ళు
పువ్వులుగా పగులుతున్నాయి నేను
శిరః కంపనతో అనుమతిస్తున్నాను గాలి సన్నాయికీ
జాజికీ మధుపాయికీ నది అవతలి గట్టునుంచి
లీలగా సితారువాద్యం అలల కలకలలపై మిశ్రచాపానికి
కట్టుబడి తేటగా పొర్లివస్తోంది వహావాహ్ మారోసారి
నేను ఆకాశాన్ని సరిజేస్తున్నాను
మారు శబ్దాల్ని పెనవేసి ఒక
నక్షత్రాన్ని సృష్టిస్తున్నాను...

—కెవిస్సీ



23

ఆ సాయంత్రం ఇటికల సంగతి విన్న రాజేశ్వరరావు కాంపౌండరుని పిల్చి "ఆ రోగ్వి పిలక పట్టుకొని యీడ్చుకురమ్మని" పంపించేడు.

మరో అరగంటకి ఇటికలవా డొచ్చేడు కాని అతని పిలక మాత్రం కాంపౌండరు చేతిలో లేదు. ఎవరి చేతిలో ఉండడానికీ అసలతనికి పిలకే లేదు.

బ్రహ్మాండమైన క్రాపుంది.

ఆ క్రాపుని మధ్యగా చీలుస్తూ పిమెంటు రోడ్డులాంటి పాపిడి వుంది.

ఆ పాపిడి కిందున్న మొహం పిమెంటు దిమ్మలా వుంది.

ఆ మొహం కింద మొండెం పిమెంటు బస్తాలా ఉంది.

ఆ మొండెం కింద కాళ్ళు సిమెంటు దూలాల్లా వున్నాయి.

మొత్తంగా చెప్పాలంటే అతను నేచురల్ జుత్తు అంటించిన సిమెంటు విగ్రహంలా ఉన్నాడు.

ఆ సిమెంటు విగ్రహం సిల్కులాల్చీ తొడుక్కుంది.

పాలిష్టర్ పేంటు వేసుకుంది.

ఎటంచేతికి ఎలక్ట్రానిక్ వాచీ వుంది.

కుడిచేతికి కుంకుడు గింజంత ముత్యంతో ఉంగరం వుంది.

మెళ్ళో వున్న సన్నటి బంగారు గొలుసు గుండెలమీదున్న వెంట్రుకల మధ్య నల్లగడ్డితో గోధుమ నాగులా కదుల్తోంది.

ఆ గొలుసుకి ఉన్న లాకెట్ ఆ పాము పడగలా అటూ యిటూ ఊగుతోంది.

ఆ లాకెట్టులో వున్న రెండు ఎర్రరాళ్లు ఆ పాము కళ్ళలా మెరుస్తున్నాయి.

అతని పేరు పకీరు.

పేరు చూసి ఎవరైనా అతను ముస్లిం అనుకుంటే అది వాళ్ళ పొరపాటు. అతను నూటికి నూటపదకొండుపాళ్లు హిందువు.

వాళ్ళమ్మకి వరసగా అరడజనుమంది పిల్లలు పుట్టి వరసగానే చచ్చిపోయేరు. యీ ఏడోవాడు పుట్టగానే తీసికెళ్ళి పెంటకుప్పమీద పారేసి "పకీరు" అని పేరుపెట్టి మళ్ళీ తెచ్చుకుంటే బతికేట్ట. అతని తండ్రి మట్టితో కుండలు చేసి చేసి, ఆఖరికి తను చేసిన కుండతోనే కాటికి వెళ్ళి మట్టిలో కలిసిపోయేడు.

పకీరు మాత్రం మట్టి పిసకలేదు.

కుండలు చెయ్యలేదు.

ఇటికల వ్యాపారం పెట్టి యిప్పటికి రెండిళ్ళు కట్టేడు. సినీమాహాలు సగం పూర్తి అయింది, దేవుడు చల్లగా చూసి ఆ సినీమాహాలు బాగా లాగిస్తే యింక ఈ యిటికల వ్యాపారం మానేద్దామని అతని ఆశయం.

పకీరుని రాజేశ్వర్రావు చూసేడు. చూడ్డమే కాదు. అతను పెట్టిన "దండం బాబూ" కూడా అందుకున్నాడు. అయితే తను ఎదురుచూస్తున్న యిటికల రోగ్ యితనేనని తెలీదు. ఎవరో పేషెంటేమో!


"కబురెట్టినావుట. ఉన్నపళాన రమ్మంటే యేటో వనుకొని ఒచ్చేసినాను" అన్నాడు పకీరు. మనిషి సిమెంటు విగ్రహమైనా, గొంతుక మాత్రం కంచు గంట.

రాజేశ్వర్రావు, జానకి ఒక్కసారే తుళ్ళిపడ్డారు.

"ఈ చక్కారీ వెధవ యిలా ఒక్కొక్కరికి రెండేసిసార్లు ఇటికలు అమ్మి యిలా బలిసిపోయేడు" ఒళ్ళు మండిపోయింది రాజేశ్వర్రావుకి.

"నువ్వు ఏ వ్యాపారం చేస్తావు?"

"నానండి! మరి ఇటికల యాపారం కదండి."



"ఎర్రమన్ను కాదా?"

"మట్టి నా నెందుకు అమ్ముతానండి! తవఁకు తెల్దేటండి?"

"తెలీకే అడగడం."

"ఇటికలేనండి."

"చూడూ. టమాటోలు, కారట్‌లు వగైరా కొన్ని కూరలు పచ్చివి తింటేనే ఒంటికి మంచిదిట. అలాగే పచ్చి యిటికలైతేనే యింటికి మంచిదని ఏదైనా శాస్త్రం వుందా?"

ఫెడీ ఫెడీమని లెంపలేసుకున్నాడు పకీరు.

"అమ్మ బాబో, అంత మాటనీకండి మరి. ఇనుముకైనా తుప్పు పట్టుద్దేమో గాని నా ఇటికకి మాత్తరం సెక్కు సెదరదండి. ఇల్లు కూలిపోయినా, ఇటిక మాత్తరం సిన్న ముక్క కూడా యిరగదుకాక యిరగదు...."

"మరి నిన్న యీ అమ్మగారికి వేసిన ఇటికల మాటేవిఁటి?" రెట్టించేడు రాజేశ్వర్రావు.

"అసలు నా కాడ నిన్న ఉటల ఇటికే ఎవరూ ఏసుకెల్లనేదండి. ఏటా ఇయాల బేరవేఁనేదు అనికూడా అనుకున్నానండి మరి. బాబూ ఒక్కోసుట్టు అంతేనండి. అస్సలు బేరాలుండవండి. ఏటిసేస్తాం. యాపారం అన్నాక ఎగుడూ దిగుడూ ఉండవా? తవఁకి మాత్తరం తెల్దేటి? ఆ బండినంజికొడుకులు ఏడ బట్టుకొచ్చేరో ఏటో, పిల కుచ్చుకొని జాడించి మరీ అడగండి. అలాంటి కంతిరీ పనులు సేస్తే మరింక యాపారం సేసినట్టే. అమ్మగారూ ఈ పాలి నాకాడ ఏయించుగుని సూడండి. సరుకు సూసినాకే డబ్బు యిప్పించండి. అమ్మబాబో....మీలాంటోళ్ళకాడ మాటపోతే

మరింత యాపారం ఏటి సేస్తాం బాబూ.... ఎంత కావాలో సెప్పండి. రేపీయేలకి గుమ్మంకాడ ఒంపేస్తాను ఇటిక" అంటూ చేతులు కట్టుకొని నిల్చున్నాడు.

రాజేశ్వర్రావు, జానకి ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. "వీడి మాట నమ్మినా, నమ్మకపోయినా మళ్ళీ ఇటికలు వేయించుకోవాలన్నది మాత్రం నిజం" అనుకున్నారు ఇద్దరు.

"సర్లే. వెంటనే అక్కర్లేదు కాని నేను కబురు పెట్టినప్పుడు మాత్రం ఖర్ష్ణమైన ఇటిక పంపించు" అన్నాడు రాజేశ్వర్రావు.

"దండాలండి అమ్మగారూ, వెల్తానండి దొరబాబు" అని విడివిడిగా ఇద్దరికీ దండాలుపెట్టి వెళిపోయేడు పకీరు.

"వీడేవంటాడు?" అంటూ ప్రకాశరావు యిచ్చిన ఎకౌంట్ కాయితాలు తీసేడు రాజేశ్వర్రావు. చదువుతున్న అతని మొహంలో మారుతున్న రంగులు చూస్తూ కూర్చుంది జానకి.

చదవటం పూర్తిచేసి "హోరి రాస్కెల్!" అని మాత్రం అనగలిగేడు అతను కాయితాలూ జానకి చేతికిచ్చేస్తూ.

పది నిమిషాలైంది.

పావుగంటైంది.

ఇద్దరూ మాట్లాడలేదు.

పదహారో నిమిషంలో జానకే అంది "ఏం చేద్దాం" అని.

ఏఁవిఁటి చెయ్యాలో అతనూ నిర్ణయించుకోలేదు.

"న్యాయం, ధర్మం మనపక్క ఉన్నప్పటికీ, మనం ఏఁవీఁ చెయ్యలేని పరిస్థితులు కొన్ని వుంటాయి. వుయ్ ఆర్ హెల్ప్ లెస్" అన్న జగనాధం తండ్రి మాటలు జ్ఞాపకం వచ్చేయి రాజేశ్వర్రావుకి.

పోనీ ప్రకాశరావుని పిల్చి "పన్నులు కట్టిన రశీదులేవి? ఏఁవిఁటి నువ్వు చేయించిన రిపేరు? నిజంగా నువ్వు రిపేరు చేయిస్తే ఇల్లు యీ స్థితిలో ఎందుకుంటుంది? ఏఁవిఁటి నీ ఉద్దేశం?" అని నిలదీస్తే?

తిట్టొచ్చు. కాని అతను యీ ఇటికల వెధవలాగా బుకాయించేస్తే కనీసం ఇటికలవాడు అంతటితో ఊరుకుంటాడు. ఈ ప్రకాశరావు ఇంటింటికీ వెళ్ళి "చూసేరా? ఆ జగన్నాధానికి పీసమంతైనా విశ్వాసం ఉందా? యీ బొక్కి యింటికి బోలెడు డబ్బుపోసి పోన్లే స్నేహితుడు కదా అని యీ ఇంటిని కుక్కలా కాపాడుతూ వుంటే నేను అబద్ధాలాడుతున్నానంటాడు. అసలు నేను కాబట్టి డబ్బు యిచ్చో, యివ్వకో ఉంటున్నాను. కాని మరోడైతే ఎదురు డబ్బిచ్చినా వుండడు. ఏదో పాత అనుబంధాన్నిబట్టిగాని లేకపోతే నాకు యీ ఊళ్ళో ఈ మాత్రం ఇల్లు దొరక్కకాదు" అని అడిగిన వాడికీ, అడగనివాడికి కూడా చెప్తాడు.

మరైతే అతని లెక్క ప్రకారం ఆ మూడొందలు తాంబూలంలో పెట్టి ఇచ్చేసి దణ్ణం పెట్టేటవేఁనా?

నెవర్. వీడికి లొంగిపోవడవా?

పోనీ "యిది నీకూ, జగన్నాధానికీ సంబంధించిన విషయం పోయి అతన్తోనే సంప్రదించుకో" అనేస్తే?

"నయం. ఆయన సంగతి మీకు తెలేదు "వాడితో దెబ్బలాడ్డం నాకు ఇష్టం వుండదు. ఇన్నివేలు తగలేసిన వాళ్ళం, మరో మూడొంతలు తగలెయ్యలేకపోము. మరో యింత ఇటిక కొట్టుకుపోయిందనుకొని ఆ డబ్బు వాడి మొహాన కొట్టు" అంటారు. అతన్ని కాదనడం మనకి చేతకాదు" అంది జానకి.

మరేవిఁటి చెయ్యడం?

"ఏఁవీఁలేదు. ఏఁవీ తెలీనట్టే ఊరుకుందాం" అని కూడా సలహాయిచ్చింది.

ఇంకో ఉపాయం దొరికేవరకు యీ సలహా బావున్నట్టే అనిపించింది రాజేశ్వర్రావుకి.

24

మర్నాడు పొద్దున్న యింటికి సున్నం వెయ్యడానికి ఆరడజనుమంది ఆడ కూలీలే వచ్చేరు. జానకి వెళ్ళేసరికి వాళ్ళు అలవాటు ప్రకారం చుట్టలు కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

సున్నం వెయ్యడానికి గోడలుంటే సరిపోదు.

నిచ్చెన లుండాలి. చిన్న చిన్న బకెట్లుండాలి. చీపుర్లు ఉండాలి. ఇవన్నీ ఉండాలని జానక్కి తెలుసు. అయితే చిన్న యిటికల గొడవలో మరిచిపోయింది.

"సున్నపురాళ్ళు ఉడకెయ్యమంటారేటి?" అంది వాళ్ళలో ఒకర్తె, చీర దోపుకుంటూ.

దానికి,

నెత్తిన కుండంత కొప్పుంది.

కొప్పు చుట్టూ బుట్టెడు మల్లెపువ్వు లున్నాయి.

మొహాన పావు వీశ పసుపుంది.

నుదుట నిమ్మకాయంత కుంకం బొట్టుంది.

చేతినున్న కడియం కనీసం అరమణుగు బరువుంటుంది. దానితో మొట్టిందంటే నల్లరాయి కూడా "అమ్మా!" అని పిలుపు లేకుండా నాలుగు ముక్కలవ్వాల్సిందే.

ఇవి కాక,

దాని మొహంలో లేత వెన్నెల వెలుగుంది.

కళ్ళల్లో "ఈ ప్రపంచం అంతా నాదే" అన్న ధీమా ఉంది.

పాతికేళ్ళ వయసుంది.

ఆ వయసుకి ఉండవలసిన బిగువుంది.

దాన్ని చూసిన జానక్కి ఒక్క క్షణం కళ్లు జిగేల్మన్నాయి.

"అందం, ఆరోగ్యం కలిపి తయారుచేసినట్టు ఎంత బావుంది!" అనుకున్న జానక్కి అరసెకండు అసూయ కలిగీ కలగనట్టు కలిగింది.

"సున్నం యేడ ఉడకెయ్యమంటారండీ?" మళ్ళీ అడిగింగి అది.

మైకం వదిలిన జానకి "అదిగో ఆ పీపాలో ఉడక పెట్టండి" అని చెట్టు కిందున్న పీపా చూపించింది.

థేంక్ గాడ్! యీ పీపా మాత్రం జ్ఞాపకం వుంది.

కూలీలంతా కాలుస్తున్న చుట్టల్ని ఆర్పేశారు. ఆర్పేసిన వాటిని కొంగుల్లో ముడివేసేరు. ఆ కొంగుల్ని నడుంచుట్టూ దోపేరు.

సున్నపురాళ్లు పీపాలో పోసింది ఒకత్తె.

రెండు బిందెలు నీళ్ళు పోసింది రెండోది.

తరవాత యిద్దరూ కలిసి "ఓలమ్మో. మోకాలమీదకు తుళ్లతాది" అంటూ దూరంగా పారిపోయేరు.

"అంత సున్నితాల సుప్పనాతులు మొగుళ్ళతో కాపరా లెలా సేస్తన్నారే!" బుగ్గలు నొక్కుకుంది మూడోది.

అలా బుగ్గలు నొక్కుకున్నదానికి బుగ్గలు లేవు. జబ్బలూ లేవు.

ఎముకలమీద చర్మం కప్పిన అస్తిపంజరంలా వుంది.

నిలువునా తూస్తే ఎముకలు బరువు తీసేస్తే అర కిలో మాంసం మిగలదు.

"నువ్వు సేసినట్టే" కిచకిచమంది యిందాకటి అందం.

"ఏటోలమ్మ ఆ యిరగబాటు? మనం ఈడకి పని సెయ్యడానికి ఒచ్చినావా, కిచకిచమన్డానికి ఒచ్చినావా? అలా సెరుగ్గడనాగ నిలబడకపోతే ఓ గెడ బట్టుకొచ్చి సున్నం కలపకూడదేటి? సోద్దెం సూస్తన్నారు సోద్దెం" ముదలకించింది ఆ ముసిల్ది.

అందానికి ఆగ్రహం తోడొచ్చింది. "ఏదీ. గెడేదీ? ముసిలోళ్ళకి మతులుండవు కామోసు. సేతులెట్టి కలపమంటావా? కాళ్ళెట్టి కలపమంటావా? నేకపోతే నిన్ను అందల దించుతాం. కలుపు మరి...." అంది చేతులు గాల్లో ఊపుతూ.

"ఓలె ఒల్లకోయె, ముసిల్దానితో నీకేటి? దెబ్బలాడతా కూకుంటే పన్లు అవుతా యేటి?" అంటూ కసిరి గెడకోసం అన్నట్టు పెరట్లోకి వెళ్ళింది యింకోత్తి.

జానకి చూపు కూలీల మీదున్నా, చెవులు మాత్రం ప్రకాశరా వింట్లో వున్నాయి.

"ఇవేళనుంచీ సున్నం వేస్తారు కాబోలు! హుఁ! గుడ్డికన్ను తెరిచినా ఒకటే మూసినా ఒకటే అని యీ తాజ్‌మహల్‌కి ఏం చేసినా ఒకటే. పైగా సామానంతా

ఎత్తిపెట్టా. దించిపెట్టా. ఒంటినిండా సున్నం పట్టించుకొని పిల్లలు సున్నప్పిడతల్లా తయారౌతారు. ఏవంత తొందరొచ్చిందీ?" అంటోండి ప్రకాశరావు పెళ్ళాం.

"వెయ్యనిద్దూ. నీ సొమ్మేం పోయిందీ" ఎంత నెమ్మదిగా అన్నా ప్రకాశరావు మాటలు జానక్కి వినిపించకపోలేదు.

సున్నంతోపాటు పుడికిపోతోంది మనసు.

"సీపురుకట్ట లొడేస్తే కుంచెలు కట్టుకుంటాం" అంటూ ఎదురుగా నిల్చుంది మరో కూలీ చీర మోకాళ్ల మీదికి కడుతూ.

"చీపుర్లు నా ఒళ్ళో వేసుకు కూర్చున్నానా? పోయి ఆ కావేశంగా రింట్లో అడుగు" అంటున్న జానకిని "హలో జానకీ! ఏవంటోందీ నీ ఇల్లు!" అంటూ పలకరించేడు అప్పుడే వచ్చిన కావేశం.

"భక్తులు తల్చుకోగానే దేవుఁడు ప్రత్యక్షమౌతాట్ట. నే నింకా తలుచుకోబోతుండగానే నువ్వు ప్రత్యక్షమయ్యేవు" అంది జానకి నవ్వుతూ.

"అయితే నేను దేవుఁడికంటె గొప్పవాడినన్నమాట" అంటూనే చుట్టూ చూసేడు.

కావేఁశాన్ని చూసిన జానక్కి పోయిన సత్తువ ఒక్కసారి వచ్చినట్లయింది. కావేఁశంలాంటి వాళ్ళు యెంత కష్టంలోనైనా నవ్వగలరు. నవ్వించగలరు. ఎలాంటి సమస్యనైనా విప్పగలరు.

చుట్టూ చూడ్డం అయిన తరవాత "ఫరవాలేదు. కొంచెం కష్టపడితే మనుషులు కూడా వుండగలరు. మొత్తానికి ఆడది అబల కాదని నిరూపించుకున్నావు.... అన్నట్టు ఏవంటున్నారు మీ ఇంటివాళ్లు? ఖాళీ చేస్తానంటున్నారా? లేకపోతే చెప్పు, రేపు బలగాన్ని తీసుకొచ్చి చెంబు, చాప రోడ్డుమీద విసిరేస్తాను...." అంటున్న కావేఁశం జానకి సౌజ్ఞలకి ఆగేడు.

ప్రకాశరా వింట్లో అందరికీ వినిపించేయి అతని మాటలు. వినిపించాలనే అతని వుద్దేశం. కాని జానక్కి యిష్టంలేదు. అంచేత "బొనుగానీ, ఆ వేళ కనిపించినవాడివి మళ్ళీ ఎడ్రసు లేకుండా పోయేవేఁవిఁటీ? సిమెంటుకి చాలా థేంక్స్" అంటూ మాట మార్చింది.

కావేఁశానికి యీ థేంక్స్‌లు, నో మెన్షన్లు నచ్చవు. "అనుకోకుండా ఊరు వెళ్ళేన్లే... నువ్వు ఫార్మాలిటీస్ బాగా మెయిన్‌టైన్ చేస్తావని నాకు తెలుసు....యీ సున్నం బెడదంతా ఎందుకు పెట్టుకున్నావు? ఎవరికైనా కాంట్రాక్టు యిచ్చేస్తేపోయేది.... కొంతమందికి కావాలని కష్టపడ్డం సరదా అనుకుంటాను....ఏదో పని లేకపోతేతోచదు. సరే కాని ఆ ఇటికల ముద్దేవిఁటి? సిమెంటుతోపాటే కావలసినవన్నీ చెప్తే ఒక్కసారే వేయించేవాడ్ని. అంత మొహమ్మాటం యేఁవిఁటో నా కర్థంకాదు...."

"యీ బాత్రూముల అయిడియా యీ మధ్యే వచ్చింది లే" సమర్థించుకుంది జానకి.

వడగళ్ళ వర్షంలా నవ్వేడతను. అతని నవ్వుకి వాకట్లో వున్న నారింజచెట్టు నవ్వింది.

ఇంటిమీద వాలిన కాకి నవ్వింది.

గూట్లో పిచ్చిక నవ్వింది.

నవ్వడం అయిపోయేక "నువ్వేదో ఈ ఊరివాళ్ళని ఎడ్యుకేట్ చేద్దామనుకుంటున్నావేమో. ఇంపాసిబుల్. ఈ ఊరివాళ్ళకి నలుగురి మధ్య స్నానం చేస్తేతప్ప చేసినట్టుండదు. వీళ్ళకి సిగ్గు తెలీదు. మరుగు అక్కర్లేదు. శుభ్రంగా కర్రలు బొగ్గులు వేసుకుంటారు. కావాలంటే పందెం కాస్తాను. ఎంత?" కామేశం పందెం కాసేలోపున "అమ్మగారూ, సీపుళ్ళు" జ్ఞాపకం చేసింది యిందాకటి కూలీ.

జానకి జవాబు చెప్పేలోపున కామేశమే అందుకున్నాడు "ఒసే అమ్మీ.... నీ పేరేవిఁటన్నావ్?....పైడమ్మా....సరేలే. ఏదో ఒకటి....మా ఇంటికెళ్ళి ...తెలీదా నన్ను తెలీకుండా ఎలా వున్నావే యీ వూర్లో ఇన్నాళ్ళూ....అదుగో అలా తిన్నగా వెళ్తే కుడిచేతివేపు నాలుగో ఇల్లు. నా నేమ్‌ప్లేట్ వుంటుంది. ఎందుకు జానకీ ఆ నవ్వు ఓహో దానికి చదువు రాదుకదూ....వాకట్లో విరిగిపోయిన వేపచెట్టుంటుంది. ఆ చెట్టు తాలూకు విరగని కొమ్మని మా ఇంటిగలవాడి కూతురు ఉయ్యాల ఊగుతూ ఉంటుంది. ఆ పిల్ల వూపుకి ఎప్పుడో అప్పుడు ఆ కొమ్మ చెట్టుతోసహా విరిగి మా నెత్తిమీద పడిపోతుంది. ఆ రంభకి పెళ్ళి చెయ్యాలని వాళ్ళ నాన్న కోరిక. ఆ రంభకి మాత్రం "ఎంచక్కా వర్షం పడుతూంటే, వేడివేడి పకోడీలు తింటూ సులోచనారాణి నవల చదువుకుంటూ వుంటే! అబ్బ! ఎంత బావుంటుందో!" అన్న కోరిక.

అన్నట్టు డాక్టరో, ఇంజనీరో తప్ప పనికిరాటడ వాళ్ళ బాబుకి. ఆరడుగులకి అర సెంటిమీటరు తక్కువైతే పనికిరాడుట ఆ రంభకి. మరింక నీ ఎరికలో ఎవడైనా ఆరడుగుల కథానాయకుడుంటే చూడు. వాడి హైటే వాడి కేష్....మనవూఁ పిల్లలు గలవాళ్ళవేఁ. వెక్కిరించకూడదుగాని ఆ పిల్లకన్ను కుడికన్ను ఎడమవేపు చూస్తుంది. ఎడమకన్ను కుడివేపు చూస్తుంది. అంచేత అర్ధరాత్రి కూడా గాగుల్స్ తియ్యదు.

ఎవడి పుణ్యం పుచ్చుతుందోగాని అర్ధరాత్రి అకస్మాత్తుగా చూస్తే మాత్రం కెవ్వున కేకేస్తాడు. మొహంమీద గుడ్డకప్పేసి కాపరం చెయ్యాల్సిందే....అబ్బబ్బ నీ చీపుళ్ళు పాడుగాను....పోయి ఆ ఉయ్యాల ఇంట్లో మా అమ్మనడుగు. మా అమ్మ తెలీదా....నువ్వు ఎక్కడ దొరికేవే నాకు? అచ్చు నాకు చీరకట్టినట్టుంటుంది, ఏవఁ(రోయ్ అమ్మలూ సున్నం కొంచెం చిక్కగానే రాయండి" అంటూ అక్కడున్న కుర్చీలో కూర్చున్నాడు.

చీపుళ్ళ కూలీ వెళ్ళింది.

"సీపుళ్ళు తెచ్చేవరకు మావేఁటి సేస్తాం?" అంటూ మిగిలినవాళ్ళు వరండాలో చివర్న కూర్చుని యిందాక దాచిన చుట్టలు మళ్ళీ తీసేరు.

"బాబూ ఓపాలి నిప్పుపెట్టు యిస్తావేటి?" అడిగింది అందరిలోకీ ముసిల్ది.

"నేను సిగరెట్లు కాల్చనుగాని పోయి ఆ యింట్లో నిప్పు అడిగి తెచ్చుకో" సలహా యిచ్చేడు కామేశం ప్రకాశరావు వాటావేపు చూపిస్తూ.

"ఓలమ్మ, ఆయమ్మనా? ఒద్దులే బాబూ. ఏదడిగినా ఎర్రిచేసినాగ గయ్యిమంటాది. తల్లి మా లచ్చిమి ఇంట్లో వుంటే అన్నం వుండదు. ఊదిలో వుంటే నీళ్ళుండవు" అంటూ మళ్ళీ చుట్ట మొలన దోపుకుంది.

"ఇంతకీ బాత్రూములకి పైకప్పు ఏం వెయ్యమంటావు? రేకులా? పెంకులా?" సలహా అడిగింది జానకి పక్కనే స్టూలుమీద కూర్చుంటూ.

"నా సలహా నిజంగా వింటావా?"

"చెప్పు."

"అసలు ఏ కప్పు వెయ్యకు. ఓపెన్ ఎయిర్ థియేటర్లా అలాగే వుంచీ. ఎండలో స్నానం చేసేరనుకో ఒత్తుకోవడం అనవసరం. తువ్వాళ్ళ ఖర్చుండదు. వర్షం పడుతుందనుకో నీళ్ళు పోసుకోనక్కర్లేదు. నీళ్ళమోత వుండదు" అంటున్న కామేశం మాటలకి అక్కడున్న కూలీలంతా "ఏటీబాబూ" అంటూ గొల్లుమన్నారు.

జానకిక్కి నవ్వాగలేదు.

"పోనీ తలుపులైనా పెట్టించనా?" అంది నవ్వుతూ.

"ష్యూర్. ష్యూర్. తలుపుల్లేకపోతే ఎలా? అయితే టేకు, రోజ్‌వుడ్ అంటూ కూర్చోకు. మా దగ్గర బోలెడు తారుపీపాలు ఖాళీవి ఉంటాయి. వాటిని రేకు చేయించి కర్రఫ్రేము వేయించు చాలు. నాకు జ్ఞాపకం చెయ్యి. లేకపోతే మరిచిపోతాను. మరి వస్తాను" అంటూ వెళిపోయేడు.

"ఆ బాబు ఊసులాడతా వుంటే అస్సలు పని సేసినట్టే వుండదు" అంది ఇందాకటి అందం.

"అంచేతే నేటి అలా కూకున్నావు పని మానేసి. లెగు. లెగు. వూసుల్తో కడుపులు నిండవు" అంటూ లేపింది ముసిల్ది.

ఈలోగా చీపుళ్ళకోసం వెళ్ళిన కూలీ తిరిగి వచ్చింది. వాళ్ళు చీపుళ్ళు కట్టుకొని సున్నం రెడీ అయేసరికి పది గంటలు అయిపోయింది.

"ఏకంగా సద్దులు తినేసి పన్లోకి దిగుదాం" అంటూ అందరూ చద్దులు విప్పుకూర్చున్నారు.

"ఇవేళ అరగోడ కూడా అయేటట్టులేదు" అనుకుంది జానకి.

ఆవిడ అంచనా తప్పు.

సాయంత్రానికి అరగోడ దాటి అరగజం ఎక్కువైంది. (సశేషం)

'రసరాజు'
కథ

ఉరి పోసుకున్న గాలిపటం

గాలికి అటూ యిటూ వూగుతోన్న చెట్ల ఆకుల సందుల్లోంచి — తెల్లటి వెన్నెల కిరణాలు ఆదెయ్య పడుకొన్న పక్కమీద పడుతున్నాయి.

ఆదెయ్యకు ఆ రాత్రి కళ్ళు మూసుకొన్నా నిద్ర పట్టటంలేదు.

దూరంగా వున్న చర్చిలోంచి గంటలయితే వినబడ్డాయిగాని, ఎన్నిగంటలు వినబడ్డాయో ఆదెయ్య లెక్కపెట్టలేదు.

పక్కమీద నుంచి లేచాడు....

ముక్కముక్కల్లా పడుతోన్న వెన్నెల్నీ, చెట్ల ఆకుల నీడల్నీ గమనిస్తూ గోడకి చేరబడి కూర్చున్నాడు....

సత్రంలో—అప్పటికే అందరూ ముసుగు తన్ని నిద్రపోతున్నారు .... సగంలో చచ్చిపోయిన బీడీముక్కని నోట్లో పెట్టుకొని అగ్గిపుల్ల గీశాడు ఆదెయ్య.

అగ్గిపుల్ల వెలిగిస్తూ అలాగే ముందుకు చూస్తూ వుండిపోయాడు....

అగ్గిపుల్ల వెలిగి ఆరిపోయిందిగాని, బీడీ అంటుకోలేదు. అగ్గిపుల్ల రెండు వేళ్ళమధ్య వెలిగి ఆరిపోయాక, పక్కమీద బోర్లగా పడుకొని నిద్రగన్నేరు చెట్టు నీడలోకి చూశాడు.

రెండు ఆకారాలు....

ఒకటి—మరో ఆకారం ఒళ్ళో ఒదిగిపోయింది.

మధ్యమధ్య గుసగుసలు....

మత్తెక్కించే మల్లెల పరిమళం....

ఆదెయ్య కళ్ళు—చెట్టు నీడలోంచి తప్పుకొని — సత్రంలో పడుకొన్న జనంకేసి నడిచాయి.

ఎవరి జాగాల్లో వాళ్ళు పడుకొన్నారు.

ఒక్క కోటిగాడి చోటే ఖాళీగా కనిపించింది.

కోటిగాడి పక్కనే గురవయ్య చోటు.

గురవయ్య కుంభకర్ణుడిలా గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

గురవయ్య పక్కనే—గురవయ్య పెళ్లాం రత్తాలు చోటు.

రత్తాలు పక్కలో కుక్క దొర్లుతోంది.

....ఆదెయ్యకు ఆ సాయంత్రమే అర్థమయిపోయింది. కోటిగాడు మహాతెలివైనవాడు— ఏదో పొట్లం పట్టుకొచ్చి రత్తాలు కిచ్చాడు ఆ సాయంత్రం. అవి మల్లెపూలే అయ్యుంటాయని ఆదెయ్య ఊహ.

అలా పడుకొనే ఆదెయ్య నిద్రగన్నేరు చెట్టునీడలోకి చూశాడు.

అక్కడక్కడా సగం వెన్నెల....సగం నీడ... ఆ వెలుగునీడల మధ్యన నలిగిపోతున్న మల్లెల పరిమళం....

* * *

ఆదెయ్య ఒక్కడు....

అతని చుట్టూ సత్రంలో జనం....

"నాయాల....సీతారాముల్లాంటి పెళ్ళాన్నీ, మొగుడ్నీ ఇడదీత్తావా—నన్ను అడ్డం పెట్టుకొని...." కోటిగాడు ఆదెయ్యమీద విరుచుకు పడిపోతున్నాడు.

"ముసిడి సచ్చినోడా .... నీ జిమ్మడ...." రత్తాలు వేళ్ళు విరుస్తోంది.

"నా కొడకా....మక్కెలిరగతంతాను —" గురవయ్య కసిగా ముందుకురుకుతున్నాడు.

"....నువ్విలాటి తప్పుడుకూతలు కూసేవంటే నూకలు చెల్లిపోతాయ్‌రోయ్!" నిలబెట్టి తిడుతున్నారు మిగతావాళ్ళు.

అలా అరగంటవరకు ఆదెయ్యని దుయ్యబడుతూనే వుంది సత్రం.

ఆదెయ్య బిక్కచచ్చిపోయాడు.

రత్తాలుకీ, కోటిగాడికీ వున్న సంబంధం గురించి ఆదెయ్య యెక్కడో నోరు పడేసుకున్నాట్ట....

అది "గాలివాన" అయింది.

అలా మొదలయిన గాలివాన ఎడతెరపి లేకుండా సత్రంలో రోజూ కురుస్తూనే వుంది.

ఆదెయ్యకూ, సత్రానికీ బొత్తిగా పొత్తు కుదరడంలేదు.

సత్రం—ఆదెయ్యని పూర్తిగా వెలేసింది.

ఆదెయ్య ఒక్కడూ ఒకటి అయితే-సత్రం అంతా ఒకటై ఆదెయ్యమీద పడగ విప్పింది.

....ఆదెయ్యకు ఈ ఒంటరితనం భరించ రానిదే అయింది. ఎప్పుడు ఏ అఘాయిత్యం తనమీద తలపెడతారోనన్న భయం ఆదెయ్య మనసులో చోటుచేసుకొంది.

ఏదో వంకపెట్టి ఆదెయ్యని సత్రం రోజూ తిడుతూనే వుంది.

తనకు "నా" అన్నవాళ్ళు లేరు.

ఆ సాయంత్రం....

ఆదెయ్య దిగులుగా తలొంచుకొని ఎటో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

గూటిలో చిలక అరిచింది....

పెకిలేచి-చిలకని చేతిలోకి తీసుకొని— దాన్నోసారి ప్రేమగా నిమిరాడు. ఆదెయ్య కా అరుపు కొండంత ఊరట కల్పించినట్లయింది.

ఆదెయ్యకదే నేస్తం. అది ఎగరలేదు.

బాగా పొద్దుపోడిచాక—చిలకని భుజం మీత పెట్టుకొని—గుమ్మాలన్నీ తిరిగి ఆడుక్కోడం ఆదెయ్య డ్యూటీ.

ఓ రోజు ఉదయం....

పక్కమీద నుంచి లేస్తూనే గూట్లోకి చూశాడు.

పాదాలకింద ఏదో మెత్తగా తగిలినట్లయి కిందకి చూశాడు.

చిలక....

దానిచుట్టూ చీమలు....

అది తన చిలకే....

దాని పీకపై ఎవరివో కబంధహస్తాల ముద్రలు....

మః షిమీద పగ—చిలకమీదికి మళ్ళింది.

సత్రం చేసిన పనికి ఆదెయ్య మనసు నీరు కారిపోయింది.

కళ్ళముందు కబళాన్ని ఒక్కసారి-ఎవరో కాలదన్నినట్లయింది.

వడ్డించిన విస్తరిని-విసిరేసినట్లయింది....

ఆదెయ్య ఒంటరిగా ఉన్నప్పుడు-ఆ చిలక పలకరిస్తుండేది—స్నేహితుడిలా. ఆ నేస్తం లేదిప్పుడు....

ఆదెయ్య పొట్టకి ఆ చిలకే యింత కూడు పెట్టేది — తల్లిలా.

ఆ తల్లి లేదిప్పుడు....

ఆ చిలకగూటిలో "చిలక" ఎగిరిపోవడం గుడ్డోడిచేతిలో కర్ర విరిగినట్లయిపోయింది ఆదెయ్యకి.

....సత్రంకేసి చూశాడు.

సత్రం-గుడ్లగూబలా కనిపించింది.

ఆదెయ్య కా దిగులు నెలవరకూ విడిచి పోలేదు.

అడుక్కోడానికి పోయినప్పుడు "భుజమ్మీద చిలకేదీ" అని పిల్లలడిగితే తన గుండె

కేసి చూపించేవాడు ఆదెయ్య—మరేవీ చెప్పలేక.

....ఆదెయ్య కప్పిళ్ళతో-సత్రం-రోజూ చప్పిక తీర్చుకొంటోంది.

*   *   *

ఒంటరితనం — ఆదెయ్య మనస్సుమీద రోజూ దెబ్బతీస్తూనే వుంది. అది భరించడం ఆదెయ్యకు కష్టమైపోయింది.

అడుక్కోడానికి పోతే,ఇన్ని గింజలు కూడా దొరకడంలేదు.

"ఏదో కష్టపడి పని చేసుకోకూడదూ...." అందరూ ఇదే మాట.

చిలక వున్నప్పుడు ఈ మాటలు వినిపించేవి గావు.

అడుక్కోడానికిప్పుడు ఆధారం తప్పనిసరయింది ఆదెయ్యకి—ఒంటరితనం మాట ఎలా వున్నా.

....ఓ సాయంత్రం — ఆదెయ్య—ఒంటరిగా కాకుండా తోడుగా వచ్చేడు సత్రంలోకి.

"తోడు"ను చూడగానే సత్రం కళ్ళల్లో—ఎర్రజీరలు మెరుపు తీగల్లా పాకాయి.

"ఈడిబతుక్కిదొకటి...." సత్రం చెవులు కొరుక్కుంది.

తోడుగా కొనితెచ్చుకొన్న కోతిపిల్లని గొలుసుతో చెట్టుకి కట్టేశాడు ఆదెయ్య.

....కోతి రాకతో ఆదెయ్య జీవితంలో మళ్ళీ వసంతం తలెత్తింది. ఆశలు చిగుళ్ళు తొడిగాయి.

దానికి పువ్వులగౌను కుట్టించాడు-ముచ్చటపడి. ఏపీ తోచనప్పుడల్లా దాన్ని పొట్టమీద పడుకోబెట్టుకొని—బిడ్డలా దాన్ని నిమురుతూ తృప్తిగా గాలి పీలుస్తుండేవాడు.

ఆదెయ్య పరధ్యానంగా వుంటే—తల్లోపేలుచూస్తూ ఆదెయ్యను తనవేపుకి తిప్పుకుంటుండేది ఆ కోతిపిల్ల. అప్పుడప్పుడు చేతికి దొరక్కుండా ఆదెయ్యని ఆట పట్టిస్తుండేది.

ఆ కోతిపిల్ల—ఆదెయ్యకు కొత్త వూపిరి పోసింది.

ఏ గుమ్మం ఎక్కినా ఇన్ని బియ్యం గింజలు దొరుకుతున్నాయి. కడుపు నిండుతోంది. గుమ్మాలముందు పిల్లలంతా గుమికూడి కోతిపిల్లకి కొబ్బరి ముక్కలు, కూరగాయలు పడవేస్తున్నారు.

"కష్టపడి పనిచేసుకోకూడదూ...." అన్న మాటలిప్పుడు వినిపించడంలేదు.

ఆదెయ్యకు ఈ ఆనందం ఎంతో కాలం మిగల్లేదు. కొని తెచ్చుకొన్న ఆనందం-కొండగట్టిన దీపమై ఆరిపోయింది.

తెల్లారి లేచాడు—మామూలుగా.

కోతి కనపడటం లేదు.

పిచ్చెక్కినోడిలా సత్రంచుట్టూ తిరిగాడు....

చెట్లన్నీ వెతికాడు....

బావిలోకి చూశాడు.

తల బాదుకున్నాడు.

కోతి కనబడలేదు.

సత్రంలోకి చూశాడు.

సత్రం "ఆనందం" పంచుకొంటోంది.

కళ్ళు ఎరుపెక్కాయి.

ఒళ్ళు వేడెక్కింది.

పెదవు లదురుతున్నాయి.

అయినా తమాయించుకున్నాడు.

తనొక్కడూ ఒకటి....

ఎదురు తిరిగితే—ఏం జరుగుతుందో తనకు బాగా తెలుసు. మనుషుల్ని తిడితే లాభంలేదని దేవుణ్ణి కసిగా ఓసారి తిట్టేసి ఊరుకున్నాడు.


ఇది జరిగిన మర్నాడు—అసలు వూళ్ళోకే వెళ్ళలేదు. అడుక్కునే ఆధారం అందీ అందకుండా అదృశ్యమైపోయింది. తనకో ఆధారం వుంటే సత్రం ఒప్పుకోదు.

మరో చిలక....మరో కోతి....ఏదయినా కానీ—అన్నీ సత్రానికే అంకితం.

ఇక్కడ బతికి బట్టకట్టడం సమస్యగానే తోచింది.

ఆదెయ్య ఓ నిర్ణయానికొచ్చాడు — బాగా ఆలోచించి.

అయితే ఇన్నేళ్ళుగా తనకింత గంజిపోసి, ఆశ్రయమిచ్చిన ఊరునీ, సత్రాన్నీ వదలి వెళ్ళడము ఆదెయ్యకి కష్టమనిపించింది. కాళ్ళు ఆడలేదు....



అలాగే ఆకాశంలోకిచూస్తూ కూర్చున్నాడు-నడిసముద్రంలో దిక్సూచి పనిచేయని నావికునిలా.

*   *   *

చీకటి చెదిరిపోయి — చిరువెలుగు — లోకాన్ని రాగరంజితం చేస్తోన్న వేళ అది.

ఆదెయ్యకు అదేవిటో అర్థంకాలేదు.

పొట్టమీద ఎత్తుగా ఓ కంతి బయల్దేరింది. చూడ్డానికది విచిత్రంగా, వికృతంగా వుంది. నెల్నాళ్ళ క్రితంనుండీ అది పెరుగుతూ వచ్చింది.

కుంటినాగన్నకా విషయం తెలిసీ తెలియగానే ఎంతో బాధపడిపోయాడు. మూగ దాసరయ్య ముందే ముడుచుకుపోయాడు. కోటిగాడు కుంచించుకుపోయాడు. గురవయ్యగుండె పీరసంగా మూలిగింది. రత్తాలు బుర్ర సరేసరి దంగుల రాట్నంలా తిరిగిపోయింది.

పాడుబడ్డ సత్రం బాధతో ఒక్కసారిగా సుళ్ళు తిరిగిపోయింది,

ఆదెయ్య మాత్రం బాధపడలేదు. అదోలా అయిపోయి ఎదురుగావున్న కాలవకేసి కళ్ళు తిప్పలేదు. పాడుబడ్డ బావికేసయినా కనీసం చూడలేదు.

ఆనందంగా వున్నాడు....

ఆశల్ని గుండెచుట్టూ పేర్చుకొన్నాడు.

అడుక్కోడానికి ఆదెయ్యక్కూడా ఓ బలమయిన ఆధారం దొరికింది.

అలా ఎందుకు దొరికిందనే మిగతావాళ్ళ బాధ!

....ఆదెయ్య సంతోషాని కవధుల్లేవు.

"రేపట్నుంచి ఆదెయ్య కంతిని అందరూ అదోలా చూస్తారు....ఆ వెనుక జాలి..పైసలు ....ఆదెయ్య రేపట్నుంచి వూలరంగడే...." సత్రం అసూయతో మూలిగింది. ఈర్ష్యతో కళ్ళలో నిప్పులు పోసుకొంది.

ఆ మర్నాడు....

నాలుగురోడ్లూ కలిసే బ్రహ్మాండమయిన సెంటరులో — బ్రాందీషాపు కెదురుగావున్న గాంధీబొమ్మ దగ్గర చిన్నచోటు దొరికింది ఆదెయ్యకి.

ఆదెయ్య అక్కడ కూర్చున్నాడు....

అందరికీ తన "కంతి"ని చూపిస్తూ అడుక్కోడం మొదలెట్టాడు.

వచ్చేపోయే జనం—ఆదెయ్య పొట్టమీద లేచిన కంతిని విచిత్రంగా చూస్తూ—జాలితో

అయిదో పదో పైసలుపడేసి "అయ్యోపాపం" అనుకొంటూ వెళ్ళిపోతున్నారు.

....సాయంత్రం గడిచింది.

క్రమంగా చీకటికూడా పడింది.

ఆదెయ్య సత్రంలోకొచ్చి అటూయిటూ చూశాడు.

ఎవరూ—గూడు చేరుకోలేదింకా....

మెల్లగా డబ్బామూత తీశాడు.

చిల్లరంతా గుమ్మరించాడు.

"అయిదు రూపాయిలు....పైన మరో పదిహేను పైసలు....!"

కంతి కనకవర్షం కురిపించింది....

ఆదెయ్య గర్వానికి అవధుల్లేవు....

ఆశ్చర్యం, ఆనందం — రెండూ ఒకేసారి గుండె తలుపు తట్టాయి. ఆశల గాలిపటాన్ని ఆకాశంలో ఎగరేసుకొన్నాడు.

ఆదెయ్య కారోజు పండగే అనిపించింది.

అలాంటి పండగలు చూడటం ఆదెయ్యకి క్రమంగా మామూలయి పోయింది.

ఆదెయ్య హాయిగా బతుకుతున్నాడు.

సత్రం ఏదో వంకపెట్టి ఆదెయ్య అదృష్టాన్ని రోజూ తిడుతూనే వుంది. ఎవరెన్ని తిట్టినా—ఆదెయ్య రోజూ తన "కంతి"కేసి చూసుకొని మురిసిపోవడం మాత్రం మానలేదు.

* * *

ఆదెయ్యకు ఆరోజు జ్వరం.

శరీరంమీద చెయ్యేస్తే —, నిప్పులా కాలిపోతోంది.

మంచినీళ్ళిచ్చే మనసు లేదు.

సత్రం బండరాయిలా చూస్తోంది - నిలబడి.

దగ్గిరలోవున్న గవర్నమెంటు హాస్పిటల్, ఆదెయ్య మనసులో మెదిలింది.

....ఆదెయ్య ఆస్పత్రిలో అడుగుపెట్టాడు.

మందిచ్చి—కంతికేసి చూశాడు డాక్టరు.

"కంతికోసి, కడుపు కొట్టొద్దు డాక్టరు బాబూ....!" అన్నట్లు తిరిగిచూశాడు ఆదెయ్య అంత జ్వరంలోనూ.

డాక్టరుబాబు ఆ "కంతి"ని రోడ్డుమీదరోజూ చూస్తూనే వున్నాడు.

"జ్వరం తగ్గినా, మళ్లా రెండ్రోజులకే వస్తుంది....ఓ పదిహేను రోజులపాటు వచ్చి మందు తీస్కో....పూర్తిగా నయమవుతుంది" అన్నాడు డాక్టరుబాబు.

డాక్టరుగారి మంచి మనస్సుకి రెండుచేతులు జోడించాడు ఆదెయ్య — మరెలా కృతజ్ఞత చెప్పుకోవాలో తెలీక.

* * *

ఆకాశం కన్నీళ్ళు కురుస్తోంది.

తూరుపు తెల్లారింది కానీ, వెలుగింకా పూర్తిగా విచ్చుకోలేదు. సత్రంలో అటుపక్క అందరూ లేచారు. లేచింది మొదలు అందరూ ఆదెయ్యనుచూసి, ఆనందంగా నవ్వుకొంటున్నారు. మధ్యమధ్య చెవులు కొరుక్కుంటున్నారు.

సత్రానికి పక్కగా ఆదెయ్యకూడా లేచి కూర్చున్నాడు. అదోలా వున్నాడు.

దిగులుగా—దీనంగా వున్నాడు.

వారం రోజుల్నుంచీ ఆదెయ్య మనసే మారిపోయింది. ఆలోచించేకొద్దీ అగాధంలోకి జారిపోతున్నట్లనిపించింది....పొట్టకేసి చూసుకున్నాడు నిరాశగా.

"కంతి" క్రమంగా కరిగిపోయింది.

మనసు మూగబోయింది....

డాక్టరుబాబు "జ్వరం" పేరుతో "కంతి" మీద వైద్యంచేసి కడుపుకొట్టాడన్న భావం ఆదెయ్యాన్ని నిర్వీర్యుణ్ణి చేసింది.

ఎగరేసుకొన్న ఆశల గాలిపటం ఎక్కడో గింతచెట్టుకి ఉరిపోసుకొని నీరసంగా మూలిచింది. □



ఇమిటేషన్ ఇష్టంలేదు

—వసుంధర

"ఏమండీ!" అంది శ్రీమతి గోముగా.

"ఊఁ" అన్నాను.

"మీరేమీ అనుకోనంటే ఒక చిన్న కోరిక" అంది శ్రీమతి మళ్ళీ.

"నీ కోరికకు నేను ఎప్పుడైనా యేమైనా అనుకున్నానా?" అంటూ యెదురు ప్రశ్న వేశాను.

"కానీ యిది వేరండీ" అంది శ్రీమతి.

"ఫరవాలేదు చెప్పు" అన్నాను మనసులో భయపడుతూనే.

"మిమ్మల్ని నేను యిక్కణ్ణించి నువ్వు అని వ్యవహరిస్తాను. ముద్దుగా రంగా అని పిలుస్తూంటాను" అంది శ్రీమతి.

ఉలిక్కిపడ్డాను. మాకు పెళ్ళయి ఆరేళ్ళయింది. ఆరేళ్ళుగా లేని కోరిక ఈ రోజు శ్రీమతికి యెలా పుట్టింది? యెందుకు పుట్టింది?

నిజంగానే శ్రీమతి కోరిక నాకు యిబ్బంది కలిగించేదే? మొగుణ్ణి నువ్వు అని పిలిచే ఆడవాళ్ళని మా యింట్లో వేళాకోళం చేస్తారు. ఆ మగాడు చేతకానివాడనీ, బొత్తిగా పెళ్ళాన్ని అదుపులో ఉంచలేనివాడనీ, పెళ్ళాం గౌరవాన్ని పొందనివాడనీ రకరకాలుగా అంటూంటారు. అటువంటి దంపతుల మీద మా యింట్లో జోకులు పడుతూంటే నేనూ విని ఆనందించేవాణ్ణి. హఠాత్తుగా యిప్పుడు మేమూ అటువంటి లిస్టులోకి చేరిపోవాలా?

అలా అని శ్రీమతి కోరిక కాదనలేను. అటు స్నేహితులకు, యిటు తలిదండ్రులకు తోడబుట్టినవాళ్ళకు లేని చనువు మా యిద్దరి మధ్యనూ వున్నది. మా యిరువురికీ రహస్యాలన్నవే లేవు. అలాంటప్పుడు ఒకరినొకరు నువ్వు అని పిలుచుకోవడంలో తప్పేమున్నది? భార్యాభర్తల్లో ఒకరు గొప్ప, ఒకరు తక్కువ అనే ప్రసక్తి యేమున్నది? శ్రీమతి కోరికను మన్నించకపోతే నా యిరుకు మనస్తత్వాన్ని ప్రదర్శించినవాడినౌతాను. అసలు దీని గురించి ఆలోచించడమే తప్పు!

అయితే నే నొక వాతావరణంలో పుట్టాను. ఆ వాతావరణం ప్రకారం భార్యకూ, ఏమండీ అన్న పిలుపుకూ అవినాభావ సంబంధమున్నది. నువ్వు అని పిలిస్తే యేదో అపశ్రుతి పలికినట్లుంటుంది నాకు. ఏమండీ అనడం ద్వారా భార్య భర్తను మన్నిస్తున్నదని నాకు తోచదు. అది ఒక మధురమైన పిలుపు. ఆ పిలుపు భార్యా భర్తల మధ్యదూరం పెంచుతుందనేందుకు వీలులేదు. కోపం వచ్చినప్పుడు శ్రీమతి నాకు యేమాత్రం భయపడదు. మీరు అని మన్నిస్తూనే నానా తిట్లూ తిడుతుంది. నువ్వు అని అంటూనే నేను ఆమెకు భయపడతాను. అలవాటుగా వున్న యీ సంబోధనలకూ సంసార జీవితానికీ యేమీ సంబంధం లేదు.

భార్య భర్తను నువ్వు అనవచ్చు. ఏరా అనవచ్చు. కానీ యీ సమాజంలో జీవితం నిజంగా ఒక నాటకం. ఎన్నో సందర్భాల్లో మనం నటిస్తూంటాం.

భర్తవద్ద భార్యకుండే చనువు గురించి అందరికీ తెలుసు. కానీ ఇంట్లో మూడోమనిషి వున్నప్పుడు భార్య భర్త యెదుట బట్టలు మార్చుకోదు. "కాస్త అవతలకి వెళ్ళండీ, బట్టలు మార్చుకోవాలి" అంటుంది. భర్త మౌనంగా బయటకు వచ్చేస్తాడు. ఇది నాటకం

కాదని యెవరనగలరు?

ఈ నాటకానికి యేర్పడిన అనేక సంప్రదాయాల్లో "ఏమండీ" ఒకటి. ఏకాంతంలో భార్యాభర్తలు యెల్లకాలమూ ఒకరి నొకరు మన్నించుకోవడం జరుగుతుందని కనీసం నా అనుభవాన్నిబట్టి అనుకోను. కానీ బయట నలుగురి మధ్యా వున్నప్పుడు యీ సంప్రదాయం పాటించబడాలని నా కుంటుంది. నా భార్యను నేను "ఏమే" అని పిలవను. అలా పిలిచినా, శ్రీమతి గురించి యెవరికైనా అది అని చెప్పినా యేదో అపశ్రుతి పలుకుతుంది నాలో. కానీ అదీ ఒక విధమైన సంప్రదాయమే! ఒక సంప్రదాయాన్ని పాటించి మరో సంప్రదాయాన్ని వదలిపెట్టాలనుకునే వాడు సంప్రదాయాలను గౌరవించడం ప్రసక్తి యెక్కడున్నదని చాలామంది అనుకోవచ్చు. కానీ నా తర్కం నా కుండనే వున్నది.

ఇంట్లో చిన్నపిల్లలు తలిదండ్రుల దగ్గర్నుంచే తమ ప్రవర్తను తీర్చిదిద్దుకుంటారు. తల్లీ తండ్రీ ఒకరినొకరు నువ్వు అని పిల్చుకుంటే - వాళ్ళకు ఏమండీ అని మన్నించే పదం గురించి తెలియకుండా పోతుంది. బయటివాళ్ళను కూడా చటుక్కున నువ్వు అనేస్తూంటారు. వాళ్ళకు యీ తేడా తెలియడం కోసం యీ రెండు రకాల సంబోధనలూ చిన్నప్పట్నించీ నిత్యవ్యవహారంలో చూడాలి. సాధారణంగా పిల్లలకు తల్లివద్ద యెక్కువ చనువు. తలిదండ్రులలో తల్లి చిన్నది! అందువల్ల కుటుంబంలో మన్ననకు పాత్రుడయ్యే వ్యక్తి తండ్రి కావాలి!

నా ఆలోచనల్లో లోపా లుండవచ్చు. నా ఆలోచన లీ విధంగా నడవడానికి కారణం నేను మగవాణ్ణి కావడమే కావచ్చు. కానీ నాకు అలా యిష్టం. అలాగని శ్రీమతిని నేను శాసించ లేదు. నాలోని సంస్కారం అందుకు అంగీకరించదు.

"నువ్వు రంగా అని పిలిస్తే నాకు యే మాత్రమూ అభ్యంతరం లేదు. మధురమైన నీ పెదవులు ఆ అక్షరాల నుచ్చరించడానికి కంపిస్తూంటే నాకు పెళ్ళిరోజులు గుర్తుకు వస్తాయి."

"ఈ మాటలు మీరు మనస్ఫూర్తిగానే అంటున్నారా?" అంది శ్రీమతి. ఆమె కా అనుమానం రావడాని క్కారణం నాకు తెలుసును. నా మాటలు వింటున్నప్పుడు ఆమె నా ముఖం వంకే చూస్తున్నది.

"ఇంట్లో మిగతావాళ్ళు యేమనుకుంటారో నని నాకు భయంగా వున్నది తప్పితే - నీ పిలుపు యెలా వున్నా నాకు యిష్టమే!" అన్నాను. అది అబద్ధమే కావచ్చు. కానీ యింకోలా అనడానికి నేనేం కారణం చెప్పగలను?


"ప్రస్తుతం యింట్లో యింకెవ్వరూ లేరు కదా - అందుకే యిప్పట్నించే మొదలుపెడతాను. ఓ వారంరోజుల్లో వాళ్ళు వచ్చేసరికి మనకు బాగా అలవాటైపోతుంది. నీకూ ఏమనిపిస్తుందో చెప్పొచ్చు. ఏమంటావ్?" అందామె.

మంచం మీద యిబ్బందిగా కదిలాను. అప్పుడే శ్రీమతి తన కోరికను ఆచరణలో పెడుతోంది. నాకు యేమాత్రమూ సంతోషంగా లేదు. నాలో అహం బాగా వుందని అప్పుడే అనిపించింది. లేకపోతే నా కోసం తనవారందర్నీ వదులుకుని వచ్చి తన సర్వస్వాన్నీ నాకు అర్పించుకున్న శ్రీమతి నన్ను మన్నించాలని అనుకోవడమేమిటి?

"అసలు నీ కీ కోరిక యెలా పుట్టింది?" అన్నాను నీరసంగా.

మా యింటి కెదురుగా కొత్త దంపతులు దిగారు. యువకుడు రామనాథం. యువతి సరళ. ఆమె అతన్ని రామూ అని పిలుస్తుంది. అత డామెను సరూ అని పిలుస్తాడు.

ఆ జంట చూడ ముచ్చటగా వుంటుంది. ఆ పిలుపు మాత్రం కొత్త ఎబ్బెట్టుగానే వుంటుంది. నా శ్రీమతి సరళ నా విషయం అడగ్గా "భర్తను యేకవచన ప్రయోగం చెయలేని ఆడది అతడికి ప్రియురాలు అనిపించుకోదు. బానిస అనిపించుకుంటుంది" - అని ఆమె జవాబిచ్చిందట. శ్రీమతి సంప్రదాయాల ప్రసక్తి తీసుకురాగా "సృష్టిలో స్త్రీ పురుషులిద్దరూ సమానులే. ఏమండీ అన్న పిలుపు పోయేవరకూ ఆడది ఆ విషయం ఒప్పుకున్నట్లు కాదు" అని జవాబిచ్చిందట. అప్పట్నించీ శ్రీమతిలో తనూ అలా వుండాలన్న కోరిక విత్తులా పుట్టి నేటికి మహావృక్షమయింది.



మర్నాటినుంచీ శ్రీమతి తన కోరికను ఆచరణలో పెట్టడానికి చాలా తీవ్రప్రయత్నాలు ప్రారంభించింది. ఆరేళ్ళ అలవాటు అంత సులభంగా పోదు కాబట్టి ఆమె చాలా పొరపాట్లు చేస్తూండేది. "ఏమండీ, నువ్వు వెళ్ళి స్నానంచేసి రండి", "రంగా! స బ్బెక్కడ పెట్టారు?", "మీరు భోజనానికి వస్తావా?" - యిలాంటి వాక్యాలు మొదటి రోజు చాలా

దొర్లాయి. కాపీ రెండో రోజుకు అవి చాలా వరకూ తగ్గాయి. ఆమె ఏకవచన ప్రయోగంచేసి నపుడల్లా నా ముఖం అదోలా అయిపో తూండేది. బహుశా చిన్నబుచ్చుకునేవాడి ననుకుంటాను.

శ్రీమతి యిది గమనించినట్లుంది. "నే నిలా పిలవడం మీకు నచ్చుతున్నట్లు లేదు. ఇష్టం లేకపోతే మానేస్తాను. మీరు బాధపడితే నాకు బాగుండదు" అంది.

శ్రీమతికి నేను వజ్రాల హారాలు కొనలేదు. కొనమని ఆమె అడగనూ లేదు. యీ చిన్న కోరిక తీర్చలేకపోతే నా సంస్కారానికే అవ మానం. అందుకే నా కేమీ బాధ లేదని మరీ మరీ చెప్పాను.

శ్రీమతికి నన్నలా పిలుస్తూ బయట తిరగా లని వుందనుకుంటాను. నిజానికి ఆమె కింకా పట్టుమని పాతికేళ్ళు లేవు. పక్కన మా పిల్లలిద్దరూ లేకపోతే తనసలు పెళ్ళయిన మనిషిలా వుండదు. సన్నగా, తెల్లగా, అందంగా వుండే శ్రీమతిలోని కొత్త కోరికలను • యిప్పుడే చూస్తున్నాను నేను. మా పిల్లలు మా పిలుపుల గురించి పట్టించుకున్నట్లు లేదు. వాళ్ళ లోకంలో వాళ్ళున్నారు.

మే మిద్దరం కలిసి బీచికి వెళ్ళాం; హోటల్‌కు వెళ్ళాం, సినిమాకు వెళ్ళాం; శ్రీమతి అన్నిచోట్లా కూడా నా చేతిలో చేయి కలిపి నడిచింది. భుజానికి భుజం రాస్తూ మాట్లాడింది. ఉండుండి అదే పనిగా నవ్వేది. చాలా వుత్సాహంగా, చలాకీగా వుండేది. అన్ని సమయాల్లోనూ నన్ను నువ్వు అని పిలిచేది. ఆమె అలా పిలవగానే చుట్టూ వున్న వారంతా నాకేసి చూసినట్లూ, నన్నుచూసి నవ్వుతున్నట్లూ అనుభూతి పొందాను. కానీ ఆ అనుభూతితో పాటే సినిమా హీరోయిన్లకు తీసిపోని అంద మైన యువతి నాకు భార్యగా వున్నదన్న భావన కూడా నాకు ప్రప్రథమంగా కలిగింది.

ఇదివరలో శ్రీమతి చాలా ముక్తసరిగా వుండేది, నాకు కాస్త దూరంగా వుండేది. రోడ్డుమీద నడుస్తున్నప్పుడు చేయి పట్టుకోవడం మాట అటుంచి ఒకరి వేలు ఒకరికి తగిలినా సిగ్గుపడేది. పైగా మీకు "సిగ్గులేదు" అని కూడా అనేది. అటువంటి మనిషికి యీ విప రీతమయిన ప్రవర్తన యెంతవరకూ నప్పింది అని ఆలోచిస్తున్నాను నేను. అలా ఆలోచించ డంలోనే ఆమె అందం యితరుల నాకర్షించే టంత గొప్పదని గుర్తించి ఆ చేత్తోనే నా అదృష్టాన్ని కూడా గుర్తించాను.

శ్రీమతి యిలా మారిపోవడానికి నా తలి దండ్రు లూళ్ళోలేకపోవడమని నే ననుకోను. వాళ్ళు లేనప్పుడు కూడా మే మిద్దరం బీచికీ, సినిమాలకూ వెళ్ళాం. అప్పు డామె యిప్ప టిలా ప్రవర్తించేది కాదు. ఆమెపైన రామ నాథం భార్య సరళ ప్రభావం చాలా ఉన్నదని నాకు అనిపించింది.

సినిమా చూసి యింటికి వచ్చేక "ఈ రోజు నువ్వు నాకు చాలా నచ్చేవు. ఎప్పుడూ యిలాగేవుంటే నాకు సంతోషంగా వుంటుంది" అన్నాను. ఈసారి నే నన్నమాటల్లో కనీసం యాభై శాతమయినా మనస్ఫూర్తిగా వచ్చి వుంటాయి.


"వయసు మళ్ళీ మళ్ళీ వచ్చేది కాదు. సర దాలను అణచుకోకూడదనీ, చలాకీగా ఉత్సా హంగా వుండాలనీ సరళ అంటుంది రంగా!" అంది శ్రీమతి.

నే ననుకున్నట్లుగానే యిదంతా సరళ ప్రభా వమే. క్రమంగా నేను శ్రీమతి కొత్త పిలు పుకు అలవాటుపడుతున్నాను. అలవాటుపడు తున్నకొద్దీ ఆ పిలుపు నా కంత ఎబ్బెట్టుగా అనిపించడం లేదు.

రోజులు నెమ్మదిగా గడుస్తున్నాయి. నాన్న గారు రావడం కాస్త ఆలస్యమే అయింది. వచ్చేముం దాయన ఉత్తరం రాశారు. వాళ్ళు రేపు వస్తారనగా నేను మళ్ళీ యెప్పటి రంగా రావును అయిపోయాను.

"వాళ్ళెదురుగా కూడా నువ్వు నన్ను నువ్వనే పిలుస్తావా?" అన్నాను. అమ్మా, నాన్న, యిద్దరు చెల్లెళ్ళూ, ఒక తమ్ముడు - వీళ్ళముందు దీన్ని యెలా తట్టుకోవాలా అని నా బెంగ!

"పిలవాలనే వుంది రంగా! కానీ నీ కిష్టం



లేకపోతే నా కోరిక తీరదు" అంది శ్రీమతి.

"నా కిష్టమేనని చెప్పానుగా!" అన్నాను.

"నీకు నిజంగా యిష్టమే అయిన పక్షంలో నువ్వే వాళ్ళకు నచ్చచెప్పాలి. నీ బలవంతం మీదనే నే నలా పిలుస్తున్నట్లు చెప్పాలి. నేను యిష్టపడ్డంలేదనీ, ప్రతిఘటిస్తున్నాననీ-అయినా సరే నువ్వు శాసించడంవల్ల అలా చేస్తున్నాననీ చెప్పాలి. లేకపోతే నామీద ఒట్టే!" అంది శ్రీమతి.

ఇది నాకు చాలా యిబ్బంది కలిగించే విషయం. శ్రీమతికి మా అమ్మదగ్గర కానీ, నాన్నదగ్గర కానీ యిటువంటి విషయాలు మాట్లాడేటంత చనువు లేదు. అదీకాక తనే ఒకసారి భర్తను నువ్వు అని పిలిచేవారి గురించి మా అమ్మ దగ్గర వేళాకోళం చేసి వున్నది. సరళ వచ్చేక తను మారిపోయింది.

అమ్మా నాన్నలను రిసీవ్ చేసుకోడానికి స్టేషన్‌కు వెడుతున్నానన్నమాటే కానీ నాకు స్తిమితం లేదు. నాన్నగారిది అదోరకం మన స్తత్వం. ఒకోసారి చాలా చిన్న విషయానికి ఆయన పెద్ద రగడ చేస్తారు. ఆయన మూడ్ బాగుండకపోతే శ్రీమతి కొత్త పిలుపే నా కొక సమస్య కాగలదు. ఆయనకు కోడలంటే చాలా అభిమానం. మనసెరిగి మసలుకునే మనిషి అని పొగుడుతూంటారు. ఈ ఆరేళ్ళ లోనూ ఒక్కసారికూడా శ్రీమతి ఆయన్ను నొప్పించే పని చేయలేదు. అందుకే యీ కొత్త పిలుపు బాధ్యత నాపైకి నెట్టి తను తెలివిగా తప్పించుకుంది శ్రీమతి. పురుషుడికి అహంకారముంటే వుండవచ్చు గాక - కానీ యిలాంటి విషయాల్లో ఆడవాళ్ళు మగవాళ్ళని తేలికగా బోల్తాకొట్టించగలరు.

నేను స్టేషన్‌కి వెళ్ళాను. అంతా కలిసి ఒక టాక్సీలో యిల్లు చేరాం. ఇంటికి రాగానే శ్రీమతి నన్ను చూసి "మీ కోసం ఆఫీసు ప్యూను వచ్చాడండి. మీ ఆఫీసరుగారు అర్జంటుగా మిమ్మల్ని రమ్మన్నారట" అంది.

నే నాశ్చర్యపోయాను. శ్రీమతి నన్నలా సంబోధిస్తుందని నే ననుకోలేదు. తేలికపడ్డ మనసుతో ఆఫీసుకు వెళ్ళి ఆఫీసరుగారి సందేహం తీర్చి వచ్చాను. తిరిగి వచ్చేకకూడా శ్రీమతి నన్ను పొరపాటున కూడా నువ్వు అనలేదు. ఇలా యెందుకు జరిగింది? ఆమె అత్త మామలకు భయపడుతోందా?

శ్రీమతి నాతో చెప్పిన ప్రకారం అత్త మామల యెదురుగా కనీసం కొంతకాలంపాటు

డబ్బు

డబ్బు
నక్షత్రాలని కూడా కొంటుంది,
డబ్బు
సూపర్ ఎక్స్‌ప్రెస్ రైలుకి
రూపాయి బిళ్ళని అడ్డువేసి నిలిపివేస్తుంది
డబ్బు
దేశం తలమీద ఎగిరే
జెండాల రంగుని మార్చివేస్తుంది
డబ్బు
విమానాలని కూలుస్తుంది,
ప్రాణసుమాలను
బాణవర్షమై నేల రాలుస్తుంది,
డబ్బు
కవిత్వం పలుకుతుంది
ఊపిరి వెతుక్కుంటూ నడిచే
జీవితపు సుతిమెత్తని అరికాలికి
పలుకురాయై గుచ్చుకుంటుంది-
డబ్బు
డబ్బుని ప్రసవిస్తుంది
ఖాళీ కడుపుకి గాయంచేసి
అది
యురేనియమ్‌ని ప్రసవిస్తుంది!

—దేవీప్రియ

నన్ను నువ్వు అని పిలవకుండా పొడిపొడిగా పిలుస్తానంది. ఆ లెక్కన ఆమె "ఆఫీసులో అర్జంటువని వుందట ప్యూను వచ్చి చెప్పాడు" అని నాకు చెప్పవచ్చు. అలా అనకుండా "ఏమండీ!" అన్నదంటే అందులో యేదో పరమార్థమున్నది. అది తెలుసుకోవడం కోసం నేను రాత్రినుంచి యెదురుచూస్తున్నాను. అయితే ప్రయాణపు విశేషాలతో నాన్నగారు రాత్రి పదకొండు దాటించారు. నా మనసులోని కుతూహలం కారణంగా నేను ఆ విశేషాలను విని ఆనందించలేకపోయాను.

రాత్రి అవకాశం రాగానే శ్రీమతిని అడిగేశాను.

"మీరు వెళ్ళాక ఆ సరళ వచ్చిందండీ - ఆవిడ కొత్తరకం నెక్లెస్ చేయించుకుంది. బాగుందని మెచ్చుకుని యెక్కడ చేయించిందో అడిగాను. తర్వాత నా నెక్లెస్ చూపించి యిలాంటిది మీకు బాగా నప్పుతుంది - చేయించుకోకూడదూ అన్నాను. ఆవిడ కెంతో గర్వం అనుకున్నారు? తనను అందరూ అనుసరిస్తారుట. తనకు ఒకళ్ళని అనుసరించడం యిష్టముండదట - తనను యెవరెవరు ఏ యే విధంగా అనుకరించారో మెరిసేకళ్ళతో ఆవిడ చెబుతూంటే నాకు అనిపించింది. అనుకరించ డానికి ఆవిడలో విశేషమేముంది? అసలు ఆడ దానికి భర్తను మన్నించడంలోనూ, విచ్చలవిడిగా వుండకుండా వుండడంలోనూ మాత్రమే అందం వుంది. నే నేదో పొరపాటుపడి ఆవిణ్ణి అనుకరించపోతే నా కంటే పెద్దవాళ్ళు కదా - మీరైనా నన్ను కాస్త హెచ్చరించవద్దూ - ఒకళ్ళను నువ్వు అనుకరించడ మేమిటి? నీ పద్ధతులే నాకు నచ్చుతాయి అని మీరు నాకు చెప్పవద్దూ. మీ మూలంగానే నే నావిణ్ణి అనుకరించాను. ఇంకా నయం నేను మిమ్మల్ని నువ్వని పిలుస్తున్నట్లు ఆవిడకు చెప్పలేదు. చెపితే యింకా విర్రవీగిపోయేది" అంది శ్రీమతి.

శ్రీమతి నన్ను తప్పుపట్టింది. అయినా నాకు బాధ కలగలేదు. నా సమస్య ఒకటి తీరిపోయింది. ఇతరులను అనుకరించకపోవడం సరళ ప్రత్యేకత. అదే ప్రత్యేకతను సరళ చెప్పాకనే తనూ అలవర్చుకోవాలనుకుంటోంది శ్రీమతి. ఒకవిధంగా ఇదికూడా అనుకరణే! ఈ విషయాన్ని శ్రీమతికి వివరించి చెప్పి కొత్త సమస్యలను సృష్టించుకునే ఉద్దేశ్యంనాకు లేదు.

ఆడది పురుషుడి అహంకారాన్నెంతయినా సహించగలదు. అతడికి బానిసగా పడివుండగలదు. కానీ మరో ఆడదాని అభిజాత్యాన్ని ఈషణ్మాత్రం సహించలేదు. ఇది కొనసాగి నంతకాలమూ - ఇది పురుష ప్రపంచంగానే వుండిపోతుంది. తప్పదు!

నేనూ పురుషుణ్ణే కాబట్టి ఈ విషయమై బాధ లేకపోయినా నా శ్రీమతిపట్ల జాలి మాత్రం నా కున్నది! □

గులివింద గింజలు

చిట్టారెడ్డి సూర్యకుమారి

వాతావరణం ఆహ్లాదంగా వుంది.

లలితాదేవి విరిసిన గులాబీల దగ్గర నిల్చుని పూలభారంతో వంగిన మొక్కలను ఆనందంగా చూస్తూ పనివానితో తోటపని చేయిస్తూంది. మధ్య మధ్య మొక్కలను సవరిస్తూ అవసరమైన సలహాలు యిస్తూ స్వయంగా మొక్కలకు నీళ్ళు పోస్తూంది. ఇక కొన్నాళ్ళుపోతే తన కష్టం ఫలిస్తుంది. కూరగాయలన్నీ పంటకు వస్తాయి. శ్రీవారికి తన తోటలో పండించిన కూరగాయలతో కూరలుచేసి పెడుతుంది. పెరటిలో పండిన కూరగాయలు ఎంత రుచో.... లలితాదేవి ఆలోచనలు చాలా దూరం పోకముందే "నమస్కారమండీ!" అంటూ వచ్చింది మరో ఆఫీసరు సతీమణి శ్రీమతి.

శ్రీమతి తోటంతా కలయజూస్తూ "మీరొచ్చి ఆరునెలలు కాలేదు యెడారిలా వున్న బంగళాని ఒయాసిస్సులా మార్చారు" అని మెచ్చుకుంటూ చటుక్కున పసుపు గులాబి త్రుంచి ఆఘ్రాణించి తలలో పెట్టుకుంటూ, "ఏమిటీ, కరేపాకు, నిమ్మచెట్టు కూడా వేశారే" అంటూ పకపక నవ్వింది.

నవ్వుతూ "అన్నాళ్ళు యిక్కడ వుందామనే!" అంది.

"మేము వుండకపోయినా మరో ఆఫీసర్ వస్తాడు, వాళ్ళు అనుభవిస్తారు - ఈ బంగళాకి అంత విశాలమైన చోటు వుంది. వృధాగా వదిలేస్తే యేం లాభం! రండి, రండి కూర్చుందాం" అంటూ నీళ్ళవైపు పనివాడికిచ్చి వచ్చింది.

వారు మాటల్లో వుండగా లలిత భర్త వేణు వచ్చాడు. వాకిట్లో వుండగానే "లల్లీ! మనకి ట్రాన్స్‌ఫర్ వచ్చింది" అన్నాడు.


లలిత నోట మాట రానట్లు చూస్తూండిపోయింది. వచ్చి ఆరునెలలు కూడా కాలేదు. పిల్లలు యిప్పుడిప్పుడే సెటిల్ అవుతున్నారు. సంవత్సరం మధ్యలో వాళ్ళని తీసుకువెళ్ళి మరో స్కూల్లో చేర్పించి, మరల వాళ్ళు ఆ పరిసరాలకి, కొత్త టీచర్స్‌కి అలవాటుపడే లోపల సంవత్సరపు పరీక్షలు రానే వస్తాయి. ఈ విధంగా సంవత్సరం సంవత్సరం వూరూరు మారుతుంటే మంచి ఫౌండేషన్ పడేది యెప్పుడు? రేపు షట్ సూత్ర ప్రణాళికలో వీళ్ళకి యే కాలేజీలో సీటు వస్తుంది? వుద్యోగాలు యెక్కడ దొరుకుతాయి? ఆ తల్లి బాధ అంతా పిల్లల గురించే.

మంచి స్కూలు చూసి హాస్టల్లో చేర్పిద్దామంటే వచ్చే జీతంలో సర్దుబాటు కాదు. పేరుకు గజిటెడ్ ఆఫీసర్. కాని ఆ జీతం కుటుంబ ఖర్చులకు బొటాబొటీగా సరిపోతుంది. పై....పై....ఆదాయం యింట్లోకి రాదు. రావటానికి వీలులేదు. భర్త అతి నీతిమంతుడు. అందుకే యిన్ని కష్టాలు. ఎక్కడ నీతి అవసరమో అక్కడికి వేస్తుంటారు అతన్ని.

ట్రాన్స్‌ఫర్ వచ్చిన వూరుపేరు విని నోరు తెరిచింది లలిత. వీరున్నది ఆంధ్రా. వెళ్ళవలసింది తెలంగాణా!

కుర్చీలో కదలక కూర్చున్న భార్యవైపు వంగుతూ "ఏమిటోయ్, మనకి ట్రాన్స్‌ఫర్లు కొత్తకాదుగా! నాకు నీవు నీకు నేను వుంటే ప్రపంచంలో యే మూలకు వెళ్ళినా మన యింట్లో వున్నట్టే వుంటుంది."

"ఆ..అయితే పూలకుండీలు మా కివ్వాలి."



ఆ మాట అంటున్న శ్రీమతిని అప్పుడు గుర్తించాడు. చూసి నమస్కరించాడు సిగ్గు సిగ్గుగా.

* * *

దొరల కాలంలో కట్టిన బంగళాలోకి భార్యతో వచ్చి దిగాడు రమణాజి.

ముందు లాన్, పూలమొక్కలు. వెనుక కూరగాయల తోట. రంగులు కొట్టి కొత్త

బంగళాలా వున్న యింట్లో భార్య ఆనందంగా తిరుగుతుంటే రమణాజీ గర్వంగా మీసాలు తిప్పుకున్నాడు.

మంచి క్వార్టర్సు - వాతావరణం ఎప్పుడూ ఆహ్లాదంగా వుంటుంది. హాలిడేస్‌లో అటు బెంగుళూరు యిటు హైదరాబాదుకు పోవచ్చు. అన్నిటికంటె మాంచి డివిజన్, పై పైవి చాలా వుంటాయి. అన్నీ మజాలే. హై లెవల్లో ట్రైచేసి వచ్చాడు. పిచ్చి వేణు తినడు, మరొకడిని తిననివ్వడు.

సంవత్సరం మధ్యలో యెవ్వరిని ట్రాన్స్‌ఫర్ చేస్తే యెవ్వరు వూరుకుంటారు. ట్రాన్స్‌ఫర్ అనగానే ఛలో హైదరాబాదు అంటారు. డిపార్టుమెంటులో యే ఒకరో యిద్దరో వుంటారు మోరల్సును పట్టుకుని. వారిని సెపి సీలా వాడుకుంటారు అని వేణుమీద బోలెడు జాలిపడ్డాడు రమణాజీ.

కడుపులో చల్ల కదలకుండా జాలీగా కాలం గడిపేస్తున్నారు రమణాజీ దంపతులు.

* * *

వరలక్ష్మి గజిటెడ్ ఆఫీసర్ భార్య కాదు. యన్.జి.ఓ. భార్య. ఇంటి ముందు పందిరి వేయిస్తుంది. ఎండలు అమితంగా వున్నాయి. సగం యిల్లు రేకులతో కప్పివుండటం వలన పగలు యింట్లో వుండలేకపోతున్నారు. ఖర్చు అయితే అయిందని తెగించి పందిరి వేయిస్తూంది.

వరలక్ష్మి వాళ్ళు యీ వూరికి వచ్చి సంవత్సరమైంది. ఇక్కడి నీరు గాలి తనకు బాగా పట్టాయి. ఆరోగ్యం బాగుంది. పిల్లలకి స్కూలు దగ్గర్లోనే వుంది. అన్నిటికంటె ముఖ్యంగా అమ్మగారి వూరు దగ్గరగా వుంది. పిలిస్తే వస్తారు అవసరానికి. కాన్పు యిక్కడే చేసుకోవచ్చు. డబ్బుకు అంత భయపడ నవసరం లేదు.... అని తలుస్తూ పందిరి వేసే వాడికి సహాయం చేస్తూంది.

ఆ సమయాన భర్త శంకరప్ప పసుగులాంటి నడకతో వచ్చి సగం వేసిన పందిరి క్రింద కూర్చున్నాడు. గర్భిణీతో వున్నా వంగిలేస్తూ పనిచేస్తున్న వరలక్ష్మి వైపు చూశాడు. ఆతని హృదయం కరిగిపోసాగింది. "వరలక్ష్మీ! యింకా యెందుకు పందిరి? మనకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది" పిడుగులాంటి వార్త చెవిన పడేశాడు.

"తమాషా చేస్తున్నారా?"

చొక్కా నేలకేసి కొడుతూ, "నిజం- వరలక్ష్మీ!" అన్నాడు. వుస్సూరంటూ మెట్లపై కూర్చుంది.

"మనం వచ్చి సంవత్సరం కూడా కాలేదు. అప్పుడే బదిలీ యెలా వచ్చింది? మూడు సంవత్సరాలకుగాని యివ్వకూడదని రూలేదో వుంది కదా!"

"రూల్సు వున్నాయిగాని వాటిని పాటించే దెవ్వరు? మా ఆఫీసరుగారు ఆరేళ్ళ నుంచి వుంటున్నారు. ఆయనే నాకు ట్రాన్స్‌ఫర్ యిచ్చింది."

"ఎవ్వరో లంచం యిచ్చి వుంటాడు."

పందిరివేస్తున్న అతను వీరి సంభాషణ వింటూ "అమ్మా, పందిరి వేయమంటారా!" అని అడిగాడు.

"సగంలో యెలా అవుతావయ్యా? వేయి" అని, "ఏమండీ! అలా కూర్చుండిపోతే యెలా? అందరూ ట్రైచేసుకున్నట్లు మనం ట్రైచేసుకుందాం. వాళ్ళు వేశారని మనం వెళ్ళాలా? లేవండి! లేవండి! మా అన్నయ్య దగ్గరకు వెళ్ళండి! ఆ వూరి యం.ఎల్.ఎ. బాగా తెలుసు. మీ మినిష్టరుకి సిఫార్సు చేస్తాడు. కావాలంటే నా గాజులు తాకట్టుపెట్టి డబ్బు తీసుకువెళ్ళండి" ఆ రోజే భర్తని తన అన్నయ్య దగ్గరకు పంపింది వరలక్ష్మి.

సింహాసనం లాంటి కుర్చీలో దర్బారుకు వచ్చిన మహారాజులాగ రమణాజీ ఆసీనుడయ్యాడు.

హెడ్ గుమస్తా, గుమస్తాలు చేతులు కట్టుకుని అతి వినయంగా నిల్చుని వున్నారు. ఒకటి రెండు ఫైల్సుమీద సంతకం చేసిన రమణాజీ అలసిపోయినట్లు వళ్ళు విరుచుకున్నాడు.

ఆ సమయాన శంకరప్ప తన కష్టసుఖాలు వ్రాసుకున్న విన్నతిపత్రంతో యం.యల్.ఎ. వ్రాసిన సిఫార్సు పత్రం జోడించి రెండు చేతులతో పట్టుకుని అలాగే నమస్కారం చేస్తూ అతి వినయంగా వంగి, వంగి వచ్చి బల్లమీద పెట్టాడు.

పెద్ద కుర్చీలో యెలుకలా కదిలాడు రమణాజీ. ఆ వుత్తరాన్ని యెడంచేత్తో తీసి అలా కళ్ళతో చదివి పళ్ళు బిగపెట్టి కళ్ళు ఎరుపు చేసుకుని ఆ కాయితాలను శంకరప్ప ముఖాన కొట్టాడు "యు ఫూల్! యూ రాస్కెల్" అంటూ.

"నీ కెంత ధైర్యం! నా దగ్గరికా నీవు రెకమెండేషన్స్ తెచ్చేది! నే నెలాంటి ఆఫీసర్ని? యిలాంటి ఉత్తరాలంటే నా కసహ్యం అని నీకు తెలియదా?" నొసలు యెగురవేశాడు రమణాజీ. కళ్ళు పెద్దవిగా చిన్నవిగా చేసి చూస్తూ వంకరగా నవ్వాడు. "నాకు ట్రాన్స్‌ఫర్ వద్దు - వద్దు అని ప్రతివాడు అంటే వెళ్ళేది యెవ్వరోయ్! సంవత్సరాల కొద్ది వున్న ఊళ్లో పాతుకుపోతే యెలాగ? గవర్నమెంటు వుద్యోగం అన్నాక బదిలీలు వుంటాయి. వాళ్లు చెప్పినట్లు వినటం మన విధి! మన డ్యూటీ!"

శంకరప్ప యేదో చెప్పుకోటానికి నోరు విప్పాడు.

'షటప్' అన్నట్లు చూశాడు. చూసి "వూ......నీకు యం.ఎల్.ఎ.లు మినిష్టర్లు తెలుసన్నమాట. పెద్దవాడివే. అక్కడనుంచే తెచ్చుకోవోయ్ ఆర్డర్లు! ఒకసారి వేసిన ఆర్డరు కాన్సిల్ చేయటం నా మతం కాదు. యు కెన్ గో!" తల తిప్పి హెడ్ వైపు చూశాడు ఎలా వుంది నా లెక్చర్, నా ఇంగ్లీష్ అన్నట్లు.

హెడ్ ప్రశంసిస్తూన్నట్లుగా తలవూపాడు.

"వెధవలు, చవటలు - పనీ పాటా లేదు. వున్న వూర్లోనే వుంటూ సంపాదన నేర్చారు. బదిలీ అంటే చాలు మూట పట్టుకునిపోతారు. అక్కడ ఆ నాయకులు దేశం గురించి, వారు చేయవలసిన పని గురించి వారికి తెలుసో తెలియదోగాని ఇలాంటి బాపతుగాళ్ళను వెంటపెట్టుకుని మినిష్టర్ల యిండ్లకు పోతుంటారు. ఈ పనిలో వారికి తీరిక వుండదు. ఇదో పెద్ద రాకెట్! ప్రమోషన్లు-ట్రాన్స్‌ఫర్లు - పర్మిట్లు - పీళ్ళతో నిండిపోయి వుంటాయి హోటల్సు. రామ! రామ! మనదేశం బాగుపడే దెప్పుడు?

నాలాంటి ఆఫీసర్లు వుంటే మాత్రం అలా గాలికి కొట్టుకుపోతుంటారు." లెక్చర్ దంచి, దంచి అలసిపోయాడు రమణాజీ.

* * *

లలితాదేవి నాటిపోయిన నిమ్మ మొక్క పెద్ద చెట్టు అయి నిండుగా కాయలు వేసింది.

'ఓ రెండు వందల కాయలు కోసి వుంచు అమ్మాయికి పంపాలి' అని పనివాడికి పురమాయిస్తూ వుంటే హాలులో ఫోన్ మోగింది.

"సుందూ!" ఆవతల రమణాజీ గొంతు బొంగురుగా, బాధగా వినిపించింది.

వారి స్వరం అలా బాధగా ధ్వనిస్తూం దేమిటి? యెప్పుడూ సింహంలా పలికే కంఠం దీనంగా 'సుందూ' అంటున్న దేమిటి?

తనవాళ్ళందరూ బాగున్నారు కదా!

పెద్దమ్మాయి లిద్దరికి పెళ్ళిళ్ళు చేశారు. అబ్బాయిలు యిద్దరూ ఉద్యోగాలల్లో వున్నారు. వాళ్ళ దగ్గరనుంచి యేదయినా అశుభవార్త రాలేదు కదా? అని సుందరి తలుస్తూ "ఏమండీ?! అంది ఆదుర్దాగా.

"సుందూ! మనకి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. యిప్పుడే టపాలో చూశాను" భారంగా పలికాడు.

"అమ్మో! యిప్పుడు ట్రాన్స్‌ఫర్ వస్తే యెలాగ? చెట్టు నిండుగ నిమ్మకాయలు, మునగకాయలు, మామిడి కాయలు వున్నాయి. అవన్నీ యేమయిపోవాలి?"

కమ్మటి వాసన వస్తుంది.పోపులో కరేపాకు వేశాడు వంటవాడు.

ఇంత పెద్ద బంగళాలో చిలకా గోరింకలా యిద్దరూ యెంత హాయిగా వున్నారు.

"సుందరీ,"

"విన్నానండి. ఇదెక్కడి అన్యాయం! ఎవ్వడికి పుట్టిం దీ పాడుబుద్ధి? ఎవ్వడో ఓర్వ లేనివాడు చేశాడు. మనం వచ్చి ఆరేళ్ళగా

అయింది! అంటే మరో నాలుగేళ్ళయినా వుంటామని అనుకున్నాం కదా! సెలవలకి చిన్నమ్మాయివాళ్ళు వస్తామన్నారు. అల్లుడికి మన రాజసం - దర్బారు చూపించవద్దా! ఇంతకీ యే వూరు వేశారు?"

"హైదరాబాదా! వోరి నాయనో, అక్కడ మనలను యెవ్వరు చూస్తారు! ఎంత పెద్ద ఆఫీసరయినా గుమస్తాలాగానే కదా! చద్ది తిని ఫైల్సు చేతపట్టుకుని బస్సు కొరకు పరుగెత్తాలి. ఆఫీసు కారు వుంది కదా అని యిన్నాళ్ళు కారు కొనలేదు. అదొక దండగ అనుకున్నాము. వోరి భగవంతుడా! ఇప్పుడు మన కెన్ని కష్టాలు! ఇంత బంగళా హైదరాబాదులో యెక్కడిదీ? రెండు వేలు పెట్టినా వస్తుందా? ఏమండోయ్! యింకా అక్కడే కూర్చున్నారా? రండి! కొంపదీసి మనకి బదిలీ అని యెవ్వరికైనా చెప్పారా?"

"లేదు - లేదు - అయినా నీవు నా తెలివిని తక్కువగా అంచనా వేస్తున్నావు డార్లింగ్?" అంటూ ఫోన్ పెట్టేశాడు.

గది బయట పొంచి ఈ సంభాషణ ఇంట్లో పనివాడు, ఆఫీసులో అటెండర్ అంతా విన్నారు.

రమణాజికి ట్రాన్స్ఫర్ వచ్చింది. అది గాలి కంటే వేగంగా ఆ డివిజన్ అంతా పాకిపోయింది.

* * *

రమణాజి ఏకాంత మందిరంలో భార్యతో చర్చలు సాగించాడు.

ఇప్పుడు హై లెవల్లో తనకు తెలిసినవాళ్ళెవ్వరూ లేరు. కొందరు దిగిపోయారు, మరికొందరు విలువలేకుండా పోయారు.

ఇప్పుడు ఎలాగ? అని ఆలోచనలోపడ్డాడు.

నిన్నగాక మొన్న బదిలీ అయిపోయిన శంకరప్ప గుర్తుకు వచ్చాడు. అతను తన గుమాస్తా. కాకితో కబురు పంపినా వస్తాడు. ఆఫీసు పనిమీద టెలిగ్రాం ఇచ్చి పిలిపించాడు.

శంకరప్ప పే....ద్ద ఆఫీసర్ ముందు చేతులు కట్టుకుని నిలుచున్నాడు.

అతన్ని చూస్తూనే రమణాజి "హి....హి... రావోయ్! ఇటు కూర్చో" అంటూ ముందు కుర్చీ చూపించాడు.

మరీ బలవంతం చేస్తుంటే కూర్చోకుంటే బాగోదని కుర్చీ చివర్లో సీటు ఆనించి బరువంతా కాళ్ళమీద వేసుకుని కూర్చున్నాడు.

"చూడు మిస్టర్ శంకరప్ప! నీకు ఆ యం.ఎల్.ఎ బాగా తెలుసు కదూ? ఆయన మాట మన మినిస్టర్ బాగా వింటాడని వినికిడి. వారిద్దరు బాల్య స్నేహితులట. అరే ఒరే! అని పిలుచుకునే స్నేహం వుందట. నీవు....నాకు చిన్న సహాయం చేయాలి. నాకు ట్రాన్స్ఫర్ వచ్చింది. కాస్త ఆయనకి చెప్పి కాన్సిల్ చేయించాలి. నీకు తెలియంది యేముందీ! మీ అమ్మగారిక్కి....అదే నా వైఫ్‌కి వంటో బాగుండటంలేదు. ఇక్కడ డాక్టర్ బాగా అలవాటైపోయారు. ఈ సమ్మర్‌లో వెళ్ళాలంటే కష్టం. పైగా చిన్నమ్మాయి వస్తానంది. చెప్పుకుంటే అన్ని కష్టాలే! ఆ....ఖర్చుకు భయపడకు - ఎంత కావాలో అంత తీసుకు వెళ్ళు."

ఆనాడు సింహంలా గర్జించి నీతులు మాట్లాడినతను పిల్లిలా దీనంగా చూస్తూ కుక్కలా తోకాడిస్తున్నాడు.

ఆ రోజు అతనిచ్చిన వుపన్యాసాలు ఇప్పుడేమైనవి? అతని పిల్లలందరూ సెటిల్ అయిపోయారు. వున్నది ఇద్దరు. ఎక్కడికి వేస్తే అక్కడికి పోవటానికేం జబ్బు! ఈ వూరిలో ఆరేళ్ళు వున్నది చాలదా? ఛూ! అని ముఖాన వూయాలనిపించింది శంకరప్పకి. నీతులు చిన్నవాళ్ళకేనా? పెద్దవాళ్ళకి వర్తించవా? అని నిలదీసి అడగాలనిపించింది. కాని అవన్ని వారికి తెలియవా? తెలుసు. క్రిందికి వంగి చూసుకోరు అంతే! గురివిందగింజ వంటివారు అని తలుస్తూ ఆఫీసర్ యిచ్చిన డబ్బును తీసుకని రెకమెండేషన్ కొనుక్కురాను వెళ్లాడు శంకరప్ప.

పోయినోళ్ళు ఉన్నోళ్ళ చేదు సురుతులు

"వెయ్యోగుడనే వాట్ని నేను వున్నానని గుర్తుందా?"

"ఉండకపోతే ఎట్టా మాట్లాడతానయ్యా?"

"అట్టా మాట్లాడొద్దని ఎన్నిసార్లు చెప్పానే! నీ ఎదవ బతుక్కి తోడు నాకాడ తెలివిగా మాట్లాడావా?" సోమయ్య రమణమ్మని గుంజకేసి బాదేస్తున్నాడు. ఒంటి గుంజమీద నిలబడ్డ పూరికొంప గాలిలో దీపంలా ఒణికిపోతున్నాది. జాతరలో దుకాణాల ముందు మూగినట్లు జనం మూగి చూస్తున్నారు.

సోమయ్య గుడిశదగ్గర ఇది రోజూ జరిగే తంతు. ఆ గుడిశల్లో వాళ్ల సాయింత్రం అయేసరికి ఆరుబయట అన్నాలు పెట్టుకొని ఎంత అసంకల్పితంగా తింటారో అంతగా వీళ్ళతంతు గూడా చూసి ఆనందిస్తుంటారు. అక్కడున్న యాభై గుడిశల్లో కనీసం రెండుమూడు అయినా సాయంత్రంఅయేసరికి ఇలాంటి కార్యక్రమాలు ఉచిత వినోదంగా అందిస్తుంటాయి. అందులో మొగాళ్ళకి పెళ్ళాల్ని కొట్టడం ఒక స్టేటస్. తమ మగతనానికి నిదర్శనంగా భావిస్తుంటారు. వారానికొకసారయినా పెళ్ళాంమీద చెయ్యి చేసుకోనివాడు వాజమ్మకిందే లెక్క!

యాభైలోపడ్డ ముసలాళ్ల కుర్రాళ్ళని ఏడిపించడానికయినా "పెళ్ళాన్ని ఎప్పుడన్నా కొట్టి వదిలావా?" అంటూ వుంటారు. వాళ్ళంతా ఒడుదుడుకొన్నవాళ్లు కారు.

చదువుకున్నా పోతన పద్యం అసలు చదువుకోలేదు.

ఆ గుడిశలన్నిటికీ కలిపి ఒక కట్టు వుంది. మొగుణ్ణి అదేమనగూడదు. కానీ మొగుడు కొట్టడం మొదలుపెట్టాక అతన్ని అడ్డమయిన బూతులూ తిట్టవచ్చు. ఆడదానికి తిట్టే అధికారం మొగాడికి కొట్టే అధికారం ఏ రాజ్యాంగం నుంచీ వాళ్లు తీసుకోలేదు. వాళ్ళంతట వాళ్ళే సాంప్రదాయకంగా నిలుపుకొంటున్నది అది.

జీవితంమీద రోతపుట్టినా కూలి గిట్టుబాటు కాకపోయినా నాటు పుల్‌గా తలకి ఎక్కినా ఆ రాత్రి మొగాడు పెళ్ళాన్ని ఏమయినా చేస్తాడు. అతను ఏంచేసినా రెండుమూడు గంటలు సేపు చుట్టూ ప్రేక్షకులు పట్టించుకోరు.

ఈ తతంగానిక్కి ఆరు పంచవర్ష ప్రణాళికల వయస్సు వుంది.

నాంచారు మొగుడికి స్నానం చేయిస్తూ ఓ కంట జరుగుతున్నదంతా గమనిస్తున్నాది. పెళ్ళాం ధ్యాస ఇక్కడ లేదని వాడికి తెలుస్తున్నాది. జాకెట్ కిందగా వీపుమీద మెల్లిగా ఒకటి తగిలించాడు. నాంచారు కెవ్వుమని ఈ లోకంలోకి వచ్చింది.

"నీ చెయ్యిడిపోను! ఏందీ మోటుదనం?" నాంచారు ఎర్రబడ్డ వీపుమీద వేలేసి రాసుకుంటూ అంది.

"మోటుదనం లేకపోతే మొగుడెట్లా అవుతాడే?" వెంకడు కిసుక్కున నవ్వాడు.

నాంచారుకి పెళ్ళయి ఆరు వారాలయింది. 'దానియేలుపేట' గుడిశల్లోకి వచ్చి కాపరంపెట్టి

'ప్రశాంత'

నాలుగు వారాలయింది. వెంకడు బుద్ధిమంతుడే గానీ చుట్టూ వాతావరణం చూసి తెగ భయపడుతున్నాడి. వీడు గూడా అందరు మొగాళ్ళలా తయారయి తనని కొట్టడం మొదలెడ్తాడేమోనని నాంచారు భయం. చుట్టూ అంతా తాగుబోతులు తిరుగుబోతులు. ఇష్టం వచ్చినట్లు [illegible]గెయ్యడం, తిరిగెయ్యడం. నోటికొచ్చినట్లు బూతులు మాట్లాడేసుకోడం. నాంచారుకి బస్తీ బతుకు మీద మోజు ఎక్కువ. అందుకని కోరి వెంకడ్ని చేసుకుంది.

సాయింత్రం అయేసరికి మిల్లునుంచి తిన్నగా ఇంటికొచ్చి స్నానం చేసి బయట మంచం వేసుకుంటాడు. కూడు తిని పడుకుంటాడు. బీడీలు గూడా తాగడు. అయితే రోజూ దీపాలు పెట్టే వేళకి చుట్టూ మొదలయే అల్లర్లు నాంచారులో చాలా భయాలు లేపాయి. అందులోనూ తను పల్లెలో మహా అల్లారు ముద్దుగా పెరిగింది.

రాత్రి పదకొండు అయింది. ఊరు సద్దుమణిగినా ఇంకా అక్కడక్కడ గుడిశల్లో గొడవ ఏదో వినబడ్తున్నాది.

నాంచారుకి నిద్ర రావటంలేదు. వత్తి కాయల్లా కళ్ళు మెరుస్తున్నాయి. 'ఏందే ఆలోసిస్తున్నావ్?' వెంకడు ఇటు తిరిగి పొట్టమీద చెయ్యి వేశాడు.

"మనం ఈడనుంచి లేసి ఎల్లిపోదాం...." నాంచారు మాటలకి వెంకడు పగలబడి నవ్వాడు.

"నీ బయం నాకు తెలిసి పోయిందే...." నాంచారు పట్టుబడిన దొంగలా సిగ్గుపడలేదు. రెప్ప ఆర్పని కళ్ళలో అలాగే ఆలోచన్లు కదుల్తున్నాయి.

"ఈడకి మొదట్లో వొచ్చినోల్లంతా నీలాంటోల్లే. తర్వాత ఇలా అయారు. నువ్వేం గొప్పోదీవా ఏంది? అలా అవకుండా వుండటానికి. ఆడదాన్ని కొట్టే మొగోడంటే నాకు అసయ్యం. సంపెయ్యాలనపించుద్ది. నాకు నీ మీద యెంత పేమ వున్నాసరే నేనది సయించలేను. నువ్వూ ఈల్లలా తయారయితే నిన్ను సంపి నేను సత్తా."

"ఛః ఏందే ఆ మాటలు?" వెంకడి మాటలకి నాంచారు ఏం బదులు చెప్పలేదు. మాటలకి బదులు కన్నీళ్ళు పొంగాయి.

"ఆ మేడలో వుండేవాళ్ళూ మడుసులే? మనం మడుసులమే. కానీ మనం యెలా వుంటున్నాం? ఆల్లెలా వుంటుండారు?"

"ఎర్రిమాలోకమా! ఆల్లు మేడోల్లు. మనం గుడిశలోళ్ళం తెలిసిందా? ఇంక పడుకో" వెంకడు పక్కకి తిరిగి పడుకున్నాడు. నాంచారు అలాగే ఆలోచిస్తున్నది. ఈ సమస్యకి పరిష్కారం యేదో తొందర్లో చెయ్యాలి. ఆలస్యం అయితే దావూదుగాడు సుబ్బడుతో ఇంకా స్నేహం పెరుగుతుంది. ఏసాయింత్రమో మిల్లీ పుచ్చేసుకుని చల్లగా గుడిశకి వస్తాడు. తనకి తన గుడిశకి యింత నిప్పు అంటిస్తాడు.

* * *

నాంచారు సౌందర్యకి నచ్చింది. రావుగారికి యింకా నచ్చింది. ఎంత నచ్చిందంటే యే కామెంటూ చెయ్యలేనంతగా నచ్చింది. ఈయనకి మరీ నచ్చినప్పుడు మెదలకుండా వుండిపోతాడు. అది ఆయన గుణం, ఆయన డిగ్నిటీ.

రావ్ సౌందర్యని చూసినప్పుడు గూడా ఏవీ కామెంట్ చెయ్యలేదు. అందుకే సౌందర్య అతని అర్థాంగి అయింది. అది ఆరేళ్ళనాటి మాట.

ఇప్పుడు నాంచారు కూడా నచ్చింది. అందుకే ఆ యింట్లో పనిమనిషి అయిపోయింది.

రావ్ ప్రముఖ వ్యక్తి. ఎందుకంటే పెద్ద పారిశ్రామికవేత్త. పెద్ద పారిశ్రామికవేత్తల దగ్గర పెద్దగా శ్రమించే శ్రామికులు వుంటారు. శ్రామికులు యెక్కడ కుప్పబడితే అక్కడ డబ్బు పిల్లలు పెడుతుంది. డబ్బు యెక్కడ వుంటే అక్కడ ఆ వ్యక్తికి అంత ప్రాముఖ్యత పెరుగుతుంది.

రావ్‌కి ఆరు ఫ్యాక్టరీలు వున్నాయి. వంద ఎకరాల కొబ్బరితోట వుంది. అందులో అందమయిన బంగళా వుంది. ఆ బంగళాలో బంగాళాఖాతం అంత లోతయిన, బలమయిన అనుభ



వాలు, సుఖాలు ప్రతి రాత్రీ దొరుకుతాయి. ఆ బంగళా కేవలం వ్యాపారం సుఖంగా సాగడం కోసం పుట్టింది. ఇన్‌కమ్ టాక్సు, సేల్స్ టాక్సు అధికారులు, గవర్నమెంట్ అండర్ సెక్రెట్రీలు మంత్రులూ వగైరా రావ్ వ్యాపార అభివృద్ధి పథకాలమీద అక్కడే నిర్ణయాలకి వస్తుంటారు.

రెండు రైస్‌మిల్లు, నాలుగు కోళ్ళ ఫారాలు, బాల్‌బేరింగ్స్ తయారుచేసే ఫ్యాక్టరీ రెండు సినిమా థియేటర్లు, రాష్ట్రానికి ఓ బీరు కంపెనీ హోల్‌సేల్ ఏజెన్సీ, రావుగారి బహుముఖ వ్యాపారదక్షతకు చిన్న విషయసూచిక వంటివి.

దానిఏలుపేట అనబడే గుడిశల కంపుకి ఎదురుగా వున్న స్థలం అంతా రావుదే. కొండంత దేవుడ్ని కొండంత పత్రితో కొలవలేనట్లు అంత పెద్ద స్థలం అంతా యిల్లు కట్టలేక సింపుల్‌గా రెండు వేల గజాల కాంపౌండులో భారతీయ సంస్కృతి అంత పెద్ద ఇల్లు కట్టించాడు. ఆ యిల్లు చూడటానికి రెండు

కళ్ళు చాలవు. ఆ యిల్లంతా ఒక్కసారిగా తిరగడానికి రెండు కాళ్ళు చాలవు. అమెరికా నుంచి ఆర్కిటెక్ట్స్, జపాన్‌నుంచి స్పెషల్ రాళ్ళు ఫ్రాన్స్ నుంచి ఇంటి డిజైన్స్ ఇంగ్లాండు నుంచి స్టీల్ వచ్చాయి.

ఇండియా గొప్ప బీదదేశం అనడానికి దాని యేలుపేట, ఇండియా అంత అధ్వాన్నపు దేశం లేదు అనడానికి రావుగారి భవంతీ, నిదర్శనంగా పక్క పక్కన ఎదురెదురుగా కనబడతాయి. ఆధునిక కాలంలో ఏకత్వంలో భిన్నత్వానికి నిదర్శనంగా ఈ ఆర్థిక అసమానత దేశంలో కావల్సినంత కనబడుతుంది.

రావ్‌గారి ఇంట్లోని కార్పెట్స్ మాత్రమే లక్ష రూపాయలు అవుతాయి. ఆ యింట్లో వున్న సోఫాసెట్స్ అన్నీ అమ్మేస్తే పాతిక కుటుంబాలకి జీవిత కాలం సరిపోతుంది. ఆ యింటి గూర్ఖా వెయ్యి రూపాయలు తీసుకుంటాడు. ఆ ఇంటి ప్రధాన కుక్కకి నెలకి పది వేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఇంకా ఆ ప్రధాన కుక్కలు చాలా వున్నాయి.

పొద్దుటి నుంచి కడుపు కాలుతున్నవాడు ఖరీదయిన బాక్సాఫీసు కలర్ సినిమా చూసి ఇంటికొచ్చి అందులో హీరో పాత్రలో తనని ఊహించేసుకుని కానేపు ఎలాంటి అబద్ధపు ఆనందం అనుభవిస్తాడో రావ్‌గారి ఇంట్లో పని దొరికిన రోజు రాత్రి నాంచారు గూడా అంత ఆనందంగా పడుకుంది.

పక్కన పడుకున్న వెంకడు మహా సంతృప్తిగా నిద్రపోతున్నాడు. నాంచారుకి మాత్రం నిద్ర రావడం లేదు. ఆమె ఆలోచనలు అనంతంగా వున్నాయి.

ఎలాగయినా అమ్మగారి దగ్గర మంచి పేరు సంపాదించుకోవాలి. ఆవిడ్ని మంచి చేసుకోవాలి. ఆ తర్వాత వెంకడ్ని గూడా వాళ్ళింట్లో పనికి పెట్టాలి. ఆ తర్వాత వాళ్ళింటి ఔట్ హౌస్‌లో కాపరం పెట్టెయ్యాలి. ఇప్పటికే అందులో మూడు కాపరాలున్నాయి. వాళ్ళలో ఎవరో ఒకర్ని లేపేసి తాము చేరాలి. రోజంతా వెంకడు బంగళాలో పనిచేసి రాత్రి అమేసరికి ఆ ఔట్‌హౌస్‌లోనే పడుకుండిపోతాడు. ఇంక అసలు బయటకి రావడం వుండదు. వచ్చినా అలగా గ్యాంగుతో తిరగడు. నాటు తాగడు. మొగుడ్ని పూర్తిగా గుప్పెట్లో పెట్టుకోవచ్చు.

* * *

నాంచారు సన్నగా, నాజూగ్గా వుంటుంది. పుట్టింది పల్లె అయినా బస్తీ గులాబీలా నిగనిగలాడుతుంటుంది. ఆరు నెలల్లో వేషం భాష మరీ మెరుగయ్యాయి. ఫ్యాషన్ పోయింది. కాస్త భేషజం వచ్చింది. సౌందర్యకి మరీ సన్నిహితురాలయింది. సౌందర్యకి ఒక్కడే కొడుకు. సురేష్‌కి ఆట మాట పాట కూడా నాంచారు అయిపోయింది. రాత్రిళ్ళు గూడా నాంచారు పక్కనే పడుకుంటాడు.


మొదట్లో నాంచారు సురేష్‌ని నిద్రపుచ్చి గుడిశకి వెళ్ళిపోయేది. ఇప్పుడు అదేం కుదరడం లేదు. తెల్లార్లూ వాడి పక్కలో వుంటే గానీ నిద్రపోవడం లేదు.

రెండు నెలలు కాకుండానే ఆ ఇంట్లో ఇంతటి స్థానం సంపాదించగలిగినందుకు నాంచారుకి మహా ఆనందంగా వున్నా లోలోపల చాలా బాధగా వుంది. తను రోజంతా ఇక్కడ వుండిపోతే మొగుడు అక్కడ బరితెగించిపోతాడు. తనకి తనుగా ఈ విషయం ఎలా చెప్పాలో అర్థంగాక తికమక పడుతున్నాది.

రాత్రి పదిన్నర అయింది. సౌందర్య పైన వున్న రూఫ్‌గార్డెన్‌లో పార్టీలో వుంది. జపాన్ నుంచి ఎవరో వచ్చారు. సాయంత్రం నాలు గంటలకే దుకాణం ఆరంభించారు. కనీసం మూడు అయితేగానీ జనం లేవరు. ఇంట్లో పనులన్నీ చేసి సురేష్ పక్కన కూర్చుని నిద్ర పుచ్చుతున్న నాంచారుకి చికాగ్గా వుంది. తను ఎంత పనిమనిషయినా అర్ధరాత్రి అయిపోయినా మొగుడ్ని చూసుకోలేకపోతే ఎందుకీ బతుకు?

"ఏం నాంచారూ, ఇంకా యింటికి వెళ్ళలేదా?" రావ్‌గారి గొంతుకి వులిక్కిపడి లేచి కూర్చుంది.

"వెంకడు నీ కోసం కబురు చేశాడు. వెధవకి నిద్ర పట్టడంలేదు కాబోలు...." ఫ్రిజ్ ఓపెన్ చేసి రావు స్కాచ్ ఓపెన్ చేస్తున్నాడు.



నాంచారుకి వీపు మాత్రం కనిపిస్తూంది. ఆ మాటకి ఆమె రియాక్షన్ ఎలా వుంటుందో అతనికి తెలుసు.

"అక్కడ వెంకడు, ఇక్కడ సురేష్‌తో నలిగిపోతున్నావ్ అవునా?" రావ్ ఆగి సంభాషణ పొడిగిస్తున్నాడు. గది అంతా చల్లగా వుంది. మేడమీదనుంచి రాక్ మ్యూజిక్ వినిపిస్తూంది. అక్కడి బీట్ యిక్కడి గుండెల చప్పుడు క్లాష్ అవుతున్నాయి. నాంచారుకి చలిగా వుంది. రావ్‌కి వెచ్చగా వుంది. ఫ్రిజ్ వయిన బాటిల్ పెట్టి గ్లాసులోకి పోస్తున్నాడు. ఆ పొయ్యడం రిథమిక్‌గా వుంది. మ్యూజికల్‌గా వుంది. సీసాలోంచి గ్లాసులో పొయ్యడంలో అతనికున్న అనుభవం కనిపిస్తున్నది. ఆడదాన్నీ బాటిల్‌నీ హేండిల్ చెయ్యడం గొప్ప ఆర్ట్ అని చెప్పినవాడు ఖచ్చితంగా గొప్ప ఆర్టిస్టు అయివుండాలి.

"నాంచారూ! కాస్త ఐస్ ఇవ్వు." నాంచారు ఫ్రిజ్ దగ్గరకు వచ్చింది. గుళ్ళో దేవుడులా ఫ్రిజ్‌కి అడ్డంగా నిలబడి వున్నాడు రావ్. అతన్ని తప్పుకోమనకూడదు. తను తప్పుకొని ఫ్రిజ్‌లోంచి గడ్డల్ని తియ్యలేదు. నాంచారు వంగి ఫ్రిజ్‌లోకి చెయ్యి పెట్టింది. ఆమె గుండెలకి జాకెట్టు కింద అతని తొడలు తగుల్తున్నాయి. ఆమె ముఖం మీదకి ఫ్రిజ్ చల్లదనం జిల్‌మనిపించేలా తగులుతున్నాది. గుండెలకి కరకుగా వేడిగా చల్ల చల్లగా అతని శరీరం తగులుతున్నాది.

....గుండెలు చేతులు ఒణుకుతున్నాయి. ముఖం తడి అవుతున్నాది. ఎందుకు? చలికా? ఉక్కకా? నాంచారుకే తెలీదు.

లోపల ఐస్‌ట్రేలో ఐస్ చాలా గట్టిగా వుంది. ఓ పట్టాన రావడంలేదు.

"చాలా గట్టిగా వుందండీ...."

రావ్ చాలా గొప్పగా నవ్వాడు. "అవును గట్టిగా వున్నాయి. అందుకే నిన్ను అడిగింది" రావ్ గొంతులో ఎన్నో అర్థాలు వున్నాయి. అందులో నాంచారుకి కొన్ని తెలుస్తున్నాయి. కొన్ని తెలీడం లేదు.

నాంచారు అలాగే అవస్థ పడుతున్నది. ఆ అవస్థలో తను ఇబ్బంది పడుతూ అతనికి ఆనందం ఇస్తున్నాది.

అప్పటికి సౌందర్య వచ్చి ఎంతసేపయిందో తెలీదు. ఆమె గాజుల చప్పుడు విని నాంచారు తలతిప్పి చూసింది. తల తిప్పడంలో అతనికి మరీ సన్నిహితంగా తగిలింది.

అయినా రావ్ వున్నచోటునుంచి కదల్లేదు.

"అమ్మగారూ, ఈ గడ్డ పగలడంలేదు...."

నాంచారు ఎలాగో అంది.

రావ్ అన్నాడు, "సౌందర్యా! వెళ్ళి గెస్ట్స్ సంగతి చూడు. ఇద్దరం యిక్కడే వుంటే బాగుండదు."

"నాంచారుని యింటికి పంపిద్దామని వచ్చా."

"నాకు తెలుసు. కానీ అది ఇవాళ వెళ్ళడం లేదు."

"లేదు బాబూ! నే వెళ్ళాలి...." నాంచారు సమాధానం కోసం గూడా ఎదురుచూడకుండా గదిలోంచి గబగబా బయటకి వచ్చేసింది!

నాంచారు చాలా అప్‌సెట్ అయి గుడిశలోకి వెళ్ళింది. గుడిశలో నులక మంచంమీద పడుకున్న నాంచారుకి సౌందర్య గుర్తు వచ్చింది. ఆమె ఎంత అందమైనది! ఎంత మంచిది?

ఇవాళ మరీ బాగుంది! ఎర్రరంగు చీర, ఎర్రటి స్లీవ్‌లెస్ జాకెట్, ఎరుపెక్కిన పెదవులు, తలలో ఎర్రగులాబీలతో విరిసిన విప్లవంలా, పూసిన వసంతంలా వుంది. సౌందర్యకి ఎప్పుడన్నా కోపం వస్తే ఎలా వుంటుందో తెలియదు. అంత ఆస్థి వున్నా ఎంత నెమ్మదిగా వుంటుంది? ఆమె కళ్ళల్లో వెన్నెల తడారబోసుకున్నట్లు వుంటాయి. చిరునవ్వుల జలపాతాలు ఆ పెదవులమీద అనునిత్యం చిందేస్తూ వుంటాయి.

ఎన్నో లక్షల టన్నుల పాలు తీసి గడ్డచేసి ఆ రూపాన్ని మలిచినట్లు కనిపిస్తుంది సౌందర్య. అసలు ఆమె తలపులోనే కోటి సుగంధాల ఫీలింగ్. సౌందర్యని పొందిన అయ్యగారు ఎంత అదృష్టవంతుడోమరి!

—మరి యిందాక అలా ఎందుకు చేసినట్టు? అంత గొప్ప ఆడదాన్ని పొందిన మగాడికి మరో ఆడదాని కోసం కోరిక ఎలా పుడుతుందో? ఆ స్థానంలో తనే గాదు ఎవరూ తమని తాము వూహించుకోలేరు. ఎందుకంటే సౌందర్య అంతటి మహా యిల్లాలు. మహా మనసున్న ఆడమనిషి. అసలు ఇంతకీ అయ్యగారికి బయట తిరుగుళ్ళు ఉన్నాయా? ఏమో, తనకి తెలీదు. అమ్మగారు ఎప్పుడూ అలాంటి విషయాలు చెప్పలేదు. తన భ్రమగానీ అలాంటివి పరాయివాళ్ళకి ఎవరన్నా చెప్తారా? అసలీ మొగాళ్ళని నమ్మగూడదు. ఇంట్లో రంభ వున్నా వీధిలో బొందలకోసం ఎగబడ్తారు. నాంచారుకి నిద్ర పట్టటం లేదు. ఆలోచన్లు ఆమెని వదిలిపెట్టటం లేదు.

* * *

"ఏమిటే అలా వున్నావ్?"

"ఏం వుందమ్మా, బాగానే వున్నానే!"

"ఏం వుందో నాకేం తెలుసు?" సౌందర్య అందంగా నవ్వింది. ఆ నవ్వుని నాంచారు తన్మయంగా చూస్తున్నది. 'ఒక మాట చెప్పాలని వుంది, మీరు ఏమీ అనుకోనంటే....' నాంచారు కోడి ఈకలు పీకుతూ అంది.

"చెప్పు."

"రేపట్నుంచి సాయింత్రమే యింటికి వెళ్ళిపోతానండీ."

"అంటే యివ్వాళ్టికి యిక్కడే వుండిపోతావా?"

"ఛ! అదిగాదండీ!" బాధగా నాంచారు చూసింది. సౌందర్య జోక్‌ని అందుకొనే స్థితిలో ఆమె లేదు. "అవేళ కూడా....అవేళండీ అసలు అయ్యగారు వస్తారని తెలీదు. ఆయన పిలిస్తేనే ఐస్ యివ్వడానికి వెళ్లా. నా తల్లి సాక్షిగా చెప్తున్నా. నా మనసులో ఏ పాపం లేదు" నాంచారు హఠాత్తుగా సౌందర్య కాళ్ళమీద పడిపోయింది. సౌందర్యకి కళ్ళనీళ్ళు వచ్చాయి. కానీ నిగ్రహించుకుంది. ఆమె పెరిగిన వాతావరణం ఎమోషన్స్‌ని ఆపే శక్తి యిచ్చింది. ఒక ఫీలింగ్‌ని యింకోలా ప్రదర్శించగలిగే శక్తి యిచ్చింది.

అందుకే సౌందర్య ఎదుటివాళ్ళు మంత్రముగ్ధులు అయేలా నవ్వింది. 'నీబుర్ర యివాళ ఏం బాగోలేదు. లేకపోతే యిలా వాగవు. అన్నట్టు నిన్న డబ్బులు అడిగావు గదూ! సాయింత్రం డబ్బులిస్తా. పెందరాళే సినిమాకి వెళ్ళు' అనేసి సౌందర్య వెళ్ళిపోయింది.

కాసేపు అయాక ఆమె బెడ్‌రూంలోనుంచి రేడియో వాల్యూమ్ చాలా పెద్దగా వినిపించింది. రేడియో అంత పెద్దగా ఎందుకు వినిపిస్తుందో నాంచారుకు అర్థం గాలేదు.

సాయింత్రం అయిదయింది. సౌందర్య ఎక్కడికి వెళ్ళిందో నాంచారుకి తెలీదు. డబ్బులిస్తే తీసుకుందామని బెడ్‌రూం దగ్గరికి వెళ్ళింది. సౌందర్య లేదు. రావ్ వున్నాడు. ఈ టైంలో ఆయన ఎందుకు వున్నాడో తెలీదు.

"రా నాంచారూ! డబ్బులు కావాలని అడిగావట. ఎంత కావాలి?" రావ్ అడగడంలో ఒక విధమయిన మొగదనం, తనని కొనేసిన ఫీలింగ్.

ఖరీదయిన పట్టులుంగీ కట్టుకుని రావ్ పచార్లు నిస్తున్నాడు. గవంతా సెంట్ వాసన. అది ముక్కుపుటాల్ని తల్లకిందులు చేస్తున్నది.

"డబ్బుల కోసం కాదండీ, అమ్మగారు కావాలి."

"దేనికి? కట్టుకున్న మొగుడులా దాని కోసం కలవరించిపోతా వేమిటి?"

నాంచారు ఏం మాట్లాడలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"ఏం లేదండీ, వంటింటిలో గుడ్లు కనబడలేదు. అందుకని...."

"సరేలే!" కాస్సేపు ఆగాడు. మనిషి కళ్ళలో కోరిక అడవి సింహంలా చిందులేస్తున్నాది. అటూ ఇటూ నిశ్శబ్దంగా పోరాటం జరుగుతున్నది.

ఇంతలో బయట గేటు దగ్గర్నుంచి పనివాడు సుందరయ్య కేక వినబడింది. నాంచారు గబగబా అటు వెళ్ళింది. రావ్ అడ్డుకోలేదు. ఆగమనలేదు.

* * *

"నిన్న చెప్పకుండా వెళ్ళిపోయావుటగదా?" సౌందర్య అసహనంగా అడిగింది.

"సుందరయ్యతో చెప్పి వెళ్ళానండీ. పని గూడా అంతాచేసి వెళ్ళిపోయా."

"అంత కొంప మునిగిందా, చెప్పకుండా వెళ్ళావ్?"

"మీరు ఇంట్లో లేరండీ."

"అయ్యగారు ఉన్నారుగా?—" సౌందర్య అదోలా అంది. ఆ మాట నాంచారుకి అసహ్యంగా అపస్వరంలా వినిపించింది. నాంచారు విచిత్రంగా ఆమెని చూసింది. సౌందర్య ముఖం అంతా ఉబ్బి వుంది. మెడపక్కన ఏదో రాసుకొన్నట్లు ఒరుసుకొన్నట్లు ఎర్రగా కమిలిపోయివుంది. అమ్మగారు ఎప్పుడూ ఆలా కనబడలేదు. ఇందాక తనకి బట్టలు వుతకడానికి వెళ్తే తనముందే జాకెట్ చీర విప్పి ఇస్తుంటే నడుంమీద వాపుగూడా చూసింది. రాత్రి కారుకి ఏదన్నా ప్రమాదం జరిగి దెబ్బ తగిలిందేమో అనుకొంది. ఇప్పుడు యెందుకో కాదనిపిస్తున్నాది.

"చెప్పకుండా వెళ్ళకు నాంచారూ. చెప్పిన పని చెయ్యనివాళ్ళంటే నాకు చాలా అసహ్యం" అతికష్టంమీద ఎలాగో అనగలిగింది. షాక్ తిన్న నాంచారు తలఎత్తి చూసేసరికి అక్కడ లేదు.

దీపాలుపెట్టారు. ఊరు చల్లబడ్తున్నాది. ప్రకృతి సృష్టిమీద చీకటిదుప్పటి కప్పుతున్నది. ఆ దుప్పటికి చిల్లులు పెడుతున్నట్లు మనుషులు దీపాలు వెలిగిస్తున్నారు. స్వర్గంలాంటి అంత ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి. కానీ అది శూన్యం అయిన ఇంద్రసభలా దిగులుగా ఉంది. ఆ శూన్యతలో భయం గందరగోళం అసహ్యం గడ్డకట్టి నాట్యం చేస్తున్నాయి. జీవిత సంగీతం, మానవ సాహిత్యం అపధంశం అయినట్లు ఏదో ఫీలింగ్.

నాంచారు బాబుని స్నానం చేయించి డ్రస్ చేసి తను వెళ్ళి మొహం కడుక్కొంది. ఇంక తను వెళ్ళిపోవాలి అనుకుంటూ వుండగా మేడ మీద నుంచి సౌందర్య పిలిచింది. బయట షెడ్‌లో కారు గేటుదగ్గరికి వస్తున్న శబ్దం.

"నాంచారూ! ఐస్ బాక్స్‌లో ఐస్‌వుంది. తీసుకెళ్ళి గార్డెన్ బంగళాలో ఇచ్చేసిరా. కారులో వెళ్ళి అందులో వచ్చెయ్. అయ్యగారికోసం

ఎవరో వస్తున్నారు. అక్కడ మస్తాన్ అన్నీ ఏర్పాటుచేశాడు. బంగళాలో ఫ్రిజ్ చెడిపోయిందట. ఐస్ పంపమని అయ్యగారు ఫోన్ చేశాడు" సౌందర్య పౌడర్ రాసుకుంటూ ఎటో చూసి చెప్తున్నాది.

"డ్రైవర్ ఇస్తాడుగదండీ. ఇంకా నేనెందుకు?...." భయంభయంగా ఎలాగో నాంచారు అనగలిగింది.

"నాంచారూ!" సౌందర్య అరచిన అరుపుకి అర్థరాత్రి అడవిలో సింహం చేసే గర్జనకి ఉలిక్కిపడ్డ ప్రకృతిలా నాంచారు అదిరిపడింది.

"చెప్పిన పని చెయ్. ఈ ఇంట్లో అయ్యగారు ఏం చెప్తే అది జరగాలి. అంతే. ఎందుకు? అనే ప్రశ్నలు ఈ కాంపౌండ్‌లో లేవు" అని సౌందర్య హఠాత్తుగా అంతలోనే తనని తమాయించుకొని "వెళ్ళు నాంచారూ, విసిగించకు. అసలే నాకు ఏం బాగోలేదు. నేనేం మాట్లాడలేను—" సౌందర్య ఎలాగో అంది. బయట వరండాముందు వెంకడు వేస్తున్న కేకలు గందరగోళంగా వినిపిస్తున్నాయి. వెంకడు ఎప్పుటూ ఇటుకేసి రాడు.

నాంచారు గబగబా కిందకి పరిగెత్తింది. సౌందర్య కూడా వచ్చింది. వెంకడు ఫుల్‌గా తాగేసి వున్నాడు. నాంచారుకి భూమి ఆకాశం తెలీడం లేదు. మందు ఎరగని వెంకడు ఇవాళ ఇంతగా ఎందుకు తాగాడు? మనిషి బూతులు తిడ్తున్నాడు. నిలబడలేకపోతున్నాడు.

"ఏళ ఎంతయిందే లంజా? నువ్వు ఎవర్తో కాపరం చేస్తావ్? దాంతోనా నాతోనా?...."

"ఏందా వాగుడు?"

"వాగుడేందే సీయమ్మ! పొద్దస్తమానూ ఈడే వుంటే నేనేం గావాల. ఈ మేడగాలి నీకు బాగా తగిలిందే" ఫళ్ని నాంచారుని కొట్టాడు. నాంచారు తూలి స్థంభానికి కొట్టుకుంది. అందమయిన కొప్పు కుప్పలా ఊడి జారిపోయింది. వేరే మూడ్‌లోవున్న సౌందర్య యింకా ఈ లోకంలోకి రాలేదు. ఆమె తేరుకునేసరికి వెంకడు నాంచారుని కాల్తో తన్నుతూ నడుం మీద గుద్దుతూ రొప్పుతూ బూతులు గుప్పిస్తూ గేటు తోసుకుని లాక్కుపోయాడు. నాంచారు ఒంటిమీద ప్రతి దెబ్బా తనమీదనే పడ్తున్న ఫీలింగ్. ఏమిటీ ఆడజీవితం? ఇన్ని వున్నా తనకి ఒకరకం బాధ. ఏమీలేని నాంచారుకి మరోరకం బాధ. ఖోరికో స్థంభం పట్టుకొని సౌందర్య అలాగే వుండిపోయింది.

దానిపేలు పేట గుడిశల్నించి నాంచారు కేకలు అరుపులు వికృతంగా వినిపిస్తున్నాయి. మిగిలిన గుడిశల్లోవాళ్ళు కొత్తగా విడుదల అయిన సినిమా చూసినట్టు విరగబడి చూస్తున్నారు. వెంకడు నాంచారుని ఆవేశే తొలిసారిగా కొట్టడం. వాడికి తాగడం కొత్త. పెళ్ళాన్ని కొట్టడం మరీకొత్త. తన్నడానికి కాలెత్తి బురదలో పడ్డాడు. డేనియల్, సూరడు గంగయ్య వాళ్ళ పెళ్ళాల్ని కొట్టడం రోజూ చూశాడు. అవన్నీ ఇప్పుడు సబ్‌కాన్‌షస్‌లో గందరగోళంగా తల్లికిందయిన బొమ్మల్లా తిరుగుతున్నాయి.

నాంచారు ముఖం మంచం కోడుకు తగిలింది. జాకెట్ పూర్తిగా చినిగిపోయింది. ఆ క్షణంలో వాడు రావ్ మాదిరిగా కట్టుకున్న పెళ్ళాం పరాయి ఆడదానిలా కనిపిస్తున్నది. పెళ్ళానికి యెంత ఆచ్ఛాదన తొలగితే అంత గర్వం పెరుగుతున్నాది. ఆమె ఎంత యేడుస్తుంటే వాడికి అంత స్మూత్‌గా తగుల్తున్నాది.

రాత్రి పది దాటింది....పదకొండు అవుతున్నాది. వెంకడు అగి అగి రెచ్చిపోతున్నాడు. పాత ఆడియన్స్ వెళ్ళిపోయి కొత్త ఆడియన్స్ వస్తున్నారు.

గుడిశల్లో బీభత్సం. అరుపులు, కేకలు చీకాకు. అసహ్యకరం అయిన ఏడుపులు. అటు మేడని నిశ్శబ్దం రాజ్యం చేస్తున్నాది. శూన్యం ఏలేస్తున్నాది. అటు నిశ్శబ్దం. ఇటు గందరగోళం. పన్నెండు అవుతున్నది. కాలం మాత్రం సాగిపోతున్నది. బంగళాలో లైట్లు ఎప్పుడు ఆరిపోయాయో తెలీదు. ఇంతలో ఇంపోర్టెడ్ టమోటా కారు గేటు దగ్గర ఆగింది. మేడ అంతా లైట్లు వెలిగాయి. కారు లోపలికి వెళ్ళింది. మహారాజుకి స్వాగతం చెప్పి వందనంచేసి వెనక్కి తప్పుకొనే సైనికుల్లా రావ్ లోపలికి వెళ్తుంటే వెనకనుంచి ఒక్కొక్కలైటు ఆగిపోతున్నాది.

ఒంటిగంటకి ఇంకా ఎంత టైం బాకి వుందో తెలీదు. సగం గుడిశలు నిద్రపోతున్నాయి. బజారు నిశ్శబ్దం అయిపోయింది. క్షతగాత్రోపహతులు దీనులు హీనులు ఇంకా అక్కడక్కడ దొక్కలు ఎగరేస్తున్నారు.

వెంకడికి తాగినమత్తు ఇంకా దిగినట్లు లేదు. కింద పడున్న నాంచారుని మళ్ళీ జుట్టుపట్టి లాగి బూతులు తిడుతున్నాడు. నాంచారు రోకలిబండ తీసుకుని తలమీద దభీమని కొట్టింది. వెంకడు మహావృక్షంలా పడి

పోయాడు. తాగకపోయినా మనసు వశం తప్పిన నాంచారు అలాగే దభీదభీమని కొట్టింది. వాడి తలమీద ఎన్ని తగిలాయో గుండెలమీద ఎన్ని తగిలాయో తెలీదు. గుడిశలో దీపం కూడాలేదు. రోకలి అంతా తడిసిపోయింది.

దూరంగా బంగళాలో ఆఖరి దీపం ఆరి పోయింది.

తెల్లవారింది....గుడిశనిండా జనం....గుడిశ చుట్టూ జనం. ఎటు చూసినా జనం: రాత్రి నాంచారుని కొడుతున్నప్పుడు వున్న జనం అంతా వున్నారు. రాత్రి కళ్ళముందు చిత్రవధ చేస్తున్నా ఏం మాట్లాడని వాళ్ళంతా ఇప్పుడు వెంకటిమీద సానుభూతిగా మాట్లాడుతున్నారు. రాత్రి వాడు తాగి కొట్టడంలో తప్పులేదు. తిరగ బడ్డందుకు నాంచారు దోషిగా తయారయింది.

ఎదురుగా రావుగారి బంగళాముందు అంగుళం స్థలం లేకుండా కార్లు నిండి పోతున్నాయి.

—రాత్రి అమ్మగారు గుండె ఆగి మర ణించారట! నాంచారు గుండె పగిలింది. సౌంద ర్యకి గుండె ఆగిపోవడమా? లేదు! లేదు! ఆగి పోలేదు! ఆపేశారు. దాన్ని చీల్చి కాల్చి కోసి తీసేశారు. లేదు కాదు కాకూడదు. ఇదంతా అబద్ధం. అసంభవం. కానీ తను ఎవర్తో చెప్పుకో గలదు. తన మాట ఎవరికి కావాలి?—

ఎందరు ఆపుతున్నా విదిలించుకుని చీకటిని చీల్చే ఎర్రటి వెలుతురులా నాంచారు బంగళా కేసి పరిగెత్తింది.

సౌందర్య పోర్టికోలో ఉంది. దుప్పటి కప్పారు. పూలు చల్లారు. అగరొత్తులు వెలి గించారు. మంత్రాలు చదువుతున్నారు. సాను భూతులు వర్షిస్తున్నారు.

కానీ ఇవేవీ సౌందర్యకి తెలీదు. అక్క ర్లేదు. నాంచారు చెప్పాలనుకునేది కూడా ఎవరికీ అక్కర్లేరు.

చనిపోయి ఆమె బ్రతికివుండి తనూ ఏమీ మాట్లాడలేదు.

—రావ్ దూరంగా కుర్చీలో ఎటో చూస్తూ కూర్చున్నాడు. భార్యను పోగొట్టుకున్న విషాద మూర్తిలాకాదు. మరో పెళ్ళికి మరో అపూర్వ స్త్రీ అనుభవానికి ఎదురుచూస్తున్న వాడిలా వున్నాడు.

నాంచారు చూసిన చూపులో మంటలు ఒంటి మీద పడ్తున్నట్లు రావ్ ఒణికిపోయాడు. ఇంతలో ఎవరో వస్తే వాళ్ళను రిసీవ్ చేసుకో డానికి గేటుదగ్గరికి వెళ్ళాడు.

హఠాత్తుగా పోలీసువ్యాను గేటుముందు ఆగింది. ఇనస్పెక్టర్ సుబ్బారావు, కానిస్టేబుల్స్ దిగారు. రావ్ షాక్ తిన్నాడు.

"ఏమిటి ఇలా వచ్చారు?"

"ఆ గుడిశల్లో ఒక బిచ్ మొగుడ్ని చంపే సింది. దాన్ని అరెస్టు చెయ్యడంకోసం వచ్చాం. అది మీ ఇంట్లోనే పని చేస్తుందట."

"అవును! అదుగోండి...." నాంచారుని చూపించాడు. నాంచారు రావ్‌ని నీచంగా అస హ్యంగా చూసిన చూపు అతన్ని కంగారు పెట్టింది. నాంచారుని పోలీసులు తీసుకొచ్చారు.

"రావుగారూ! రాత్రి మీభార్య పోయిందట. ఐ డోంట్ నో హౌ టు కన్వే మై సారో. రియల్లీ షీ ఈజ్ ఏ గ్రేట్ వుమన్. కానీ ఏం చేస్తాం. అన్నీ మన చేతిలో వుండవు. బాధ పడకండి" సుబ్బారావు కర్చీఫ్‌తో కళ్ళు తుడుచు కున్నాడు.

నాంచారు పొడికళ్ళతో వ్యానెక్కింది. □

సీరియల్



మర్నాడు—

ఆ రోజు మీరా రాదనే అనుకున్నారు ఇంట్లో.

శాంతమ్మగారు కాఫీ డికాషన్ తీసి, పాలు కాచి—పువ్వులు కోసుకోవడానికి దొడ్లోకి

వెళ్ళింది. కాఫీలవగానే స్నానంచేసి వంట మొదలెడదామని.

శేఖరం లేచేడు. అరుణ యింకా లేవలేదు. శేఖరం తల్లిని పిలిచాడు. దొడ్లో పూలు కోస్తున్నారని దొడ్లోంచే అప్పి సమాధానం చెప్పింది.

శేఖరం తనే కాఫీ కలుపుకుందామని వంట గదికేసి వచ్చినవాడు గుమ్మం దగ్గర అలాగే ఆగిపోయాడు.

మీరా కాఫీ కలుపుతోంది—

శేఖరానికి మీరా మీద రవంత కోపం కలిగింది కూడా.

"అమ్మ చెప్పిందిగా! ఈ రోజుకి రాకపోతే ఏం?" అన్నాడు.

మీరా మాట్లాడలేదు.

మీరా కాఫీ తీసుకొచ్చి శేఖరానికి దగ్గరగా పెట్టింది.

"ఎలా వుంది కాలు?" అని అడిగాడు శేఖరం.

"కాలితే ఎలా వుంటుంది!" కస్సుమన్నట్టుగా అంది- అతను ఏదో వక వంక పెట్టుకుని పలకరించటం మీరా మనసుని మండిస్తోంది.

సరిగ్గా ఇలాంటి జవాబు కోసమే ఎదురుచూస్తున్నవాడిలా వెంటనే అన్నాడు "మంటగా వుంటుంది. కాని, మందు వేసుకోవాలిగా! నేను మందు వేసుకోను; దానికసలు మందే లేదంటే తగ్గదుగా!"

అతనికి జవాబు చెప్పటమే తనది బుద్ధితక్కువ అనుకున్న మీరా మళ్ళీ జవాబీయలేదు.

శేఖరం వచ్చి కిటికీ దగ్గర నిలబడి కాఫీ తీసుకుంటున్నాడు.

శాంతమ్మగారు లోపలకొచ్చి "నేను వస్తున్నా గదరా! ఇంకా మొహం కడుక్కుంటున్నావుగదా పూలు కోద్దామని వెళ్ళాను" అంది.

శేఖరం మాట్లాడలేదు.

శాంతమ్మగారు పూలు దేవుడి గదిలో పెడదామని వెళ్తూ మీరాని చూసింది.

"ఏమిటి నువ్వొచ్చావా? ఎలా వుంది కాలు? పోనీ ఈ పూటకి మానేయలేకపోయావా!" అంది.

"తగ్గిపోయిందమ్మా!" అంది మీరా మెల్లిగా.

ఆవిడ ఓ అడుగు ముందుకు వేసిందల్లా ఆగి వెనక్కి తిరిగి, "ఏదీ? కాలు చూడనీ" అంది.

"తగ్గిందమ్మా!" అంది కానీ చూపించలేదు. అప్పటికి శేఖరం గుమ్మం దగ్గరకొచ్చేడు.

"ఏదీ, నన్ను చూడనీ!" అందావిడ.

మీరా తప్పనిసరిగా కొద్దిగా కుచ్చెళ్ళు పైకి ఎత్తింది.

ఎడమ పాదం తెల్లగా నాజూగ్గా వుంటే—కుడిపాదం నల్లగా బొబ్బలెక్కి—చూడడానికి అసహ్యంగా భయంకరంగా కనిపించింది.


శేఖరం చూపులు మీరా పాదం మీంచి ముఖం మీదికి జరజరా పాకినాయి. నిశితంగా మీరానే చూడసాగాడు.

"అయ్యో! ఇలా వుంటే ఎందుకొచ్చేవూ?" అంది శాంతమ్మగారు.

"నెప్పి లేదండీ! వుంటే వస్తానా, రాగల్నా!" అంది మీరా చిన్నగా నవ్వుతూ.

"మంచిదానివేలే! నేనే చెప్పానుకదా రావద్దని" అని వెళ్ళిపోయిందావిడ.

అరుణ లేచేకా కూడా కాలు ఏలా వుందో అడిగి చూసి, "ఇలా వుంటే ఎందుకొచ్చావ"ని కోపంగా అడిగింది.



"నిన్ను చూద్దామని" నవ్వేసింది మీరా.

"గొప్ప పని చేసేవు."

"హమ్మయ్య! గుర్తించేవు కదా!"

వింతగా చూసింది మీరాని.

"నన్ను తర్వాత చూద్దువుగానీలే. వెళ్ళు. వెళ్ళి ముఖం కడుక్కురా" అరుణని అక్కడ్నించి పంపేసింది మీరా.

మీరా లేనప్పుడు అరుణని అడిగాడు శేఖరం "నీ ఫ్రెండుకు యెలా వుందిట! తగ్గిందిటా!"

"ఎవరికోసం తగ్గుతుంది. నీ కేకలకే హడలి పారిపోయివుంటుంది."

"ఏమిట"న్నట్లు చూశాడు. అరుణ మాటలు అర్థంకాలేదు.

క్షణంసేపు అన్నగారి కళ్ళల్లోకి పరీక్షగా చూసి అంది అరుణ "అభిమానం తెల్పడానికి కూడా నేర్పుండాలి. అసలే కాలుమీద పులుసుపడి మంటతో అంతబాధ పడుతోంటే అలా అరుస్తారేమిటి."

అరుణన్న మాటకి క్షణంలో సగంసేపు తెల్లబోయినట్టు చూసి—అరుణ నుండి చూపులు మరల్చుకుంటూ అన్నాడు "లేకపోతే! అంత కసురుకుంటే కాని చేతులు తీసిందా? కాలితే నీళ్ళు పోయగూడదని తెలియదూ! చిన్నపిల్లా!" అరుణకేసి చూస్తూ అన్నాడు మళ్ళీ "అంటే నీకు కోపం వస్తుంది కానీ—నీ ఫ్రెండుకి పెంకితనం."

"నీ కోపం వచ్చినా సరే! నే నా మాట చచ్చినా ఒప్పుకోను" అంది అరుణ.

"నువ్వొప్పుకున్నా—ఒప్పుకోకపోయినా—ఇది మాత్రం నిజం" అన్నాడు నవ్వుతూ.

మీరా గురించి శేఖరం మాట్లాడిన మాటతీరు అప్పటికీ ఇప్పటికీ చాలా తేడా కనిపించింది అరుణకి. 'మీరా తప్పు ఏం లేదని తెలుసుకున్నట్టున్నాడు అన్నయ్య. ఇప్పుడు "నీ ఫ్రెండూ

నీ ఫ్రెండూ" అన్నా ఆ తీరు వేరు అనుకుంది అరుణ 'మీరాకి అన్నయ్యమీద కోపం పోనట్టుంది. మీరా పేరు వింటూనే భగ్గుమనే అన్నయ్య తొందరగానే శాంతించేడు. అప్పుడు తనకోసం అన్నయ్య మాటలు లెక్కచెయనట్టు మసిలే మీరాకి అన్నయ్యమీద కోపం పోనట్టేవుంది.'

"మీరాని అసలు ఇన్నాళ్ళు ఇక్కడ వుండనిచ్చేవు నా కదే చాలా ఆశ్చర్యంగా వుంది" అంది అరుణ నవ్వుతూ.

"నే నెవర్ని వుండనివ్వడానికీ వుండనివ్వకపోవడానికీ."

"నువ్వేవరేమిటీ! ఇది నీ యిల్లు."

"ఇది నా యిల్లని చేరలేదుగా! అమ్మగారిల్లని చేరింది" అన్నాడు శేఖరం. అతనికి మీరా అమ్మగారింటికి ఎవరో ఒకరు వస్తూండవచ్చు. అది నా కనవసరం" ఆ మాట గుర్తుకొచ్చి అతని మనసు బాధతో మూలిగింది.

తొమ్మిది గంటలు కావస్తోంది. శేఖరం బయటకెళ్ళడానికి తయారయాడు. వెళ్ళేముందు అరుణ గదిలోకి వచ్చేడు. అక్కడ మీరా కూడా వుంది. అతను రాగానే మీరా లేచి నిలబడింది.

శేఖరం మందుబిళ్ళలూ ఆయింటుమెంటూ అక్కడ టేబిల్‌మీద పెడుతూ, "ఇదిగో! ఆ టాబ్‌లెట్సు వేసుకుని ఈ ఆయింటుమెంటు రాస్తే తొందరగా తగ్గుతుంది" అన్నాడు.

మీరా మాట్లాడలేదు. కనీసం 'సరే' అన్నట్టు కూడా చూడలేదు. దాంతో అరుణ అంది "వినపడిందా, మీరా!" అని.

"నేను హాస్పిటల్‌కి వెళ్ళాను అరుణా! మందిచ్చేరు" అంది పొడిగా.

శేఖరానికి బాగా కోపం వచ్చింది. హాస్పటల్‌కి వెళ్ళిన మాట అబద్ధం—తనిచ్చినవి వాడడం ఇష్టంలేక—

అన్నగారికి కోపం వచ్చినట్టు అరుణ గ్రహించింది. అతని ముఖమే చెప్తోంది.

"తీసుకో మీరా! ఇంకా తగ్గలేదుగా" అంది.

మీరా మాట్లాడలేదు.

"నే వెళ్తున్నా" అని అతను వెళ్ళబోతోంటే "ఉండు. టీ తీసుకుని వెళ్దువుగాని" అంది అరుణ.

"అక్కరలేదు" అని వెళ్ళిపోయాడు. ఉదయం కాఫీ తీసుకోవటమే మళ్ళీ ఏం తీసుకోలేదు. రోజూ అయితే ఈ పాటికి టీ రెండు మూడుసార్లు తీసుకునేవాడు.

మీరా వంటగదిలోకి వెళ్ళిపోయింది.

తర్వాత అరుణ కొంతసేపటికి మీరా దగ్గరకొచ్చి, "మీరా! అమ్మ మిమ్మల్ని ఇక్కడకి వచ్చేయమందటగా! రాకూడదూ! అంది.

"అదెలా కుదురుతుంది అరుణా!"

"ఏం ఎందుకు కుదరదూ?"

"అమ్మ ఒప్పుకోదు."

"నే చెప్తాను అమ్మగారికి. నే నెక్కువగా మీ అమ్మగార్ని కలవకపోయినా మన స్నేహం ఎలాంటిదో అమ్మగారికి తెలియదా మీరా! నేనొచ్చి చెప్తాను" అంది అరుణ. ఇక్కడుంటే ఏదో విధంగా సహాయం చేస్తుండవచ్చు అనుకుంది అరుణ.

మీరా నవ్వింది. "పిచ్చి అరుణా! మీకో అన్నయ్య అమెరికాలో వున్నారు. వారిద్దరి పిల్లలు ఇక్కడ చదువుకుంటున్నారు. ఆ యిద్దరి పిల్లలకి నేను ఆయానని అరుణాదేవిగారు మర్చిపోతున్నట్టున్నారు."

"నే నెప్పుడో చెప్పేను నువ్వు చాలా మారిపోయావని. ఇంకా గడుస్తనం నేర్చుకున్నావు.

ఎదిటివాళ్ళ నోటికి తాళం యెలా వేయాలో నీకు నువ్వే సాటి."

మీరా నవ్వి వూరుకుంది.

"మర్చేపోయాను. కొత్తగా నేర్చినవాటిల్లో ఇది అతి ముఖ్యమైనది" అరుణకేసి వాత్సల్యంగా, ప్రేమగా చూసింది మీరా.

* * *

ఏదో మునిగిపోయినట్టుగా భార్యా భర్తలు హడావిడి పడుతోంటే అడక్కుండా వుండలేకపోయింది చంద్రమ్మగారు. "ఏమిటే అరుంధతీ! ఏమిటి హడావిడి పడుతున్నారు? ఎక్కడికేనా ప్రయాణమా?" ఏ సినిమాకో అయుంటుందని ఆవిడ వూహించింది.

చంద్రమ్మగారి మాటతో అరుంధతి గతుక్కుమంది. ఆవిడ చురుకైన బుర్ర అరుంధతికి తెలింది కాదు. "బస్తీలో ఇంగ్లీషు సినిమా చూసి వద్దామని" నసుగుతున్నట్టుగా అంది. అబద్ధమాడక తప్పలేదు అరుంధతికి.

"ఇంగ్లీషు సినిమానా!" చంద్రమ్మగారి ముఖం ఇంతయింది. ఆవిడకి ఇంగ్లీషు సినిమా చూడాలని ఎన్నాళ్ళనుంచో కోరిక. ఆవిడ పెద్ద తిరుపతి వెళ్ళినప్పుడు ఎవరో చుట్టూ వుండడం వల్ల మద్రాసులో కూడా పది పదిహేను రోజులుంది. అప్పుడు ఓ హిందీ సినిమా, అరవ సినిమా చూసింది. "ఒక్క ఇంగ్లీషు సినిమా కూడా చూసేస్తే!" అని అప్పటినుంచీ మహా కోరికగా వుందావిడకి. అంతకన్న ఇంకా ఎన్ని భాషల్లో సినిమాలు వస్తాయో ఆవిడకి తెలియదు.

"నేనూ వస్తానే అరుంధతీ! ఎన్నాళ్ళమట్టో ఇంగ్లీషు సినిమా చూడాలని వుంది. ఇంగ్లీషు సినిమాలు బస్తీకి ఎప్పుడొస్తాయో తెలియదు...."

"మీకు అర్థం కాదుకదండీ!" మధ్యలోనే అంది అరుంధతి.

"మాటలు తెలియకపోతేయేం? కథ అర్థమవుతుందిగా! అయినా చూసేవాళ్ళంతా ఇంగ్లీషు అర్థమయే వస్తారా? అరవ సినిమాకీ-హిందీ సినిమాకీ ఆ భాషొచ్చే వెళ్ళానా?...."

శ్రీహరి పిలవటంతో అరుంధతి అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

శ్రీహరికి సినిమా పిచ్చి ఎక్కువ. అతనున్న వూళ్ళో సినిమా కెళ్ళాలంటే మూడు మైళ్ళు నడిచి వెళ్ళాలి. అరుంధతి అంతదూరం నడవలేక వెళ్ళదు. అతనికి ఒక్కడికీ వెళ్ళటం యిష్టం లేక వెళ్ళడు. అప్పుడప్పుడు ఏ స్నేహితులతోనో వెళుతూంటాడు. ఒక్కొక్కసారి అరుంధతినే బ్రతిమాలి తీసుకెళ్తుంటాడు. ఇంక యిటువేపు వస్తే అతనికి సినిమా ధ్యానే.

వేవిళ్ళతో అరుంధతికి ఒంట్లో బాగుండక శ్రీహరి చిన్ననాటి స్నేహితులతోటీ బావితోటీ వెళ్ళి చూశాడు. నాలుగు రోజుల క్రితం ఇంట్లో అందర్నీ తీసుకుని వూళ్ళో వున్న టాకీసుకే వెళ్ళి వచ్చేరు.

బస్తీలో చిన్ననాటి స్నేహితుడున్నాడు. అతను బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. అతను అరుంధతిని కూడా తీసుకురమ్మని తన ఇంట్లో రెండు రోజులుండమని చెప్తూ వచ్చేడు.

ఈ రోజు తొందరగా వెళ్ళి మ్యాట్నీ చూసి రాత్రికి వాళ్ళింట్లో వున్నట్టవుతుంది. మళ్ళీ రెండో ఆట చూసి పొద్దున్న కాఫీలవగానే వచ్చేయచ్చని ప్లాను వేసుకున్నారు. రమణమ్మగారితో చెప్తే "సరే-వెళ్ళిరండి" అంది.

ఇలా అంటున్నారు మీ అత్తయ్య అని చెప్పింది శ్రీహరికి.

"దద్చాం పో" అన్నాడు శ్రీహరి.

"ఏం చేద్దాం?" అంది అరుంధతి.

"మానేయటమే!" అన్నాడు.

"ఏమిటింకా ఆలస్యం?" అంటూ వచ్చేడు బావి. బావి రానంటున్నా శ్రీహరే బలవంత

చేశాడు సరదాగా వెళ్దాం రమ్మని.

"లేదులే! ఈరోజు వెళ్ళ్లేదు."

"అదేం?" ఆశ్చర్యంగా అడిగాడు బాచి. మొగుడూ పెళ్ళాలు దెబ్బలాడుకున్నారా అనుకున్నాడు క్షణంసేపు. మళ్ళీ అదేం కనబడలేదు.

శ్రీహరి మాట్లాడలేదుగాని అరుంధతి చెప్పేసింది. "మళ్ళీ నాలుగు రోజుల్లో వెళ్ళిపోతున్నాం—అక్కడ సినిమాకి వెళ్ళడం కష్టం!...."

రెండు మూడు క్షణాలు ఆలోచించిన బాచి "మీరు వెళ్ళండి అత్తయ్య సంగతి నేను చూసుకుంటాను" అన్నాడు.

"నువ్వా?" ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"మళ్ళా పెద్ద ప్రళయం బయలుదేరటానికా? ఏం వద్దు. ఇంకా విషయం మర్చిపోంది" అని శ్రీహరి చెప్పుల కోసం చూశాడు.

బాచి శ్రీహరి దగ్గరకొచ్చి అన్నాడు "నేను అత్తనేమీ అనను. ఆ రోజునించీ అత్తయ్యతో మాట్లాడటమే తగ్గించేశాను....మీరు వెళ్ళండి. మీ వెనకాలే ఓ పావుగంటలో నేను వస్తాను. బస్సు దాటిపోతే రెండో బస్సులో వస్తాను."

"ఒరేఽ నువ్వు ఆవిడతో సవ్యంగా మాట్లాడతావంటే ఎవరూ నమ్మరు. ఇప్పుడీ సినిమా కోసం గొడవెందుకు? నేను వెళ్ళి రాత్రికి వచ్చేస్తాను" అన్నాడు శ్రీహరి.

"నేను గొడవేం చేయనంటే? నువ్వే తెల్లబోతావ్—ఇప్పుడు మాత్రం ఏమిటని అడక్కు" అన్నాడు. ఆ మాటలో శ్రీహరికి నమ్మకం కనిపించినా మళ్ళీ వెనకేశాడు.

"అంత యిదిగా చెప్తున్నాడు—పోనీ వెళ్దాం" అంది అరుంధతి ఆశగా.

బాచి మళ్ళీ నమ్మకంగా చెప్పగా "సరే" అన్నాడు శ్రీహరి.

బాచి చెప్పినట్టు శ్రీహరీ అరుంధతీ వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిన అయిదు నిముషాలకి చంద్రమ్మగారు అరుంధతిని పిల్చింది.

బాచి అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటూ శాంతంగా జవాబిచ్చేడు, "లేరమ్మా! సినిమా కెళ్ళారు."

ఆవిడ గబగబా ఇవతల కొచ్చింది. "ఏమిట్రా! సినిమా కెళ్ళారా?" అంది ఆశ్చర్యంగా. ఆ రోజు పెద్ద గొడవ జరిగిందగ్గరనుండీ యిద్దరి మధ్యా యుద్ధాలు జరగట్లేదు. "వెధవకి బాగా బుద్ధి వచ్చింది" అనుకుందావిడ. అయినా పనుంటేకాని ఒకరితో ఒకరు మాట్లాడుకోవటంలేదు. "అవునమ్మా!" అన్నాడు బాచి ఇటు తిరక్కుండానే.

"నేనూ వస్తానన్నాను....? చడీ చేప్పుడూ కాకుండా వెళ్ళిపోయారన్న మాట!" ఆవిడకి చాలా కోపం వచ్చింది.


"వాళ్ళు వెళ్ళనన్నా రత్తయ్యా! నేనే వెళ్ళమన్నాను....నీకు చెబితే ఏమనుకుంటావోనని వాళ్ళు మానేద్దామనుకున్నారు" శాంతంగానే చెప్పేను.

"అనుకోవడ మేమిటి—మానేయడ మేమిటి? పోనీ ఎన్నాళ్ళనుంచో ఇంగ్లీషు సినిమా చూడాలని. నన్నెవరు తీసుకెళ్తారు? పోనీ వెత్తున్నారుగదా అంటే...." ఆవిడకి ప్రియాతి ప్రియమైంది-చేతికి అందినట్టే అంది జారిపోయినట్టుగా వుంది.

"అది సరేనమ్మా! అక్కడంతా ఇంగ్లీషు వాళ్లే వుంటారు."

"తెలుగువాళ్ళు వుండరా? చూడరా? మరి వీళ్ళెలా వెళ్ళారూ?"

"అది కాదు. టిక్కట్లు యిచ్చేవాడూ, కోసేవాడూ—అందరూ ఇంగ్లీషువాళ్ళే వుంటారు. వాళ్ళ సినిమా కదా! అంతా వాళ్లే చూసుకుంటారు."



"అయితే ఏం?"

"నీకెలా చెప్పాలో తోచకుండా వుంది" నసిగేడు బాచి.

"తోచకపోవటం కాదులే! వాళ్ళని నువ్వే పంపేశావు నేను వెత్తానని" కోపంగా అంది.

"అంత నిష్ఠూరం ఆడకు. ఏమీ అనుకోనంటే—ఎందుకు రాకూడదో చెప్తాను" చాలా బాధపడుతున్నట్టుగా అన్నాడు.

"ఏమిటీ?" ఏమిటో తెలుసుకోవాలని ఆతృతగా అడిగింది.

"మళ్ళీ ఏమీ అనుకోవు గదా? బాధ పడ్తావేమోనని...." నసిగాడు.

"అబ్బా, ఏమిటో చెప్పు! ఏమీ అనుకోనులే!" తనకి బాచి భయపడుతున్నందుకు లోపల సంతోషంగానే వుంది చంద్రమ్మగారికి.

"నీలాంటివాళ్ళు రాకూడదు."

"అంటే!?"

"అదే!....నువ్వు ఇంగ్లీషు సినిమాలకి రావాలంటే—జుట్టు పెంచుకోవాలి" రుమాలుతో గట్టిగా మొహం తుడుచుకున్నాడు బాచి.

ఆవిడ నిలువు గుడ్లేసుకున్నట్టుగా అలాగే చూస్తూండి పోయింది.

ఏదో రాళ్ళవర్షం కురుస్తుందని—అన్నిటికీ సిద్ధంగా వున్న బాచి తెల్లబోయాడు. ఆ తర్వాత నెమ్మదిగా అన్నాడు "నువ్వు బాధపడతావనే నేను చెప్పనన్నాను-వాళ్ళు వెళ్ళనన్నారు కూడా. చెప్పేడుగా వాళ్ళవూళ్ళో సినిమా కెళ్ళాలంటే ఎంత కష్టమో! అందుకని...."

చంద్రమ్మగారు మాట్లాడలేదు.

"అమ్మా! వెడుతున్నా" ఇక్కడనించే కేక పెట్టి బాచి వెళ్ళిపోయాడు.

ర ర ర

శేఖరం చెప్పిందంతా విని తెల్లబోయింది శాంతమ్మగారు.

"పాపా చెప్పలేదూ?" అంది.

"ఎవరికీ తెలియదమ్మా! అన్నయ్య రేపు వస్తున్నాడు. అన్నయ్యనేమీ అనకు. ఇప్పటికే అన్నయ్య చాలా బాధపడుతున్నాడు!" అన్నాడు శేఖరం.

"నేనెందుకంటానురా బాబూ! మీరు సుఖంగా వుండటమే నాకు కావలసింది. ఈ నష్టం ఎప్పటికి తీరను?" బాధగా అందావిడ.

"అన్నీ అవే సర్దుకుంటాయమ్మా! నువ్వేం బెంగ పడకు!" ధైర్యం చెప్పేడు శేఖరం.

ఇన్నాళ్ళకి పెద్దబాబు వస్తున్నాడని శాంతమ్మగారు సంతోషంతో చాలా హడావిడి చేస్తోంది. ఆరోజు మీరాతో "రేపు ఇంకా తొందరగా రావాలి మీరా" అంది.

"అలాగే నమ్మా!" అంది మీరా.

మర్నాడు—

ఆరింటికే బయలుదేరిన మీరాని చూసి శాంతమ్మ "ఏమిటే అప్పుడే బయలుదేరావు?" అని అడిగింది.

ఇలాంటి ప్రశ్న వస్తుందని మీరాకి తెలుసు. "అరుణ నా స్నేహితురాలు గుర్తుందా? ఒకసారి మనింటి కొచ్చింది. సుమిత్రకి చీర కొనడానికి వెళ్ళినప్పుడు కొట్టు దగ్గర కనపడింది."

"ఆఁ" అంది గుర్తు చేసుకుంటూ.

"అరుణ వీళ్ళమ్మాయేట! ఈ రోజు వస్తోంది—చాలా రోజులయింది చూసి. కారులో అయితే రాత్రే వచ్చేస్తారుట."

"అయితే మాత్రం యిప్పటినుంచీ ఎందుకూ?" ముభావంగా అంది.

"తలుపేసుకో" అని మీరా వచ్చేసింది.

ఏమేం చేయాలో శాంతమ్మగారు పురమాయించేసింది.

మీరా చక చకా చేసుకుపోతోంది. మీరాకి ఊపిరి పీల్చుకోవటానికి కూడా తీరికలేదు. మీరాని చూసి అరుణ జాలి పడింది.

శేఖరం-తన తప్పు పదింతలై భూతంలా కనిపిస్తోందతనికి రోజు రోజుకీ. ఎంత పనయినా కిమ్మనకుండా—అలుపనేది లేకుండా చేసుకుపోయే మీరాని చూస్తే అతనికి జాలిగా బాధగానే వుంది.

కారులోనే కదా పొద్దున్నే వచ్చేస్తాడనుకున్న రాజేంద్ర పదకొండు గంటలవుతోంటే— టాక్సీలో వచ్చేడు.


"అమ్మా! అన్నయ్య వచ్చేడు" శేఖర్ పెట్టిన కేక విని శాంతమ్మగారు గబగబా వచ్చింది.

ఆవిడని చూస్తూనే "అమ్మా!" అంటూ దగ్గర కొచ్చేడు రాజేంద్ర. ఈ కొద్ది రోజుల్లో ఆతను చాలా మారిపోయాడు. చిక్కిపోయాడు కూడా.

"అమ్మా" అన్న పదం శాంతమ్మగారి హృదయం మీద అమృత వర్షం కురిసినట్టే అన్పించింది.

"పెదబాబూ!" సంతోషంలో ఆవిడ ఉక్కిరి బిక్కిరవుతోంది. "ఏరీ కుసుమా, పిల్లలూ ఏరి బాబూ!" అని అడిగింది.

రాజేంద్ర నిట్టూర్పు విడిచాడు. "కుసుమ కళ్ళకున్న పొరలు చాలా మందమమ్మా! ఇంకా ఆవిడకి తెలివి రాలేదు. నీ ఒంట్లో కులాసాగా వుంటోందామ్మా! అరుణ ఏదీ?" ఎంత అభిమానము ఆప్యాయత! ఇన్నాళ్ళు ఏ మూల దాక్కున్నాయోగాని—ఇన్నాళ్ళు తన చుట్టూ వున్న అహంకారపు గోడల్ని—నిర్లక్ష్యపు తలుపుల్ని ఒక్కసారిగా ఛేదించుకుని బయటపడి తనని తన్నిగా అభిమానించే వ్యక్తుల్ని కళ్ళనిండుగా చూస్తున్నాయి.



ఆ పక్కనే వున్న అరుణ "అన్నయ్యా" అంటూ ముందు కొచ్చింది.

కుసుమా పిల్లలూ రాలేదని శాంతమ్మగారు చాలా బాధపడింది. వాళ్ళంతా కూడా వస్తారని ఆవిడ ఇంట్లో అన్నీ ఎక్కువగా చేయించింది. రాజేంద్రని చంటిపిల్లవాడిని నడిపించుకొచ్చినట్లుగా నడిపించి సోఫాలో కూర్చోబెట్టి తనూ పక్కన కూర్చుంది.

తల్లిని ఏవేవో అడగాలని—ఎన్నో చెప్పాలని, ఎన్నో వూహించుకుని ఇంటి దగ్గర బయలుదేరాడు. ఎలా చెప్పాలో తెలియలేదు. అవిదేదన్నా విసుక్కుంటే—హేళనగా మాట్లాడితే తన నిర్లక్ష్యాన్ని క్షమించమని వేడుకోవచ్చు....

"ఏమిట్రా బాబూ, అంత చిక్కిపోయావు?" అని, "పాపా! మీరాని కాఫీ తీసుకురమ్మను" మళ్ళీ రాజేంద్రతో అంది "కుసుమని చూసి చాలా రోజులయింది. అరుణ శ్రీమంతానికి కూడా రాలేదు. తీసుకురాలేకపోయావా?"

"వాళ్ళక్కయ్య దగ్గర కెళ్ళింది. వాళ్ళమ్మాయిని వాళ్ళకిచ్చేస్తుందిట!" తల వొంచుకునే అన్నాడు.

"అదేం పనిరా! ఇన్నాళ్ళు దగ్గరుంచుకుని - చాలా తప్పు నాయనా! అయినా ఆ పిల్లేం చేసిందీ?" అంది బాధగా.

"తన కిష్టమై తెచ్చుకుంది; ఇదీ తన ఇష్టానికే వదిలేశాను" నిర్లిప్తంగా అన్నాడు. శేఖరం వాళ్ళ మాటలు వింటూ మౌనంగా కూర్చున్నాడు.

మీరా కాఫీలు తీసుకొచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోయింది.

"ఈ అమ్మాయి...." సందేహంగా ఆగిపోయాడు రాజేంద్ర. అలా అంటున్నప్పుడు శేఖరం కేసి చూశాడు.

శేఖరం చూపులు మళ్ళించుకున్నాడు.

శాంతమ్మగారు చెప్పింది. రాజేంద్ర అరుణకేసి తిరిగి "నీ ఫ్రెండేమో!" అన్నాడు.

అవునన్నట్లు తలూపింది అరుణ. ఇంకా_స్త వివరంగా చెప్పింది శాంతమ్మగారు.

రాజేంద్రకి బాధనిపించింది. "చూశావామ్మా! వున్నవాళ్ళకి కన్నూ మిన్నూ కానదు—మంచీ చెడ్డా తెలియదు. గుప్పెడు మెతుకుల కోసం ఎంత అభిమానాన్ని చంపుకుంటారో" అని క్షణం ఆగి, "అయితే ఏంలే! అలాంటివాళ్ల మొదటినుంచీ కళ్ళు తెరిచి నిదానంగా నడుస్తారు. బోల్తా పడ్డాలూ—బొప్పి కట్టడాలూ వుండవు."

శాంతమ్మగారు అభిమానంగా భుజంమీద చెయ్యి వేస్తూ అంది "పెదబాబూ! జరిగినవాటి గురించి బాధపడ్తూ కూర్చోకూడదు నాయనా! అంతా మన మంచికే అనుకోవాలి! కుసుమకి చిన్న తనం....నింపాదిగా నచ్చచెప్పాలి....కాఫీ తీసుకో! చల్లారిపోతుంది."

ఆ మధ్యాహ్నం—

రాజేంద్ర శేఖరానికి పదిహేను వేలు యిచ్చేడు.

"ఇంత తొందరేముంది? అక్కడ నీకేం యిబ్బంది లేదుకదా?" అన్నాడు శేఖరం.

"ఇబ్బందేం లేదురా! కారు పది వేలకి అమ్మేను. మీ వదినకు భరణంగా పెట్టిన నగలు వాళ్ళకెందుకు వదలాలని విడిపించుకు వచ్చేశాను" అంటూ పెట్టె తెరిచి కుసుమ పెద్ద గొలుసూ, వడ్డాణం, రాళ్ళవంకీ తీశాడు. "ఇవిగో! ఇవి అమ్మేసి ఎంత వస్తే అంతా జమ కట్టేద్దాం! మిగతాది తొందరలోనే సర్దుబాటు చేసేస్తాను" అన్నాడు.

నగలు చూస్తూనే శేఖరం వెనక్కి తగ్గేడు.

"కారు అమ్మటమే తప్పు చేశావన్నయ్యా! పంట డబ్బు వస్తుందిగదా! నర్దలేకపోయే వాళ్ళమా? నగలు మాత్రం మార్చటానికి వీల్లేదన్నయ్యా! అమ్మ వింటే చాలా బాధపడుతుంది" అన్నాడు బాధగా శేఖరం.

"ఇవి ఇంట్లో వుండి రక్షిస్తాయా? కారు రెడ్డి కిచ్చేద్దామనుకున్నాను. కాని, అతడు ఒప్పు కోడు. మీతో చెబితే మీరు ఎలాగూ ఒప్పుకోరు—అందుకే అక్కడ అమ్మేశానురా! నాకు ఇది తీరితేగాని మనసు కుదురుండదురా! నా కసలు ఆ వూళ్లో వుండాలంటేనే పిచ్చెత్తినట్టుగా వుందిరా" బాధగా జుట్టులోకి వేళ్లు దూర్చుకున్నాడు.

"అన్నయ్యా!" శేఖరం రాజేంద్ర దగ్గరగా వచ్చాడు. "ఈ కాస్తదానికే యిలా అయితే ఎలా? రెడ్డి చెప్పేదుగా తొందరేం లేదని? ఎన్నాళ్ళుంది సెలవు?" అని అడిగాడు.

"ఇంక నాలుగు రోజులుంది."

"అదేమిటి?"

"పది రోజుల్నుంచీ శలవులో వున్నారా! కారు అమ్మిన డబ్బు పూర్తిగా రాలేదు. దాని కోసం ఆగిపోయాను."

అన్నగారి చేయిమీద చేయివేస్తూ అన్నాడు "ఈ విషయాలన్నీ మనసులో పెట్టుకుని బాధపడకన్నయ్యా! అన్నీ అవే సర్దుకుపోతాయి. నగలమ్మటానికి మాత్రం వీలులేదు....నీకు ఎలాంటి అవసర మొచ్చినా—ఒకడు కాదు ఇద్దరు తమ్ముళ్ళున్నారన్నమాట మర్చిపోకు" ఆ కంఠంలో అన్నగారి మీదుండే ప్రేమాభిమానాలే కాకుండా—భక్తి గౌరవం తొణికిసలాడు తున్నాయి.

వీళ్ళంతా తన్నెందుకు వినుక్కోరూ? చీదరించుకోరూ! ఇంట్లో తమ్ముడు అన్నం తిన లేదని తెలిసీ కూడా తెలియనట్లే మసిలిన తన మీదెందుకు వీళ్ళకింత మమకారం? రెడ్డి అదే మాట అన్నాడు "నీకు ఇద్దరు తమ్ముళ్ళని మర్చిపోకు" అని.

(సశేషం)

మనసు సంగతి

డా॥ జయానాగరాజ్

శోభనరాత్రి....రమ గదిలోకి ప్రవేశించింది.

రవి ఎటో చూస్తున్నాడు....వీరిది ప్రేమ వివాహం!

రమ రోజూ తల్లి మందులకని మెడికల్ స్టోర్సుకు వెళ్ళేది. రవి ఆ షాపుకు వస్తుండే వాడు. కళ్ళు కళ్ళు కలుసుకున్నాయి. మనసులు మాట్లాడుకున్నాయి. ప్రేమ జనించింది. పద్దెనిమిదేండ్ల రమ తొమ్మిదో క్లాసు చది వింది. రవికి ఇరవయేళ్ళు. ఉద్యోగంలేదు. మెట్రిక్ చదివి ఖాళీగా తిరుగుతున్నాడు. ఇంటికి పెద్దకొడుకు. చదివి పైకి వచ్చి తమను ఆదు కుంటాడని అనుకున్నారు అతని తల్లిదండ్రులు! రమ వాళ్ళది సామాన్య కుటుంబం! నలుగురు పిల్లలు. ఏదో గుట్టుగా బతుకుతున్నారు. ఆ సమ యంలో 'ప్రేమ' అంటూ రమ ఇంటి మర్యాద రచ్చకీడ్చింది. రమ తల్లిదండ్రులు తొలుత నెత్తీ నోరు బాదుకున్నా, ఆడపిల్లని కన్నవాళ్లు కనుక వర్ణభేదమైనా పెండ్లికి ఒప్పుకున్నారు....

కాని రవి తాలుకు వాళ్ళు చాలా గొడవచేశారు. చంపుతామని అయినవారినంతా వెంటవేసుకుని ఇంటిమీది కొచ్చారు. చాలా రభస జరిగింది. ఏడ్పులు పెడబొబ్బలు....ఎలాగైతేనేం పెండ్లి అయిందనిపించారు....రమ మనసు ఈ గడ బిడకి కించపడింది. ప్రేమ.... పెళ్ళీ అన్నీ సిని మాలోలాగా జరగలేదు. తట్టుకోలేకపోయింది. పరిష్కార మార్గం వెదక నారంభించింది!

శోభనం రాత్రి—రమ భర్త దగ్గర వున్న ప్పుడు విరుచుకుపడింది....పండ్లు కొరికింది. అరిచింది. రవిని గిచ్చింది. కళ్ళెర్రచేసి చూసింది. రవి బయటకు పరిగెత్తుకొని వచ్చాడు, దెయ్యమని అరుస్తూ....అప్పటి కప్పుడు వచ్చిన భూతవైద్యుడు చెప్పిన కథ!

అనగనగా ఒక వూరు. ఆ వూరిపేరు అనకా పల్లి. పెళ్ళి వారముందనగా పాపం సీత కోరికలు తీరకుండానే కన్నెపిల్లగానే చనిపోయి దయ్య మయింది. ఆ ప్రాంతాల ప్రతి అమ్మాయినీ శోభనంనాటి రాత్రి పట్టి పీడించేది. ఆ దయ్యాన్ని ఒక భూతవైద్యుడు పట్టి సీసాలో దింపి భూస్థాపితం చేశాడు. కానీ ఈ మధ్య వచ్చిన వరదలకు ఆ దయ్యంవున్న సీసా పైకి వచ్చిపడింది. తెలియక ఎవరో మూతవిప్పారు. దయ్యాన్ని విడుదల చేశారు. ఆ దయ్యానికి అనకాపల్లి నచ్చక (!) 30 కిలోమీటర్లు నడిచి వచ్చి విశాఖపట్నంలో ఎక్కడో మారుమూల శోభనం జరుపుకుంటున్న రమను పట్టింది పాపం....! భర్తను చూడగానే విరుచుకుపడేది. రవి బెంబేలుపడ్డాడు. కట్టవలసిన తాయత్తులు కట్టించాడు కాని దయ్యం లొంగలేదు.

శోభనపు గదిలో దయ్యం!

అసలు సంగతి!

పెండ్లికి ముందు నుంచీ రభస చేసిన అత్త వారన్నా, అత్తవారిల్లన్నా భయపడింది రమ. ఉద్యోగం లేని భర్త. స్వతంత్రంగా బతుక నేర్వనివాడు. ఎంత ప్రేమ వున్నా తనని ఆనందపరచలేనివాడు. మరి తన కోరికలు నెర వేరడ మెలా? జీవితం ఎటువంటి మలుపు తీసు కుంటుందో మరి.... ఈ ఆలోచనలతో సతమత మవుతున్నప్పుడు అనకాపల్లి నుంచి నడచి వచ్చిన దయ్యం ఆసరగా దొరికింది. కన్న వారింట్లో వుండిపోయింది రమ. నిజానిజాలు తెలిసి జీవితంలో ఒడుదుడుకులను ఎదుర్కొనే విధానాన్ని (Confrontation Psycho-therapy) నేర్పేసరికి రవి కాకినాడలో ఒక ఉద్యోగం సంపాయించాడు. ఉద్యోగంతోపాటు వంశోద్ధారకుడు కూడా పుట్టాడు.... అత్తవారి కోపం తగ్గకపోయినా వారి బెడద లేకుండా దూరంగా వుండి తమ జీవితం గడిపే అవకాశం దొరికింది. దయ్యం మరో శోభనపు పెళ్ళి కూతురను వెతుక్కుంటూ వెళ్ళిపోయింది....

జీవిత సమస్యలకు వెంటనే జవాబు దొర కనినాడు.... మనస్సు ఆలోచనా శక్తిని కోల్పో యిననాడు బలహీనమయిన మనసు కొన్ని సాంఘికమయిన ఒత్తుడులకు, కట్టుబాట్లకు లొంగిపోతుంది.

మరొక కథ

పరీక్షలు వస్తున్నాయి. పబ్లిక్ కూడాను. తల్లి దండ్రులు తన మీద ఎంతో ఆశ పెట్టు కున్నారు.... తనకేమో సరిగా చదువు అబ్బడం లేదు. క్లాసు పుస్తకాల నడుమ నవలలు, సినిమా పుస్తకాలు చదవడం అలవాటయి, పాఠాలు తల కెక్కడం లేదు. తను తప్పక ఫెయిల్ అవుతుంది.... నలుగురూ నవ్వుతారు. తనవారు తననిక కట్టడి చేస్తారు.... ఎలా? స్కూలులో ప్రయివేటు క్లాసు పెట్టారు. స్కూలంతా ఖాళీ వీళ్ళ క్లాసు తప్ప. కాల కృత్యం తీర్చుకోడానికి వెళ్ళింది నిర్మల. ఎప్పుడూ లేనిది ఆ గోడలమీదంతా లైంగిక కార్యానికి చెందిన బొమ్మలు........రాతలు వేస్తున్నాయి. అది చదివి చలించింది. వెళ్ళిన పని పూర్తి చేయకుండానే బయటకు రాబో యింది. కాని బయటనుంచి గడి పెట్టి వుంది. చాల భయపడింది. అది పైకప్పులేని మరుగు దొడ్డి. ఎవరో పోకిరీ కుర్రాడు గోడ ఎక్కి నగ్నంగా నిలబడి బెదిరించాడు. కెవ్వున కేక వేసింది. మిగతా పిల్లలు వచ్చి గడ తీసి "ఏమి టేమిటని" అడిగితే భయంతో వణుకుతూ "దెయ్యం" అని మాత్రం అనగలిగింది.... నోట మాట మరి రాలేదు. స్కూలు అనగానే గడగడ వణికిపోయేది. మరుగుదొడ్డికిపోతుంటే నల్లని మగదయ్యం తన వెంటపడి భయపెడు తున్నదని చెప్పింది.

వుండి వుండి అరవడం; నగ్నంగా దయ్యం ఎగురుతూ తనను రమ్మంటుందని అరిచేది నిర్మల. మంత్రాలకు లొంగని ఆ దయ్యం ఆంతరంగిక మానసిక భేదిని (analytical sessions) లో బయట పడింది. లైంగిక విషయాలు అంతగా తెలియని పధ్నాలుగేళ్ళ నిర్మలకు ఒక్కసారిగా పురుష మర్మావయవం కనిపించడం, సంభోగం గురించిన విషయాలు తెలుసుకోవడం, చూడడం (Confrontation with primal scene and sex) జరి గింది. తెలిసీ తెలియని మనసు వయసు బెంబేలు పడింది. ఆ దృశ్యం పీడకలలా మన సులో వుండిపోయింది. మనసు అర్థం చేసుకో లేని సంగతులు సంఘటనలే దయ్యాలలా పీడి స్తాయి. అదే జరిగింది నిర్మలకు. లైంగిక విష యాలను తెలియజెయ్యడం (sex education) మనసుకు నచ్చచెప్పి కుదుటపరచడం (Psycho therapy) తో దయ్యం మాయ మయింది.

ఒక్కసారిగా మనస్సు తట్టుకోలేని సంఘ టనలు జరిగిననాడు అవి మనసులో యిమిడి వుండలేవు. తనను తాను సముదాయించుకోలేని నాడు మనసు కుంచించుకుపోయి జీవితసమస్య లకు ఏదో ఒక జవాబు వెదుక్కుంటూ అడ్డు త్రోవలు తొక్కుతుంది. (Taking shelter behind neurosis) కృత్రిమంగా సేద దీర్చుకోడానికి ప్రయత్నిస్తుంది. ఏదో ఆధారం కోసం వెదుకుతున్న మనస్సుకు మన చుట్టూ విచ్చలవిడిగా తిరుగుతున్న "భూత భావన".

మగ పురుగులు

పి. నాని

ఆదివారం అపురూపమయిందన్న కించకు క్షణం కూడా వృథా పోనీయకూడదనే దుస్సంకల్పంతో గురునాథం పదయినా లేవ లేదు.

గురునాథం గుర్రెడుతుంటే కామాక్షికి గుర్రుగా వుంది.

ఎంత స్వేచ్ఛగా, హాయిగా, నిశ్చింతగా నిద్ర పోగలుగుతున్నారు....కామాక్షి ఒకటికి పదిసార్లు తలపోసింది. "మగమారాజులు - మగజన్మ" అని కూడా అనుకుంది. అలా అనుకుంటూనే తన ఆడ జన్మని తిట్టిపోసింది.

"ఆదివారంగదా పెందరాళే లేవవలసిన అవ సరం వుండదు గదా, పిల్లల్ని స్కూలుకు పంపాల్సిన హడావిడి వుండదుగదా, మధ్య మధ్యలో మొగుడిగార్కి పళ్ళపొడి అందించి తువ్వాలందించీ, దువ్వెన అందించీ, ఆయన గారి చిరాకు పరాకుల్ని భరించీ....ఇలా ఇలా ఖంగారు పడక్కరలేదుగదా" అని అనుకో డానికి వీలులేని ఈ పరిస్థితిని "కసి"తీరా తిట్టి పోసింది.

చంటాడు రాత్రల్లా ఏడుస్తూ ఏడిపించేసాడు. వాడిని జోకొట్టి పడుకోబెట్టంగానే అయ్యగారి అసలు కోరిక....ఒక్క రోజన్నా తనని ప్రశాంతంగా పడుకోనీయమంటే ఎక్కడలేని ప్రేమనీ ఒలకపోసి నిద్ర పోనీరుగదా-ఇలా కళ్ళు మూస్తే అలా పాలవాడి కేక.

మళ్ళా నిద్రపడుతూంటుందో లేదో పని మనిషి కేక....ఇంతలో—

చంటాడు!

ఇంతేనా జీవితం?

ఇంతేనా జీవనం?

సారమేది సంసారంలో.......

ఇదేవిటి—?!?!

"ప్రేమసుధాపూరం నవజీవనసారం— సంసారం...."

హుం....ఎవరా అన్నది?

సంసారాన్ని తీసికెళ్ళి సముద్రంలో కలి పేసి తనూ ,కలిసిపోదామనుకున్నంత కోపం నిలువెత్తు లేచింది కామాక్షికి.


ఆ కోపంతోనే వెళ్ళి రేడియో గొంతు నొక్కేసి చంటాడి వీపుమీద చెళ్ళుమనిపించింది.

అప్పుడే వాడికి నీళ్ళోసి తల దువ్వి లాగూ చొక్కా తొడిగిందో లేదో లాగులో ఖరాబు చేసుకున్నాడు. వాడ్ని బరబరా నీళ్ళతొట్టి దగ్గరకి లాక్కెళ్ళి శుభ్రం చేస్తుంటే ముందు సిగరెట్టు పొగ, ఆ వెనక ఆ పొగ వదిలిన సత్యం లోపల కడుగు పెడుతూ "గురునాథం ఇంట్లో వున్నాడా వదినగారూ" అంటూ అడిగేడు.

విసుగు విసురు కలబోసి "ఆఁ-మంచం మహారాజులా మంచమెక్కి మరెవం దిగడం లేదు-లోపల కెళ్ళండి" అంది కామాక్షి.

సత్యం వచ్చాడంటే ఓ పట్టాన పోడు. పోయేటప్పుడు వట్టి చేతులతో పోడు, తమకని చేసుకున్న పచ్చడీ, కూరా ఖాళీ పాలపేకెట్లలో వేయించుకుని "మీ వంటలు బహు రుచిగా వుంటాయి వదినగారూ" అంటూ పట్టుకుని పోతాడు.

పెళ్ళీ పెటాకుల్లేని ఈ బమ్మగాడు ఈయన గారి కింత నేస్తుడెలాగయినాడమ్మా అని



కామాక్షి ఎప్పుడూ విస్తుపోతూంటుంది.

వారానికోసారొచ్చే ఆదివారాన్ని ఇలాంటి సత్తిగాళ్ళొచ్చి ఎగరేసుకుపోతారుగదా అని సత్యాన్ని చూస్తూనే నీరుగారిపోయింది కామాక్షి.

డోరియా ఇచ్చిన ఓక్కరా

రుద్రాభట్ల నరసింగరావు

నేను మంచి ధైర్యం వున్నవాడిని. ఇది మీరు మనస్సులో పెట్టుకోకపోతే నేను కాకినాడ వెళ్ళినప్పుడల్లా మా వూరికి దగ్గరలో వున్న వూరికి వొచ్చే ఆఖరి బస్సునే ఎందుకు అందుకుని వస్తానో అర్థం చేసుకోలేరు. అది ఆ వూరు రాత్రి పది గంటలకు చేరుకుంటుంది. అక్కడినించి జనసంచారం లేని రోడ్డు వెంట రెండున్నర మైళ్ళు నడిచి రావాలి. కాకినాడలో మా అత్తవారుగాని వున్నారనుకుంటారేమో, లేరు. ఆ ఊరంటేనే నాకిష్టం. మా ఊరని నే ననేది నేను పనిచేసే ఒక మారుమూల గ్రామం. అదీ ఒక అభిమానమే.

ఒకసారి ఇలాగే ఆఖరి బస్సు దగి ఇంటికి వస్తున్నాను. ఇల్లంటే నేను తాళం వేసుకొచ్చిన గది.


కాకినాడలో రెడీమేడ్‌లో కొన్న కొత్తబట్టలున్నాయి నా ఒంటిని. చేతిలో బేగ్‌లోనూ కొన్న వేవో వున్నాయనుకోండి.

నేను వేసుకున్న చొక్కా తెల్లనిది. దాని వయిపు ఒకసారి చూసుకుని 'ఆఁ చీకటిలో ఎదరనించి వొచ్చే ఎవరికయినా నేను కనబడ డానికి ఈ చొక్కా కొంత పనికొస్తూనే వుంది' అనుకున్నాను. పేంటు మట్టుకు శ్యామలవర్ణానిది. ఇంగ్లీషులో ఈ రంగుని జంగిల్‌గ్రీన్ అంటారు. పేంటుకి దారంతో పోగులు తీసి కుట్టినట్టు అదోరకమయిన డోరియా ఉంది. గుడ్డ కాస్త పెళుసుగా వుంది. అప్పటి కాలాన్ని బట్టి కొంత వొదులుగా వుంది పేంటు.

అది ఒక తారురోడ్డు. ఇటూ అటూ మర్రి చెట్లూ, పొలాలూ వున్నాయి. దారిలో ఒకటి రెండు గుట్టలు, ఒక చిన్న ఏరు, దానిమీద వంతెన కూడా తగులుతాయి. మన రోజులు బాగులేకపోతే యింకేమయినా తగలొచ్చు అది వేరే సంగతి.

నేను కొంతదూరం వెళ్ళేసరికి ఎక్కడో దూరంగా చీకట్లోంచి "అబ్బాయి అగ్గుందాః" అన్న కేక వినబడింది.

ఇలాటి కేక దొంగలు వేస్తారనే, వుందనో



లేదనో అంటే కొత్తవాడని తెలుసుకుని దగ్గర కొచ్చి మీద పడతారనీ మాట్లాడకుండా వొచ్చేస్తే ఇక్కడివాడే అనుకుని జడిసి ఆగి పోతారనీ నాకు గ్రామస్థులు ఒకసారి చెప్పేరు.

నేను ఆ సలహా ప్రకారమే చేస్తాను ఎప్పుడు రాత్రిపూట ఈ దారిన వచ్చినా. ఇప్పుడూ అదే చేసేను. వినిపించుకోనట్టు ముందుకి సాగి పోయేను.

పైన నక్షత్రాలున్నా చీకటే చీకటి. మర్రి చెట్లూ, ఊడలూ మొదలయినవి నీడలుగా మాత్రం కనబడుతున్నాయి. నేను ఆధునిక చిత్రకళతో పరిచయం వున్నవాడిని. ఆకారాన్ని చితగ్గొట్టి భావానికి ప్రాణప్రతిష్ఠ చేస్తారు-ట ఆ చిత్రకారులు. వాళ్ళు ఇలాటి సమయంలో ఇక్కడికొస్తే (చెట్లూ మొదలయినవాటి ఆకారాల్ని చితకగొట్టి, అవి కల్పించే భావం అయిన) దెయ్యాల్నీ, భూతాల్నీ చిత్రిస్తారేమోః

వంతెన దాటేను. అప్పటిదాకా గాలి లేదు గాని అప్పటినించి కొంత గాలి వీచడం మొదలు పెట్టింది.

నేను నడుస్తున్నాను.

కొంతసేపటికి నా వెనకాల ఎవరో వొస్తున్నట్టనిపించింది. చిన్న క్రమంతప్పని చప్పుడు.

ఆగి వెనక్కి తిరిగి చూస్తే ఎవరూ లేరు గాని చప్పుడు మాత్రం ఆగిపోయింది.

చప్పుడు ఆగిపోవడంతో అనుమానం వచ్చిందిః

ఏవరో వెంబడిస్తూ నేను ఆగిన వెంటనే తనూ ఆగినట్టు అనుకోవడానికి అడ్డేమిటిః

మరొకడయితే అప్పుడే భయపడే వాడేగాని నేను మట్టుకు నడవడం మొదలెట్టేను మళ్ళీ.

మళ్ళీ అదే చప్పుడు గరగర....గరగర....

ఈసారి ఆ చప్పుడుని స్టడీ చెయ్యడానికి-ఎలాటిదో ఏమిటో జాగ్రత్తగావిని తెలుసుకోవడానికి-కొంతదూరం నడిచి అప్పుడు ఆగేను.

నేను ఆగిన వెంటనే ఒక లిప్తకాలం ఆలస్యం లేకుండా ఆ చప్పుడూ ఆగిపోయింది.

మనుష్యులకి అలా ఆగడం అసాధ్యం.

దెయ్యాలమీద చదివిన వాదోపవాదాలూ, కథలూ, మధుమతిలాటి సినీమాలూ జ్ఞాపకం వస్తున్నాయి.

శ్రీకాంత్, వస్తాదు వీరన్నల ఉదంతాలు చెప్పేదేమిటిః ధైర్యం మనకి శ్రీరామరక్ష. భయం మన పాలిటి మృత్యుదేవత అనేగదా.

నేను ఎవరికీ తీసిపోయినవాడిని కాదలుచుకో లేదు. నడుస్తున్నాను.

మళ్ళీ అదే చప్పుడు గరగర....గరగర....

ఆగి ఆలోచిస్తున్నాను. 'బతుకను బాటను ఒంటరిగా నడచియేపోవలె వడి వడిగా' అన్న సినిమా పాట జ్ఞాపకం వచ్చింది. వేగంగా నడిచి చూస్తేనో.

గబగబ కొంతదూరం నడిచి, ఆ గర గర మరింత ఎక్కువగానూ జోరుగానూ వినిపించే సరికి రోడ్డు పక్కకి వెళ్ళి నిలబడ్డాను—ఆ వొచ్చేవాళ్లెవరో నన్ను దాటుకుని ముందుకి వెళ్ళిపోతారేమో అన్న వుద్దేశంతో.

చిత్రం ఏమిటంటే, ఆ చప్పుడూ నాతో బాటే పక్కకి వచ్చి ఆగింది. అంతేగాని ముందుకి వెళ్ళింది ఎవరూ లేరు.

కొంతసేపు ఆగి మెల్లిగా రోడ్డు మధ్యకి వొచ్చేను. చప్పుడూ మెల్లిగా రోడ్డు మధ్యకి వొచ్చింది.

ఇహ నిలబడి స్థిమితంగా ఆలోచించడం ఒక్కటే మిగిలింది.

ఆగి ఆలోచిస్తున్నాను. గాలి వేసేదాకా ఈ చప్పుడు లేదు. అంటే గాలిని బట్టి కదులు తున్న దేనివల్లో ఈ చప్పుడవుతున్నట్లుంది. మరి ఆగినప్పుడు లేదేం? నడుస్తున్నప్పుడు, గాలికి కదిలేది ఏది?

కనుక్కోవడానికి నడిచేను-కిందకి చూస్తూ.

పేంటు కాలు గాలికి లోపలి వైపుకి పొంగు తోంది. కాళ్ళు ఒకదానితో ఒకటి రాపాడించు కుంటున్నాయి.

డోరియా గుర్తొచ్చింది.

గరుకు ఉపరితలాలు ఒకదానితో ఒకటి రాపాడించుకుంటున్నప్పుడు పుడుతున్న ధ్వని అది.

డోరియా ఇచ్చిన టోకరా.

ఏదో కనుక్కున్న విజ్ఞానవేత్తలా ఆనం దిస్తూ మిగిలిన మైలున్నర మేరా ఆగుతూ నడుస్తూ ఊరు చేరేను.

ఊరి వెలుపల ముసాఫీర్ ఖానా (పాంథ శాల)లోని గు(బు)డ్డి దీపం కనబడేసరికి అందు లోని వాళ్ళని లేపి నా అనుభవాన్ని చెప్పేద్దామా అనిపించి తమాయించుకుని, నా గదిలోకి చేరు కున్నాను. □

ఓ ఇంటి రామాయణం

—మొవ్వ. బాబూరావు

ఆకాశం పేథాస్‌గా 'శ్రీరంజని మొహంలా వుంది ఎప్పుడు అవకాశం వస్తుందా వాన కురిపిద్దామని.

మేఘాలు మాయాబజారులో యస్వీఆర్ గర్జించినట్లు గర్జిస్తున్నాయి.

ఇంట్లో అలారం హిజ్ మాస్టర్స్ వాయిస్ రికార్డులా ఇష్టం వచ్చినట్లు మ్రోగిపోతోంది.

గాఢ నిద్రలో ఇహం మరచిపోయి నిద్ర పోతున్న సుబ్బారావుకి పిచ్చికోపం వచ్చింది అలారం చేస్తున్న శబ్దానికి.

బంగారంలాంటి కల ఝంగాళాఖాతంలో కలిసిపోయినట్లనిపించింది.

చురుక్కుమంటే తొడమీద కసిగా చేయి వేసి చేత్తో నలిపాడు.

కావలసినంత జ్యూసు తాగేసి దుప్పట్లో దూరిపోయింది సుబ్బారావుకి అందక వారం రోజులనుంచి ఆ దుప్పట్లోనే దినదినాభివృద్ధి అవుతున్న నల్లిపిల్ల.

అలారం కూత ఆపింది స్టేషన్‌లో నుంచి వెళ్ళిపోయిన రైలుబండీలా.

చిరాగ్గా, బద్ధకంగా వొళ్లు విరుచుకుంటూ లేచాడు సుబ్బారావు భార్య చేతిని పక్కకు పెడుతూ.

"తాయారూ లే!" నిద్రాదేవి ఒడిలో హాయిగా పడుకున్న భార్యని ఒక కుదుపు కుదిపాడు.

"అబ్బ! అప్పుడే తెల్లారిందాండీ?" భర్త తన ఒంటిమీదనుంచి తీసేస్తున్న దుప్పటిని లాక్కుని బిడాయించుకుని మళ్ళీ నిద్రలోకి జారిపోయింది తాయారు.

ఖర్మ! ఏనాడు చేసుకున్న పాపమో!

"ఒసేయ్ నిన్నే! ఐదు దాటినట్లుంది. కాస్త తొందరగా లేచి వేన్నీళ్ళు తగలెయ్యి" అంటూ లైట్ కోసమని దగ్గర్లో వున్న స్విచ్ ఆన్ చేసాడు.

హు! సరిపోయింది కరెంట్ లేదు. ఇహ ఇవ్వాళ వెళ్ళినట్లే!

"తాయారు! కరంట్ లేనట్లుంది. అగ్గిపెట్టె తీసి కాస్త లాంతరు వెలిగించు" చీకటిలోనే నుంచుని అన్నాడు.

"అబ్బా! కాస్సేపు పడుకోనీయండీ. కరెంట్ ఎలాగూ లేదుగా! కాస్త లేటుగా వెళ్ళకూడదూ....?"

సుబ్బారావుకి చిర్రెత్తుకొచ్చింది.

"ఇందాకట్నుంచి చూస్తున్నాను, నీ నిద్రా నువ్వూనూ! మొగముండాకొడుకు ఆఫీసుకు తగలడాలి, వాణ్ని కాస్త తొందరగా పంపే ఏర్పాటు చేయాలన్న ఉద్దేశం ఏ మూలన్నా వుండి చచ్చిందా!" ఆఫీసర్ జ్ఞాపకం వచ్చే సరికి మరింత రెచ్చిపోయాడు.

తాయారుకు ఒక్కసారి మత్తు వదిలినట్లు అయింది. లేచి కూర్చుంది.

అలా అంటేనే భార్య లేస్తుందని సుబ్బా రావుకి బాగా తెలుసు. పయిగా ఆఫీసర్‌గారు జ్ఞాపకం వచ్చారు. ఇంకేం ఇష్టం వచ్చినట్లు మాట్లాడేసాడు.

భార్యని కష్టపెట్టటం తనకి యిష్టం లేదు. కాని ఏం చేస్తాం! తప్పదు! గవర్నమెంటు తమలాంటివాళ్ళ మొహాలమీద అలా రాసారు.

"అగ్గిపెట్టె వంటింటిలో అలమారు మీద వుంది" అడుగులు వేస్తూ అంది తాయారు.

"నువ్వు ఇక్కడే వుండు నేనే నెమ్మదిగా వెళ్ళివస్తాను. ఇంతకీ లాంతరు ఎక్కడ వుంది!

ఆ కూజా ప్రక్కనే వుందా లేదా దానికి అక్కడ్నుంచి స్థాన చలనం కలిగించావా?"

"చాల్లెండి! మీ జోకులు మీరూనూ! వెళ్ళి అగ్గిపెట్టె తీసుకురండి'' ఆవలిస్తూ తాయారు అంది.

మినీ లోయర్ కే.జీలో చదివే పిల్లాడులా తప్పటడుగులు వేసుకుంటూ రాని కరెంట్‌ని తిట్టుకుంటూ అలాగే ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్‌కి నోటితోనే మెమోలిచ్చేస్తూ చికాగ్గా ముందుకు కదిలాడు.

"ఢన్........"

"ఏమిటండీ! ఏమిటీ ఆ మోత!" కంగారు పడిపోయింది తాయారు.

"నా శార్దం! నువ్వు అక్కడే వుండు! ఇక్కడికి మాత్రం తగలడబోకు" తలుపు ముద్దు పెట్టుకున్న ముఖాన్ని చేతితో రాసుకుంటూ కోపంగా అన్నాడు సుబ్బారావు.

వెధవ ఆఫీసులు! వెధవ ఉద్యోగాలు! ఛీ! ఛీ! ఇలా ఆఫీసులకి తొందరగా రమ్మంటే ఏమిటనో వీళ్ళ వుద్దేశం! ఇదేమన్నా అట్లతద్ది పండుగలా! మనిషికి నిద్ర ఎంత • అవవరం? పైగా వానాకాలం! రాత్రి పక్కమీద ఒరిగినప్పట్నుంచీ భయమేకదా! తెల్లారి ఐపోతోందేమో అని! అలారం మ్రోగుతుందేమో అనీ గుండె దడ దడ.

"ఏమేవ్ ఇక్కడ అగ్గిపెట్టె కనబడటం లేదు."

"అబ్బా!" అంటూ మూలిగాడు మళ్ళీ.

"ఏమండీ! మళ్ళీ ఏమయింది?" భర్త ఆజ్ఞను దాటకుండా అక్కడే అలా చీకటిలో కంగారు పడసాగింది తాయారు.

"ఇక్కడ చెయ్యి పెడితే ఏదో కుట్టినట్లుంది ఖర్మ.''

"కొంపతీసి తేలుగాని కాదుకదా!"

"అగ్గిపెట్టెని, తేలుని ప్రక్క ప్రక్కనే పెట్టేవేంటి!" నొప్పిని భరిస్తూనే జోకేసాడు.

"ఛ! ఏమిటండి ఆ మాటలు!" సన్నగా ఏడుపు గొంతుతో అంది మంగతాయారు.

చచ్చాం! కొంపదీసి ఈవిడగారు ఏడుపు లంకించుకోదుకదా! కొద్దిగా లోపలే నొచ్చుకున్నాడు సుబ్బారావు భార్యతో తను అన్న మాటలకి.

బయట శ్రీరంజని క్లయిమాక్స్ సీనులో వున్నట్లుంది.

కుంభవృష్టి కురుస్తోంది.

"దొరికిందాండి?"

బ్రతికేంరా బాబూ! "ఆ దొరికిందే ఈ మూల!"

ఐదు పుల్లలు మొరాయించిం తర్వాత నాలుగుసార్లు చంద్రుతలను బరికినట్లు బరికిం తర్వాత ఆరోపుల్ల మెల్లగా ప్రమోషన్‌లేని ఎన్. జీ. వోలా నవ్వింది ఓ నవ్వు.

దాని చిరునవ్వుతోనే లాంతర్ వునికిని గమనించాడు సుబ్బారావు.

నెమ్మదిగా కొండెక్కుతున్న వెలుతురు సాయంతో లాంతర్ దగరకు వెళ్ళి లాంతర్ వెలిగించాడు త్వర త్వరగా.

అంతే! 'నా ఆయుష్షు ఇన్ని సెకండ్లే' అంటూ కన్ను మూసింది వెలుతురు నిచ్చిన అగ్గిపుల్ల.

లేచిన అర గంటకి భార్యా భర్తలు మసక మసగ్గా ఒకళ్ళని ఒకళ్ళు చూసుకున్నారు.

"అలా కొండపల్లి బొమ్మలా ఫోజ్ ఇస్తూ నుంచోకపోతే కాస్త స్టవ్ అంటించి నీళ్లు పెడితే ఏ కొంపలేవీ మునిగిపోవు" వద్దనుకుంటూనే కసిరాడు భార్యని.

"మీరేకదండీ. ఇక్కడ్నుంచి కదలద్దని...."

"ఆహా! భర్తమాటని జవదాటని భార్యని ఇన్నాళ్ళు కదా చూసింది! ఎంత అదృష్టవంతుణ్ని!''


హేళనగా అంటున్న సుబ్బారావు మాటలు విని నిజమే అని నమ్మి "చూసారా! నేనంత...."

"ఛీ నోర్మూయ్ వెళ్ళి నీళ్లు పెట్టు!" గర్జించాడు సహించలేక.

వర్షం ఇంట్లోనే కురుస్తోంది వయా మంగతాయారు కంట్లోంచి.

సుబ్బారావు మసక చీకటిలోనే అప్పుడున్న తాయారుని చూసి తల్లడిల్లి పోయాడు.

"తాయారూ! నేను అక్కడే నుంచోమంది వెలుతురు రాక ముందు. ఇప్పుడు ఈ బోడి



లాంతరు చూడు ఎలా ఇచ్చేస్తోందో వెలుతుర్ని!''

పెళ్ళయి ఏడాది కూడా కాలేదు. పెళ్ళాన్ని తిట్టినందుకు నొచ్చుకున్నాడు.

బయట చలి, వాన, గాలి ఒకదాని కొకటి పోటీ పడుతున్నట్లున్నాయి.

వెచ్చగా ఇటువంటి సమయంలో పడుకోక ఇదేం ఖర్మ?

ఏం చేస్తాం ఏనాడు చేసుకున్న పాపమో! ఈ రోజు ఇలా అనుభవించాల్సొస్తోంది. మార్నింగ్ అవర్స్ ఆఫీసులో ఎక్కువగా పని చేయటానికి ఉపయోగపడుతుందిట. లేని ఫ్రెష్‌నెస్ అంతా ఈ టయింలో వుంటుందని ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని పద్ధతిని ప్రవేశపెట్టింది. 'బుద్ధులు భూములు ఏలుదామంటే రాతలు గాడిదలు కాసాయిట' కోపంలో వున్నప్పుడు సుబ్బారావుకి సామెతలు తెగ గుర్తుకొచ్చేస్తాయి. తిండీ తిప్పలు లేక అక్కడికి (ఆఫీసులకి) తగలడ్తే రోగిష్టి వెధవ ఆస్పత్రిలో కూర్చున్నట్లుంటుంది. అక్కడ ఆఫీసర్‌గార్ని చూస్తే చాలు ఇంజెక్షన్ పట్టుకొస్తున్న పశువుల డాక్టర్‌లా అనిపిస్తాడు. పోనీ అష్ట కష్టాలుపడి కొంపనుంచి బయట పడ్దామంటే అదీ లేదు.

పడీ పడీ ఐదింటికి లేచీ ఎక్కడెక్కడ ఏమున్నాయో చూసుకుందామంటే కరెంట్ వుండి చావదు. పంపు తిప్పితే సరే సరి నెమ్మదిగా నీళ్ళు గుళ్ళో పూజారి ఇస్తున్న తీర్థంలా ఒయ్యారంగా వస్తుంటాయి చచ్చేంత సిగ్గుతో. గంటకి ఓ అపుకార నిండితే నిండినట్టే! కాఫీ ఓ గుక్క నోట్లో పోసుకుందామంటే పాలు నెమ్మదిగా తను ఆఫీసుకి బయల్దేరే ముందు వస్తాయి కొంపకి. వీటన్నిటిని వదులుకుని బస్‌స్టాప్‌కి వెళితే అంతే! బస్సులు వస్తాయో రావో! వాటి అలకలు మనం తీర్చలేం గదా!

వస్తే సైంకి పది నిముషాలు ముందే వచ్చి తుగ్రుమంటాయి లేదా యింతే సంగతులు-చిత్తగించవలెను. ఆ బస్సు ఈ బస్సు పట్టుకుని పోసీ నానా తంటాలు పడి ఆఫీసుకి చేరామా, అటెండెన్స్ రిజిష్టర్ సెక్షన్లో వుండలేక విల విల్లాడుతూ ఆఫీసర్‌గారి చేతిలోకి వెళ్ళిపో యుంది మాంత్రికుడు చేజిక్కించుకున్న మంత్ర దండంలా.

మొన్నటికి - మొన్న ఏమయింది, తను ఇలాగే ఆఫీసుకి లేటుగా వెళ్లేసరికి రిజిష్టర్ ఆఫీసర్‌గారి రూంలోకి వెళ్ళిపోయింది. ఇప్పుడే వెళ్ళింది వెళ్ళి త్వరగా సైన్ చెయ్యమని సెక్షన్‌లోవాళ్ళు చెబితే తను అల్‌మోస్టు పరిగెత్తినంత పనిచేసి ఆయన రూంకి చేరుకుని అప్పుడే రెడ్ ఇంక్ పెన్నుని అటెండెన్స్ రిజిష్టర్ కాయితాల మీద అన్చబోతున్న ఆఫీసరుగారి పర్మిషన్ తీసుకునే ఎలాగయితేనేం సంతకం చేసాననిపించుకున్నాడు.

"నిద్రమత్తు యింకా వదిలినట్లు లేదే?" వ్యంగ్యంగా అంటున్న ఆఫీసర్ వంక తను దీనంగా చూశాడు.

"అలా బెల్లం కొట్టిన రాయిలా నిలబడతావే! సంతకం ఎక్కడ పెట్టావో చూసావా?"

భయం భయంగా ఆఫీసర్‌గారి పెన్ను పాళీవంక చూసాడు తను. ఆ క్రితం రోజు ఆదివారం. సోమవారం బదులు సంతకం ఖాళీగా వున్న ఆదివారం కాలంలో చేసాడు.

"సారీసార్!" కొట్టేసి ఆ రోజు కాలంలో సంతకం చేసాడు భయపడ్తూ భయపడ్తూనే.

"బి కేర్‌ఫుల్!" అది హెచ్చరికో, మందలింపో తనకి అర్థం కాలేదు.

తనకి నిజంగా ఆరోజు నిద్రమత్తు వదలకే అలా చేసాడా? కంగారులో అలా చేసాడా? ఏది ఏమయినప్పటికీ ఇలాంటివి ఈ మధ్యన రోజూ ఇంచుమించు జరుగుతూనే వున్నాయి.

"ఏమండీ!"

"ఆ మళ్ళీ ఏమయింది?"

"స్టవ్‌లో కిరసనాయిల్ అయిపోయినట్లుందండీ, అంటుకోవటం లేదు. నిన్న సాయంత్రం మీకు చెప్పటం మర్చాను. కిరసనాయిలు అయిపోయిందండీ" చావు కబురు చల్లగా వినిపించింది తాయారు.

"డ్రమ్‌లో ఓ లీటరు పోళ్ళు తీసుకొచ్చి స్టవ్‌లో తగలేయి" అసహనంగా అన్నాడు సుబ్బారావు.

"అది కాదండి...."

"ఇహ నువ్వు నాకేం చెప్పక్కరలేదు" విసురుగా ఆఫీసు రూమ్‌లోకి వెళ్ళిపోయాడు షేవింగన్నా అఘోరిద్దామని.

కిరసనాయిలు లేదుట! లేదు. హు అది లేకపోతే స్టవ్ వెలగదు కదా! స్టవ్ వెలగకపోతే వేణ్ణీళ్ళు వుండవు. చావని! వేణ్ణీళ్లు లేకపోతే ఆ కూల్ నీళ్లే కుమ్మరించుకుని వణుకుతూ తగలడచ్చు! కాని.... కానీ కాఫీ లేకపోతే? అమ్మో తనుండలేడు.

సబ్బు బ్రష్‌కి అంటించి, తెగ మర్దిస్తున్నాడు బ్రష్‌తో మొహాన్ని చిటపటలాడుతూ.

చివరికి వెలిగించిన లాంతర్ గడ్డంసామాను ఎక్కడుందో చూపెట్టటానికి వుపయోగపడింది ఏం చేస్తాం! అలా అయిపోయింది.

ఈ దిక్కుమాలిన గడ్డం ఒకటి. రెండ్రోజుల కొకసారి గ్రోమోర్ వేసిన మొక్కలా ఇష్టం వచ్చినట్లు పెరిగిపోతుంది. గ్రోమోర్ లేకపోతే మొక్కలు సరిగ్గా పెరగవేమో కాని ఏ మోర్ లేకుండా ఇట్టే మొలకెత్తేసి నిమిష నిమిషాభివృద్ధి అయిపోతుంది గడ్డం. ఏ ఎరువు లేకుండా పెరిగేది ఈ గడ్డం ఒక్కటే.

"గవాస్కర్ ఆ బ్లేడు వాడి అంత పెద్దవాడయ్యాడు, నాగేశ్వర్రావ్ ఫలానా బ్లేడు వాడి అంత గొప్ప యాక్టరయ్యాడు" అని ఈ బోడి అడ్వర్‌టైజ్‌మెంట్లు ఒకటి. అదే బ్లేడు తను వాడితే ఏమయిందప్పుడు? గడ్డం క్రింద చల్లగా తాకింది ఎర్రని రక్తం. చిన్న గాటు పడినట్లుంది. కారిపోతోంది నెత్తురు సెలయేరులా.

సుబ్బారావ్‌కి కోపం, ఉక్రోషం, చిరాకు అన్నీ హెచ్చిపోయాయి.

బయట వర్షం తెలుగు రచయిత్రిలా విజృంభించేస్తోంది జనాలు ఎలా చస్తారో చావమన్నట్లు.

తన అదృష్టంకొద్దీ మామగారు టేబుల్



క్లాకు ముందు ముందు రోజూకన్నా ఉపయోగపడుతుందని కొనిచ్చాడేమో!

నాయనా సుబ్బారావ్, రేవు ఉదయం ఆఫీసులు పెడితే, కొంపదీసి కరెంట్ పోయిందంటే ఈ రేడియం గడియారం నీకన్నివిధాల ఉపయోగిస్తుందని బహూకరించినట్లున్నాడు.

కొత్త భార్య మొహం కన్నా మెరిసిపోతోంది మామగారిచ్చిన రేడియం గడియారం.

అబ్బో! ఆరుంబావు, అమ్మో మరో పావుగంటలో బస్సు వచ్చేస్తుంది.

బస్సు మిస్సయిందంటే యింకేమయినా వుందా! సగంరోజు క్యాజువల్ లీవ్ కసిగా కోసేస్తారు. అసలే తనకున్నది రెండంటే రెండే రోజుల లీవ్. ఈ విధంగా ఓ అరరోజు వేస్టు అయ్యిందంటే తను భరించలేడు.

ఈ పనివేళలు మార్చటం కాదుగాని కొత్తగా పెళ్ళయినవాళ్ళు ఎంత బాధ పడుతున్నారో పెట్టినవాళ్ళకేం తెలుసు? అసలు ఒక్క కొత్త దంపతులేంటి రిటైర్ కాబోయే వుద్యోగి వరకు ఎన్నెన్ని బాధలు అనుభవిస్తున్నారో ఈ పనివేళలు వచ్చిం తర్వాత. టైంకి తిండి తిప్పలు, నిద్రా వుండవుకదా! ఆ ఎవరు ఎలా గయితే ఎవరికి ఏమయింది? వెనకటికి తుగ్లక్ దౌలతాబాద్‌నుంచి హైదరాబాదుకు, హైదరాబాద్ నుంచి దౌలతాబాద్‌కి రాజధానులు మార్చేసాడుట. ఆయనగారేం నిక్షేపంలా వున్నారు గాని ప్రజలే ఏదేం రాజురా అని ఈ చెంపా ఆ చెంపా వాయించుకున్నారుట. ఇప్పుడూ అలానే వున్నట్లుంది చూస్తుంటే అనుకున్నాడు సుబ్బారావు, కొత్తగా ప్రవేశపెట్టిన పనివేళలను తిట్టుకుంటూ.

బాత్రూంలోకి వెళ్ళి తలుపు వేసుకోకుండానే స్నానం చేసేద్దామనుకున్నాడు. కాని తను ప్రస్తుతం వున్నది రెండు గదులు ఓ బోగి. బాత్రూమ్, లెట్రిన్ ఇన్‌స్టాల్‌మెంట్‌గా కట్టించినట్లున్నాడు ఇంటి ఓనర్ అదొక స్పెషల్ బోగిలా ఇంటి ఆవరణకి చివరగా. రెండింటికి కనెక్షన్ విశాల భూభాగం. దీన్ని దాటితేగాని బాత్రూమ్‌కి చేరుకోలేం. ఎంతో ఆలోచించి ఆలోచిస్తే బదారు ఎక్సిక్యూటివ్ ఇంజనీర్లకి ఒకే సమయంలో ఒకే ఐడియా వచ్చి ఈవిధంగా ప్లాన్‌వేసి ఇంటాయన చేత ఇలా కట్టించారు ఈ స్పెషల్ బోగీని.

ఇప్పుడు అక్కడికి చావాలంటే ఇదంతా దాటక తప్పదు. దాటామంటే మధ్యలోనే స్నానం చెయ్యక తప్పదు.

ఇప్పుడుగాని స్పెషల్ బోగీలోకని బయలు దేరామంటే మధ్యలో స్నానం, అక్కడికి వెళ్ళింతర్వాత అసలు స్నానం, చెంబు, సబ్బు సహాయంతో తర్వాత మళ్ళీ లోపలికి వచ్చేలోపల మరో స్నానం, ఇన్ని స్నానాల అనంతరం ఈ వానలో బస్‌స్టాప్ చేరేలోపల సముద్ర స్నానం. పెళ్ళిరోజు కూడా ఇన్నిన్ని స్నానాలు చేసినట్లు గుర్తులేదు సుబ్బారావుకి. చివరికి ఇన్ని స్నానాలు కొంపదీసి చేయను కదా అని బెంబేలుపడిపోయాడు.

అసలు ఏ గొడవా లేకుండా ఈ రోజు మానేస్తే!

అమ్మో యింకేమయినా వుందా? ఆడిట్ జరుగుతోంది. అందులో తను చేసే సీటుకి ఆడిట్ ఎక్కువ వుంది. వెళ్ళకపోతే యిటువంటి పరిస్థితులలో మెమో ఇచ్చి ఎక్స్‌ప్లనేషన్ కాల్‌ఫర్ చేసినా చెయ్యొచ్చు. ఆఫీసర్, ఆయనగారి పర్సనాలిటీ, నోరు జ్ఞాపకం వచ్చి అదిరిపోయాడు సుబ్బారావు.

భయము వదిలేయుటే గాంధీమతం

బాపు ననుసరిస్తే చాలు మనమందరం

భక్తిరంజనిలో చివరి పాట కాబోలు తన డియరెస్ట్ ఫ్రెండ్ పెళ్ళిలో చదివించిన నూర్రూపాయల ట్రాన్సిస్టర్లో నుంచి వస్తోంది.

గాంధీగారికేం ఆయన ఏమన్నా చెబుతారు. ఈ చెంపమీదలాగి తంతే ఆ చెంపని కూడా అలాగే అంతకన్నా ఎక్కువగా తన్నించుకోమన్నాడు.

ఈ కాలంలో నిజంగా ఎవరయినా అలా చేస్తే బాబూ రెండు చెంపలు వాయించాను మూడో చెంపేది అనే ప్రబుద్ధులు కూడా లేకపోలేదు.

రాత్రి నుంచి ఇత్తడి బిందెలో మగ్గిపోతున్న చన్నీటితోనే ముఖం చేత్తో కడుక్కుని (సబ్బు వగయిరాలు ఏమీలేక) సమయానికి టవల్ దొరక్కపోవటంతో తాయారు చీర కుచ్చిళ్ళతోనే మొహం తుడిచేసుకుని ఇమీడియట్‌గా టయింకి దొరికిన పళ్ళులేని దువ్వెనతో తల దువ్వేసి కాసింత పౌడరనే తెల్లని సున్నాన్ని మొహానికి పూసేసి మరేం ఆలోచించక వస్తానన్నాడు భర్త అన్నట్లు!

బయట వర్షం మాత్రం ప్రతిపక్ష సభ్యులు అసెంబ్లీలో గోలెత్తినట్లు గోలెత్తేస్తోంది.

బొటనవ్రేలు దగ్గర వూడిపోయిన చెప్పు తోలును కాలివేళ్ళతోనే సరిచేసుకుంటూ బస్సుస్టాపుకు వెళ్ళేలోపలే ఇవాల్టి స్నానం అయిపోతుందనుకునే ఒక్క వుదుకున ఇంటి దగ్గర్నుంచి పెళ్ళాంకి కనీసం కర్టసీకయినా టాటా చెప్పకుండా పరుగు లంకించుకున్నాడు రెండు రోజులనుంచి తన జలుబుకి అంకితమయిన జేబు రుమాలుని నెత్తినెక్కించుకుని.

భర్త అవస్థ చూసి తాయారు విలవిల్లాడిపోయింది. వెధవ ఆఫీసులు, వెధక పని వేళలు. పాపం కాఫీ కూడా తాగలేదు. ఎలాగో ఏమో. తను మాత్రం ఏం చెయ్యగలదు? ఓ నిట్టూర్పు విడిచి గడివేసుకుని దుప్పట్లో దూరిపోయింది ఒంటరిగా.

సుబ్బారావు రెండడుగులు వేసాడో లేదో కరెంట్ వచ్చేసింది 'నాతో ఇప్పుడేదయినా అవసరం వుందా?' అన్నట్లు.

సందు చివర పాల బూతులో పాలు వచ్చినట్లున్నాయి జనం గుమిగూడి వున్నారు గొడుగులు వేసుకుని.

అప్పటికే సుబ్బారావు స్నానం సగం అయిపోయింది!

బస్సు వుంటుందో వెళ్ళిపోతుందో అన్న అనుమానంతోనే ఆపసోపాలు పడుతూ బస్సు స్టాపుకు ఎలాగయితేనేం చేరాడు.

అనుమానం కాస్తా నిజమయి కూర్చుంది.

బస్సు స్టాపులో మానవమాత్రుడు లేడు.

వంద గజాల దూరంలో దేవదాసు సినిమాలో పార్వతిని అత్తారింటికి మోసుకుపోతున్న పల్లకిలా వెళ్ళిపోతోంది ఆర్‌టిసి బస్సు.

మరో ఇద్దరు సుబ్బారావులు అక్కడికి వచ్చేంతవరకు స్థాణువులా అలాగే నిలబడిపోయాడు సుబ్బారావు.

వెనక్కి వెళ్ళాలా, ముందుకు పోవాలా అన్న మీమాంసలో పడిపోయిన సుబ్బారావు ప్రకృతిమాత లాలనగా స్నానం చేయించేసి తనువుని వణికిస్తూ దూరంలో చూస్తున్నాడు ఏదయినా బస్సు వచ్చి కరుణిస్తుందేమోనని. □

చేతి వెన్నముద్ద

— వాకాటి

విషాదం బొమ్మయితే వినోదం బొరుసు.


నవ్వును తిరగేస్తే ఏడుపవుతుంది.

అందుకనే కొన్ని సందర్భాలలో ఏడ్వలేక నవ్వుతుంటాం.

ఈ అద్వైతాన్ని అద్భుతంగా చూపించిన మహా కళాకారుడు చార్లీ చాప్లిన్.

ప్రతి మనిషిలోనూ దాగిన భయానికి, బెరుకుకు, అపజయానికి, న్యూనతా భావానికి ప్రతీక అనదగిన ఒక బడుగువాని పాత్రను సృష్టించి, ఆ పాత్రను విశ్వజనీనం చేసిన స్రష్ట చాప్లిన్. అతడు ఏడిస్తే మనకు నవ్వొచ్చేది. అతడు నవ్వుతుంటే మనకు కడుపులో

ఎడిటింగ్ టేబుల్ ముందు చాప్లిన్



నవ్వును తిరగేస్తే ఏడుపవుతుంది!

దేవినట్లయ్యేది.

చాప్లిన్ నిర్మించిన సుమారు ఎనభై చిత్రాలలో చాల మూకీ చిత్రాలు వున్నాయి. 'గోల్డ్‌రష్', 'లైమ్‌లైట్', 'మష్యూర్ వెర్డో', 'గ్రేట్ డిక్టేటర్, దికిడ్' వంటివి కలకాలము మూనవాళిని కదిలించగల కళాఖండాలు.

"చలి, ఆకలి, దారిద్ర్యం తెచ్చిపెట్టే అవమానాలు - ఇవి ఒక వ్యక్తి ఆలోచనలను, మనస్సును తీర్చిదిద్దుతాయని నా నమ్మకం. అంతేగాని అన్నిటికన్నా సెక్స్ ప్రభావం ఎక్కువ అన్న ఫ్రాయిడ్‌తో నేను ఏకీభవించను" అన్నాడు చాప్లిన్. అందుకనే ఆ బాధలే అతడి ఇతివృత్తాలయ్యాయి.

తన చిత్రాలలోని హాస్యం గురించి విశ్లేషిస్తూ చాప్లిన్ "జీవితమంతా బాధతో, సంఘర్షణతో నిండి వుంటుంది. ఈ బరువులను మనం మోసే శక్తిని హాస్యం ఇస్తుంది. హాస్య రసపు సులోచనాలతో చూచినప్పుడు- అతి ముఖ్యమయిన దాని మధ్య - అముఖ్యమైనది కన్పిస్తుంది; సమంజసంలో అసమంజసమయినది కానవస్తుంది. ఈ మాత్రం రిలీఫ్ లేకపోతే మనమంతా మతులు కోల్పోయే వాళ్ళం" అంటాడు.

1918 లో అమెరికా ప్రభుత్వం తాను జారీ చేసిన యుద్ధకాలపు బాండ్‌లను అమ్మిపెట్టమని అప్పటికే సుప్రసిద్ధుడయిన చాప్లిన్‌ను కోరింది. అతడు మరొక సుప్రసిద్ధ నటుడు డగ్లస్ ఫెయిర్‌బాండ్స్, నటి మేరీపిక్‌ఫోర్డ్‌తో కలిసి అనేక రాష్ట్రాలు తిరిగి కొన్ని లక్షల డాలర్ల బాండ్‌లను అమ్మాడు. ఆ పని మీద తిరుగుతుండగా ఒక వూళ్ళో చాప్లిన్ గౌరవార్థం ఒకపార్టీ యిచ్చారు. అక్కడ మిలిటరీ జనరల్స్ కూడా వున్నారు. వారిలో జనరల్ స్కాట్ అన్నాయన మొదటినుండీ ధుమధుమలాడుతున్నాడు. అతడికి ఆ పార్టీ నిచ్చిన గృహస్థు అంటే సరిపడ్డట్లు లేదు. పార్టీ వాతావరణం కులాసాగా కాకుండా కాస్త బిగుసుకున్నట్లుగా వుంది. అప్పుడు జనరల్ స్కాట్ ఆ గృహస్థును చూపిస్తూ—"ఈయనకూ, అరటిపండుకూ తేడా ఏమిటి?" అని అడిగాడు. అప్పుడు చాప్లిన్—"అరటిపండు కయితే తొక్క ఒలిచేయవచ్చు" అన్నాడు.

ఆ తర్వాత పార్టీ హాయిగా సాగిందని వేరే చెప్పాలా?

నటన గురించి చాప్లిన్ ఇలా అంటాడు.

"నటుడికి అంతరాంతరాల్లో ఒక నెమ్మదితనం, నిగ్రహం వుండాలి. నటించబోయే దృశ్యం ఎంత బీభత్సకరమయినా అతడు ప్రశాంతంగా వుండి తన భావాలను మార్చుకుంటూ, తీర్చిదిద్దుకుంటూ నటించాలి....ఆ వ్యక్తిలో బీజప్రాయంగా నయినా ఆ నటనాశక్తి లేకపోతే నటించడం అన్నది నేర్పడం అన్నది సాధ్యం కాదు. మనిషి నిండా బుద్ధి, హేతువు వుండి భావోద్విగ్నత, ఆర్ద్రత లేకపోతే అతడు కసాయివాడు కావచ్చు, హంతకుడు కావచ్చు; తద్భిన్నంగా మనిషంతా ఆర్ద్రతే అయితే వెర్రివాడవుతాడు. ఆలోచన, భావమూ సమ తూకంలో కలవాడు నటశ్రేష్ఠుడు అవుతాడు....నే నెప్పుడూ నటనను అభ్యసించలేదు. గొప్ప నటుల సాన్నిహిత్యంలో ఓనమాలు దిద్దుకున్నాను. స్వతహాగా నటించే శక్తి కలవాడినయినా నేను వార రిహార్సల్స్‌నుండి 'టెక్నిక్' నేర్చుకున్నాను. ఎంతటి నటనాశక్తి కలవాడయినా టెక్నిక్ ద్వారా మెరుగులు దిద్దుకోక తప్పదు."

—"ది ఐడిల్ క్లాస్" అన్న సినిమా షూటింగ్ సమయంలో ఒక పెద్ద కాగడా వుండే దృశ్యం వుంది. చాప్లిన్ నిప్పు తగిలితే కాలని రాతిమీద (ఆస్‌బెస్టాస్) డ్రస్ వేసుకున్నాడు. అయినా ఒకసారి ఆ కాగడా వేడి అతడి శరీరానికి బాగా తగిలింది. వెంటనే ఇంకొక పొర రాతి నారను ఆ పంట్లానికి అతికించారు....కాని ఆ ప్రొడ్యూసర్ వెంటనే మంచి పబ్లిసిటీ వస్తుందికదా అని ఈ వార్తను కొంత అతిశయోక్తితో పత్రికలవారి కిచ్చాడు. "ఆ సాయంకాలం పత్రికలలో నా శరీరం, మొహం, చేతులు—అన్నీ కాలిపోయాయి అని వచ్చిన వార్త చూచి నిర్ఘాంతపోయాను.

నాకు అంత ఘోరప్రమాదం ఏదీ జరగలేదని, ఉన్న పరిస్థితిని తెల్పుతూ నేను పత్రికలకు వెంటనే తెలిపాను. అయితే నేను తెలిపినదానిని కొన్ని పత్రికలే ప్రచురించాయి" అని రాశాడు చాప్లిన్. ఔను మరి, ఏది వార్తయో, ఏది అవార్తయో పత్రికలవాళ్ళకు తెలుస్తుంది కాని చాప్లిన్‌కు తెలియదు కదా....

ఒకసారి మాంటెకార్లోలో ఒక విచిత్రమయిన సంఘటన జరిగింది. దానిని గురించి ఆర్థర్ కీస్లర్ తన Act of creation అన్న పుస్తకంలో పేర్కొన్నాడు.

మాంటెకార్లోలో ఒక పెద్ద పార్టీ జరిగింది. అందులో ఒక పోటీ ఏర్పాటు చేశారు. చార్లీ చాప్లిన్‌లా ఎవరు నటిస్తారో వారికి బహుమతులు ఇస్తామని ప్రకటించారు. పది పన్నెండుమందిదాక అతిథలు, చాప్లిన్ వేషాన్ని అభినయాన్ని అనుకరించే ఆ పోటీలో పాల్గొన్నారు. ఆ రోజు ఆ పార్టీలో చార్లీ చాప్లిన్ కూడా వున్నాడు. ఆయన కూడా ఆ పోటీలో పాల్గొన్నాడు. ఆయనకు మూడవ బహుమతి వచ్చింది.

ఈ వింతను విశ్లేషిస్తూ కీస్లర్ ఇలా అంటాడు:

"ఒక కొత్త దారిని, ఒక కొత్త టెక్నిక్‌ను మొదటిసారిగా కనుగొని, వాడడమే ఉపజ్ఞ కల మేధావి—లేదా 'జీనియస్' యొక్క లక్షణం; ఆ దారిని ఆ తర్వాత ఎందరో వస్తారు. ఆ టెక్నిక్‌ను ఆ తర్వాత ఎందరో వాడుకుంటారు. వారిలో కొందరు దానిని కనిపెట్టిన ఆది పురుషుడికన్న ఎత్తులను అధిరోహించడం జరగవచ్చు. కనుక జీనియస్ లక్షణం ఉపజ్ఞ (originality) యె కాని సంపూర్ణత కాదు" అంచేతనే చిత్ర రచనలో కొత్త బాణీలకు ఆద్యుడు పాబ్లోపికాసో అయినా అతడి చిత్రాలకు నూటికి నూరుపాళ్ళు అనుకరణలయిన చిత్రాలను కొందరు వేస్తే, ఏది పికాసోదో, యేది కాదో తెలుసుకోవడం చిత్రకళా నిష్ణాతులకు సైతం చేతనయ్యేది కాదు" కీస్లర్ ఒక సంఘటనను వర్ణిస్తాడు.

'నాకు తెలిసినావిడ ఒకతెకు ఎవరో పికాసో చిత్రాన్ని బహూకరించగా ఆమె దానిని అసలు orsginal పికాసో కాదని తెలిసి, మెట్లదగ్గర వేలాడదీసింది. ఆ తర్వాత ఆమె ఇంటికొచ్చిన నిపుణు డొకాయన జాగ్రత్తగా భూతద్దంలో పరిశీలించి ఆ చిత్రం పికాసోకు నకలు కాదని, అసలుదేనని తేల్చాడు. అప్పుడామె దానిని డ్రాయింగు రూములో వేలాడదీసింది. ఇది గమనించిన నేను ఎందుకలా తీశారని అడిగితే "చిత్రం మారలేదు నిజమే కాని అది అసలు పికాసోది అనేసరికి నా దృష్టి మారింది" అన్నదిట. కనుక ఆమె ఆ చిత్రంలోని వస్తువు, రేఖలు, రంగులు. వాటిమధ్య ఒద్దిక, మొత్తం రచన వంటి విషయాలను బట్టి గాక కేవలం చిత్రకారుడి పేరునిబట్టి దాని విలువను స్థానం నిర్ణయించిందన్న మాట. ఇదొక రకమయిన బడాయి. Snobbery అంటాడు కీస్లర్. ఈ బడాయి అలవాటయినవారు ఒక కళాసృష్టిలోని అంతర్గతమైన విలువలను బట్టి గాక, బాహ్యవిలువలను బట్టి దాన్ని పూజిస్తారంటారాయన.

ఒక పుస్తకములోని రచనయొక్క మంచి చెడ్డలనుబట్టిగాక, అది రాసినవారెవరో, దాని అట్టపేరు ఎంత బాగుందో, దానికి పీఠిక ఎవరు రాశారో, దానిలో అచ్చుపనితనం ఎంత బాగుందో వగాయిరాలననుసరించి ఆ పుస్తకాన్ని బేరీజు వేయడం—ఇలాటిదేనన్నమాట!

అందుకనే "ఒక పుస్తకాన్ని సమీక్షించే ముందే దాన్ని చదివితే పక్షపాత వైఖరి ఏర్పడుతుందని నేను చదవను" అన్నాడొక పాశ్చాత్య మేధావి. ఇటువంటి కొలతలూ, సమీక్షలూ మన సినీ, సాహిత్యాది రంగాలలో మనకు పరిచితాలే కదా!

జ్యోతి కథల పోటీ

మొత్తం పదమూడు బహుమతులు

ప్రథమ బహుమతి : రు. **750**

ద్వితీయ బహుమతి: రు. **400**

తృతీయ బహుమతి: రు. **300**

ఇంకా....ప్రశంసార్హమైన మరో పది కథలకు ఒక్కొక్క దానికి రూ. **116** చొప్పున ప్రత్యేక బహుమతులు

నిబంధనలు గమనించండి!

1. కథలు 16 పేజీలు మించకుండా (ముద్రణలో) ఉండాలి. (సుమారు పేజీకి 30 లైన్లతో 16 పేజీల పుల్‌స్కేపు పేజీలు మించకుండా.)
2. అనువాదాలూ, అనుసరణలూ అంగీకరింపబడవు. రచనలు తమ స్వంతమేననే హామీ పత్రాన్ని విధిగా పంపాలి.
3. ముఖ్యగమనిక : రచయితలు తమ చిరునామాను కథవున్న పేజీలలోగానీ, ఆ పేజీల వెనుకగానీ కాకుండా, మరో కాగితంపై వ్రాసి జతచేయాలి.
4. రచయితలు కలం పేరుతోబాటు తమ అసలు పేరును విధిగా తెలియచేయాలి.
5. ప్రచురణార్హంగాని కథలు తిప్పి పంపగోరువారు కథలతోపాటు తగినన్ని తపాలా బిళ్ళలంటించిన స్వంత చిరునామాగల కవరు జతచేసి పంపాలి.
6. పోటీకి రచనలు పంపే కవర్లపై 'జ్యోతి కథలపోటీకి' అని విధిగా రాయాలి.
7. పోటీలో బహుమతి పొందని కథలలో ప్రచురణార్హమైనవాటిని ప్రచురణకు స్వీకరించే హక్కు మాకుంటుంది.
8. పోటీ విషయంగా జ్యోతి సంపాదకులదే తుది నిర్ణయం.

—ఎడిటర్

రచనలు పంపేందుకు ఆఖరు తేదీ

31 ఆగస్టు 1980



"ఆహా! ఎంత శీతలముగా నున్నదీ రమణీయ ప్రదేశము! రంగులు మార్చుకొనుచున్న గిరులు; అడ్డముగ నిలువుగ అడ్డదిడ్డముగ ఎదిగిన తరులు! కొండల తలమీద కుచ్చుల టోపీలా ఊగుతున్న మేఘాలు! ఆహా! ఒడలు మైమరిపించే మనోహర దృశ్యము!! ఏమి ఈ పులకింత ఔరా....హౌరా!!"

మజ్జా గంతు లేసుకుంటూ అంత దారుణంగా ఆశ్చర్య పోతూవుంటే అల్లావుద్దీన్‌కి అంత చల్లటి ప్రదేశంలోనూ ఒళ్ళు మండిపోయింది. ఆపు మజ్జా అని గట్టిగా అరిచాడు. మజ్జు తక్కున ఆపుజేసి అల్లావుద్దీన్‌కేసి చూస్తూ—

మాట్లాడలేవా?" అన్నాడు అల్లావుద్దీన్.

"నో. నై. చేతకాదు. ఈ వింత ప్రాంతంబు నందు పాదంచిడిన తర్వాత మామూలు భాషయా మాట్లాడుట. కల్ల కల్ల అల్లావుద్దీన్‌సాబ్—"

అల్లావుద్దీన్‌కి పాలుపోక అరవైవోల్టుల బల్బు తీసి గట్టిగా నొక్కాడు. దాంతో మజ్జు కీచుమని అరిచి చేతులు కట్టుకుని అతనిముందు సవినయంగా నిలువబడ్డాడు.

"తగ్గిందా నీ మత్తు. ఇప్పుడు చెప్పు ఈ ప్రాంతం పేరేవిటి?" అల్లావుద్దీన్ అడిగాడు.

"అయ్యా— ఈ ప్రాంతాన్ని— అరకులోయ అంటారు."

"అట్లాగా అయితే ఈ దేశం పేరేమిటి?"

అరకులోయలో అల్లావుద్దీన్!

"సార్...., ఇంత చల్లటి చోట తమనోట ఆ మాట రా తగునా! ఏల కళ్ళు ఎర్రబడ, పెదవులు తడబడ, కంఠంబు వణక ఏలఏల?" అంటూ వుంటే

"మజ్జా—ఆపు," అంటూ ఓ చిన్నపాటి గావు కేక పెట్టి "ఏమయింది నీకు. ఏవిటా మాటలు భయంవేస్తుంటేనూ? మామూలుగా

అల్లావుద్దీన్ ప్రశ్నించాడు.

"ఏంటిసార్, అలా అరిగారు? ఇది భరత ఖండంలోని ఆంధ్రదేశంలోనే వుంది. జాగ్రఫిలో తమరికి పెద్దసున్నా—" మజ్జు చివరి మాటలు గొణిగాడు.

"ఏంటి—జిరాఫీకి సున్నమా!" అర్థంకాక అడిగాడు అల్లావుద్దీన్.

"ఆహా....ఏం సెలవిచ్చారు సార్! నేను అన్నది జాగ్రఫీ — అంటే భూగోళశాస్త్రం. అంతేసార్. పూర్వం జాగ్రఫీ అని కొంత భూగోళశాస్త్రం చెప్పేవాళ్ళు. అప్పుడు-కనీసం, ఇలాంటి ప్రాంతాల పేరులయినా తెలిసివుండేవి ఇప్పుడు అన్నీ జిరాఫీ వ్యవహారాలే అవడం వల్ల ఇలాంటి లోయలు కనిపించడం లేదు. అసలు—ఎల్లలే గుర్తుండకుండా పోతున్నాయి సార్! శ్రీకాకుళం మనదో కాదో, అదిలాబాద్, తిరుపతి మనవో కావో తెలియకుండా పోతున్నాయి సార్....అందుకే—"

"అవు. మనవి మనవి అంటున్నావ్ ఏంటి కథ! ఇందులో మనవేమున్నాయి మజ్జూ? హుఁ. మనం ఎక్కణ్నుంచి వచ్చామో ... ఎక్కడికి వెళ్తామో ఎవరికి తెలుసు?"

"ఇదీ కరెక్టే! ఈ దేశంలోవున్న వాళ్ళంతా ఇలాగే అనుకుంటారు సార్—ఎక్కణ్నుంచి వచ్చామో ఎక్కడికి పోతామో. దీన్ని తత్వం అంటారు. ఈ దేశంలో వున్న వాళ్ళంతా తాత్వికులే. వాళ్ళకు ఈ లోకంతో పనిలేదు. అంతా పై లోకమే! ఇక వాళ్ళకి లోయలేం కనిపిస్తాయ్ సార్!"

ఇంతలో మరింత ఎత్తుగావున్న మరోకొండ వచ్చింది. ఆ కొండమీద కొచ్చింతర్వాత వాళ్ళ దుస్తులు మంచుకి తడిసిపొయ్యాయి! అల్లావుద్దీన్ చలికి గడగడ వణుకుతూ—"మహజ్జు ఏ హేవి టి....ఇంత చహిలిగా హుంది?" అన్నాడు.

"వుంటుంది సార్. ప్రస్తుతం మనం అరకు లోయలో అన్నిటికన్నా ఎత్తయిన కొండమీద వున్నాం. దీనిపేరు అనంతగిరి. చలి కాస్త ఎక్కువగానే వుంటుంది. మీరు మరీ పళ్ళు బిగించి మాట్లాడమాకండి. మాటలు అర్థం కావడంలేదు సరికదా మీ నోటి నుంచి పిండి గిర్నీ మోత వినిపిస్తూంది!" మజ్జు అన్నాడు. అల్లావుద్దీన్ నొచ్చుకున్నా అది కనబడనీయకుండా కాసేపు అటూయిటూ చూసి—

"మజ్జూ, చెట్లకు కట్టిన ఆ పచ్చబస్తాలేవిటి?" విస్తుబోతూ చెట్లకేసి చూపిస్తూ అడిగాడు. మజ్జూ చూశాడు.

"సార్—పచ్చగా వున్న మాట వాస్తవమే గాని అవి బస్తాలు కావు. పనసకాయలు. వాటిని పనసకాయలు అంటారు. ఇలాంటివే తమరికి తెలియని కాయలు, చెట్లూ వందల కొద్ది వున్నాయి. ఇంకొక రహస్యం చెప్పనా? సకల రోగాలకు 'పనికొచ్చే' వనమూలికలు బోలెడన్ని వున్నాయి. వాటిసంగతి యెవరూ పట్టించుకోవడం లేదు."

"పోన్లే మజ్జూ. ఎవరికీ పట్టనప్పుడు మనకెందుకు?" అల్లావుద్దీన్ చాలా తాపీగా అన్నాడు. కాని మజ్జు ఊర్కోలేదు.

"అబ్బే అలా అంటే యెలా? అందరూ అలాగే అనుకుంటే ఇక దేశం బాగుపడ్డట్టే. నాకే కాస్తా అధికారముంటే—సర్వరోగ నివారిణి సంజీవినిలాంటి మందులు కనిపెట్టే ప్రయోగశాలలు కట్టించి పారేసేవాణ్ణి తెలుసా?" మజ్జు ఆవేశంగా అన్నాడు.

"దీనికి దీర్ఘం తియ్యడం దేనికి—హాం ఫట్‌మని అదేదో శాల పెట్టరాదా?"

"అమ్మమ్మా—అంతపని చెయ్యకూడదు, ఈదేశం వాళ్ళ సంగతి నీకు తెలియదు సార్. సోమరితనం వీళ్ళ తోబుట్టువు. మనం హాం ఫట్ అని ప్రయోగశాల సృష్టిస్తే — శాలొద్దు గోలొద్దు అసలు రోగాలు రాకుండానే హాంఫట్ అనమంటారు! వద్దుసార్....ఇప్పటికే చాలా 'షార్టుకట్టు'లయ్యాయి" మజ్జు సర్దుకున్నాడు.

ఇంకాస్తా దూరం నడిచారు. మరో చిన్న లోయ వచ్చింది. చుట్టూ తోటలు కనిపించాయి. పువ్వులూ, పండ్లూ, రంగుల మొక్కలూ— ప్రకృతికి అందం తెచ్చిపెట్టేవన్నీ వున్నాయక్కడ. అవన్నీ చూస్తూనే అల్లావుద్దీన్ పరవశించిపోయాడు.

"మజ్జూ మిత్రమా! ఒడలు ఏమిటి వశము తప్పుచుండె?"

"పైత్యం సార్—" మెల్లగా అన్నాడు మజ్జు.

"ముగ్ధమనోహరంబులయిన పుష్పములను గాంచితివా? నోరూరించు ఫలములను దిలకించితివా?

"ఏయ్ మజ్జూ — చెక్కుడు చెక్కుడుగా, ముళ్ళు ముళ్ళుగావున్న ఆ కాయ పేరేమిటి?"

"దీన్ని పైనాపిల్ అంటారు. పైకి అలా కనిపించినా రుచిమట్టుకు యమాగా వుంటుంది! ఉండండి" మజ్జు గబాలున ఒక కాయను కోసి, శుభ్రంగా చెక్కి, గుండ్రంగా ముక్కలుకోసి అల్లావుద్దీన్‌కి పెట్టాడు. వాటిని తింటూ తోటలన్నీ తిరుగుతూ వేరే వనంలో అడుగుపెట్టారు. ఒకచెట్టు దగ్గరకొచ్చేసరికి నాలుగు రకాలయిన వాసనలు గుబాళించాయి. ముక్కు పుటాల్ని పెంచి బాగా వాసనల్ని పీల్చితే మసాలా వాసనలు తగిలాయి. మజ్జూ, అల్లావుద్దీన్ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. మజ్జూ యెగిరి ఒకాకును తెంపి, నలిపి వాసనచూసి, చెట్టుకేసి చూసి—సార్—అని అరిచాడు. అల్లావుద్దీన్ అదిరిపోయి మజ్జువంక చూశాడు—ఏవిఁటి— అన్నట్టు.

"సార్. ఇది ఓ అపురూపమైన చెట్టు. చూశారా....ఈ ఒక్కచెట్టుకే లవంగాలూ, ఏలకలూ, జాజికాయలూ కాస్తున్నాయి! ఈబెరడు చూడండి; ఇదిదాల్చిన చెక్క. అంటే మసాలా దినుసులన్నీ ఒకే చెట్టుకు కాస్తున్నాయన్నమాట!"

"నిజమే మజ్జూ. చాలా విచిత్రంగా వుంది! ఈ చెట్టు పేరేమిటి?"

"సర్వసుగంధిని—అని మనం పిల్చుకోవచ్చు. ఇది కాశ్మీర్ అడవుల్లో, అయిదువేల అడుగుల పైనున్న కొండలోయల్లో దొరుకుతుంది. అరకులోయలో యిలాంటి చెట్టు వుండటం నిజానికి మన అదృష్టం! కనీసం కళ్ళతోనయినా ఇలాంటి అద్భుతమైన చెట్టును చూసే అవకాశం దొరికింది...." మజ్జూ అన్నాడు. అల్లావుద్దీన్ క్షణంసేపు ఆలోచించి-

"మజ్జూ—ఈ చెట్టు మొక్కల్ని కొన్ని పట్టుకెళ్ళి మన పార్కుల్లోనూ, పబ్లిక్‌గార్డెన్‌లలోనూ వేస్తే పదిమందీ చూస్తారుగా?"— అన్నాడు.

"సార్, పార్కుల్లో ఇప్పుడు వున్న చెట్లకు నీళ్ళుపోస్తే చాలు సార్. ఇలాంటి మొక్కలను తీసుకెళ్ళి చంపడం దేనికి? ఇంతెందుకు? ఇక్కడే ఓ పెద్దతోట వేయించి ఈ చెట్లను పెంచవచ్చుగా? మసాలా దినుసులకున్న గిరాకీ తెలియందేముంది చెప్పండి? ఏమిటో సార్... వనమహోత్సవాలు ఎక్కువయ్యే కొద్ది చెట్లు సరీగ్గా మొలవడంలేదు! ఇంతకుముందు ప్రతి యింట్లోనూ కూరగాయల పాదులు వుండేవి. టమాటా, చిక్కుడు, వంగ, బెండ, కాకర, బీర—అన్నీ యిండ్లలోనే పండేవి. అప్పట్లో ఇండ్లు యెంత అందంగా వుండేవని—పచ్చగా నిండుగా! ఇప్పుడో కరేపాకు కట్టకోసం రిక్షా వేసుకొని మార్కెట్ వరకూ పరుగులెత్తాలి." అల్లావుద్దీన్ గట్టిగా నవ్వాడు. మజ్జు పళ్ళు కూడా బయటకొచ్చాయి.

"ఏవిటో మజ్జూ—మనకున్న సంపదేవిటో తెలుసుకోకుండానే ఉత్తుత్తి మాటలతోనే కాలాన్ని గడిపేస్తున్నాం. ఇలాంటి విచిత్రమయిన చెట్లూ, అద్భుతమైన వనాలు యింకా ఎన్ని వున్నాయో!" అల్లావుద్దీన్ కాస్త దిగులుగా అన్నాడు.

"సార్....ఇక్కడున్న మనుషుల్ని మీరు యింకా చూడలేదు! ఇప్పటిప్పుడే బట్టకట్టడం నేరుస్తున్నారుగాని — మొన్నటిదాకా మొలచుట్టూ ఓ గుడ్డపీలిక—మిగతా అంతా...." మజ్జుకు సిగ్గు ముంచుకొచ్చింది. అల్లావుద్దీన్ బుగ్గలు కూడా యెరుపెక్కాయి.

"అబ్బా—అంత అనాగరికులా?" అల్లావుద్దీన్ దీర్ఘం తీశాడు.

"ఆ మాటంటే నే ఊర్కోను. గుడ్డలు లేకపోయినా మానం వుంది; మర్యాద వుంది. నీతి నిజాయితీలు, నమ్మకం, భయభక్తులూ వున్నాయి. ఇంకేం కావాలి? నాగరికత అంటే ఏవిటి? ఎదుటి వాణ్ని ఎలా దోచుకోవాలా అనే తెలివేనా నాగరికత అంటే? వీళ్ళు అడవిలో వున్నమాట నిజమే. కాని మన అడవులమాటేవిటి? సిమెంటు భవనాల కారడవులు కావా మన సిటీలు? పగ, ద్వేషం, అసూయ అనుమానం, దోపిడి తప్ప మరేమీ తెలియని మనం నాగరికులమా? ఏది నాగరికత? ఏది అనాగరికత? ఏది సత్యం? ఏది అసత్యం? ఓ మహాత్మా!" అంటూ అల్లావుద్దీన్ని భుజాలమీద యెక్కించుకుని హాంఫట్ అన్నాడు మజ్జు. ఇద్దరూ మాయమైపోయారు. □

ఉచితం !! # ఉన్నతమార్గం FREE !!

అడవి బాతులు కొన్ని ఆకాశమార్గాన ఉత్తర ప్రాంతాలకు ఎగిరిపోతున్నాయి. అవి అలా ప్రయాణం చేస్తుంటే క్రిందనున్న కొన్ని ఊరబాతులు వాటి దృష్టి నాకర్షించాయి. అందులో ఒక అడవిబాతు తన గుంపును వదలి క్రిందకుదిగి ఊరబాతులతో కలసి కొంతసేపు గడిపి, ఎగిరిపోయింది. మరుసటిరోజుకూడ వచ్చి ఇంకా ఎక్కువకాలం వాటితోగడిపి ఆహారంకూడా ఆరగించింది. కాపుయొక్క పెరటిలో ఏ భయం లేకుండా సంచరించవచ్చుననే కోరికతో ఆ అడవిబాతు వేసవి అంతా ఊరబాతులతోనే గడిపింది. వేసవి గడచి, ఆకు రాలే కాలంలో దక్షిణ ప్రదేశాలకు తరలివెళ్లే తన స్నేహితుల పిలుపువిని వాటితోపాటు పైకెగరాలని ప్రయత్నించినపుడు ఆ పని దానికి కష్టంగా తోచింది. ఇంతకాలం చీకూ, చింతా లేకుండా కడుపునిండా మేత తిన్నందువల్ల దాని శరీరం బరువెక్కి అది ఎగిరేశక్తిని కోల్పోయింది.

చలికాలం గడిచి తిరిగి వసంతం ప్రారంభమవగానే తిరిగి తన పాత స్నేహితులను చూచింది. రెక్కలు విదిల్చి కళ్ళు చిట్లించిందిగాని ఏమాత్రం పైకెగిరే ప్రయత్నం చేయక ఊరుకుంది. ఇంకా కొద్దికాలం గడిచాక తల పైకెత్తి తన స్నేహితులను చూచేదిగాని, పైకెగరటానికి ఆసక్తి చూపేదికాదు.

ఉన్నతమైన ఆశయాలతో ఉన్నత శిఖరాగ్రములో దేవునితో సహవసించే దేవునిబిడ్డా! నీ తిన్నని మార్గమును విడిచి నీ ఉన్నతి ఆశయాలను వదలి, సర్వోన్నతుడైన దేవుని సన్నిధినుండి దూరంగా తొలగిపోయి ఆ దివ్య ప్రయాణీకులకు దూరంగా క్రింద అగాధపులోయల్లో కొంతసేపు గడిపి, ఆనందించి, తిరిగి ఉన్నత శిఖరాల నందుకొంటాననుకోవటం ఎంత వెర్రితనం! ఉన్నతమైన వాటినుంచి నీ దృష్టిని మరల్చి క్రింద చూపులు చూచినప్పుడు నీ పతనం తప్పదు.

—చదలవాడ చంద్రమతీదేవి



కర్పూర శిల్పం

జయశ్యామ్ అభిరుచీ, సినిమా ప్రక్రియలో అభినివేశమూ వున్న యువకుడు. ఆయన దర్శకత్వంలో నిర్మించబడిన 'కర్పూరశిల్పం' ఇప్పుడు విడుదలకు సిద్దంగా వుంది. ఆంధ్రలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి లక్ష్మీఫిలింస్ వారు అంగీకరించినట్లు యిటీవల మద్రాసులో యేర్పాటుచేసిన ఒక పత్రికా గోష్టిలో శ్రీ జయశ్యామ్ తెలియజేశారు.

మనోరంజన్, ప్రతిమ కధానాయక, కధానాయిక పాత్రలు పోషించిన ఈ తెలుపు నలుపు చిత్రంలో యితర ముఖ్య పాత్రలలో కూడా కొత్తవారే నటించారు. ఛాయాగ్రాహకుడు, దశరథరామయ్య, సంగీతం : పెండ్యాల పాటలు : ఆచార్య తిరుమల, కోపల్లె శివరాం.

'గోపాలరావుగారి అమ్మాయి'లో జయసుధ, చంద్రమోహన్



వై. కృష్ణారావు. ప్రఖ్యాత చిత్రకారులు శీలా వీర్రాజు కళా దర్శకత్వం వహించడం ఈ చిత్రానికి సంబంధించిన మరొక విశేషం. దర్శకుడే రచనకూడా చేశారు. నిర్మాత : ఎస్. ఏ. బషీ.

కొత్తవెన్నెల

మయూరా ఎంటర్ ప్రయిజెస్ వారు 'కర్పూరశిల్పం' దర్శకుడు జయశ్యామ్ దర్శకత్వంలో 'కొత్తవెన్నెల' అనే చిత్రాన్ని

'సర్దార్ పాపారాయుడు'లో శ్రీదేవి





'ప్రేమతరంగాలు'లో కృష్ణంరాజు, చిరంజీవి

నిర్మించబోతున్నారు. ఈ చిత్రంలో కీలకమైన ఆరు ప్రధాన పాత్రలను ఆరుగురు ప్రముఖ నటీమణులు పోషించగలరని తెలుస్తోంది. సంగీతం : పెండ్యాల. రచన, దర్శకత్వం జయ శ్యామ్. నిర్మాత, కటికనేని మధుసూదనరావు.

వంశవృక్షం

కదిలే బొమ్మల కళారహస్యం తెలిసిన దర్శకుడు బాపు దర్శకత్వంలో, ముళ్ళపూడి వెంకటరమణ సంభాషణలతో నిర్మించబడుతున్న 'వంశవృక్షం' షూటింగు పూర్తయింది. జె. వి. సోమయాజులు ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం ప్రఖ్యాత కన్నడ నవల 'వంశవృక్ష' ఆధారంగా నిర్మించబడుతోంది. దీని కన్నడ చలన చిత్రరూపం గిరీష్ కర్నాడ్, బి.వి. కారంత్‌ల జంట దర్శకత్వంలో నిర్మించబడి అనేక బహుమతులను, అంతర్జాతీయ చలన చిత్ర విమర్శకుల ప్రశంసలూ అందుకుంది. బాపు రూపొందిస్తున్న తెలుగు చిత్రం ఆ స్థాయికేమీ తీసిపోదని, ఆయన శక్తి తెలిసిన తెలుగు సినిమా ప్రేక్షకులాశించడం అత్యాశకాబోదు.


ప్రేమసింహాసనం

బీరం మస్తాన్‌రావు దర్శకత్వంలో కె. విద్యాసాగర్ తిరుపతి ఇంటర్నేషనల్ పతాకంమీద నిర్మిస్తున్న వర్ణచిత్రం 'ప్రేమసింహాసనం' షూటింగు వాహినీ స్టూడియోలో యిటీవల నాలుగురోజులపాటు జరిగింది. కథానాయక పాత్రధారి ఎన్.టి. రామారావు మీద ఒకపాట చిత్రీకరించబడింది. ఎన్. టి. రామారావు, రతి పాల్గొన్న కొన్ని సన్నివేశాలను కూడా ఈ నాలుగురోజుల షెడ్యూలులో చిత్రీకరించారు. కె. ఆర్. విజయ, మంజుభార్గవి, మోహన్ బాబు, గుమ్మడి, మొదలైనవారు యితర ముఖ్య పాత్రలు ధరిస్తున్నారు. మాటలు : జంధ్యాల సంగీతం : చక్రవర్తి, కథకుడు, దర్శకుడు : బీరం మస్తాన్‌రావు.

—దేవీదాసు

ఈ నెల బహుమతి రు. 200!

శ్రీశ్రీ నిర్వహిస్తున్న పదబంధ ప్రహేళిక



ఆధారాలు — సెప్టెంబర్ '80

అడ్డం:

1. మామిళ్ళరేవు
3. సనాతనాధునాతనా సంగీతంలో దరువు
5. భాస్కరుని ముద్దుపేరు
6. వాడు బ్రతుకనేర్చిన వాడు
8. గొంతుకలో పచ్చి వెలక్కాయ
9. కొందరి మాటలు
11. జాతరగాలుల ప్రారంభస్థలం
13. చేసే చాయం గలది
15. అత్యున్నతికి హేతువు
16. జైల్‌సింగ్ కేంద్ర కాబినెట్‌లో లేని ఏ.పి.

ప్రహేళికా ప్రియులకు మన్నించండి!

గత సంచికలో పజిల్ బ్లాకు తప్పుగా అచ్చయింది. పొరపాటు ఎవరిదైనా బాధ్యత మాదే కనుక మరొకసారి మన్నించండి. మీరు అభిమానంతో ఉత్తరాలలో కురిపించిన ఆగ్రహమంతా అందింది. పోయిననెల బహుమతి ఈ నెల బహుమతి కలిపి రు. 200 ఈనెల ప్రహేళిక విజేతలకోసం ముడుపు కట్టివుంచాము గ్రహించండి.

—ఎడిటర్

17. ఖనిజం
19. నీరం నీరజం
22. పంచమం చక్కెర పువ్వు
23. మూషికాలయం
25. చూసేది కన్ను కాదు
26. తలపడు
28. గొడ్డులో లేదు, గొడ్లలో వుంది
30. మంతరంలో సిరి
31. గడియారంలో వెంట్రుక

నిలువు

1. ఒక మహమ్మదు
2. భాష సజీవం
3. లాట లేకున్నా ఉన్నా కలహం
4. 24 గంటల దేశం
5. గజాష్టకంలో కవి
7. ఒకనాటి పత్రిక, ఈనాటి సినిమా
8. ప్రాణం వున్నంతవరకే
10. పడకటిళ్ళలో నిలువుటద్దాలలో వుంటాయి
12. వినిపించనిది మరీ మధురం
14. వరాహ నది
15. ఒకనాటి 7
17. రంగస్థల నటుని ఇంటిపేరు
18. వాడు కలిగించేది, వినోదం
20. గాలి, వేలుపు
21. ఇంగ్లీషు తిండికి క్రికెట్‌లో బ్రేకు
23. తిలకించండి
24. సాదీస్తాన్
27. సాగితేనే సిద్ధి
29. పిట్ట వాగుతుంది

నిబంధనలు గమనించండి:

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి ఆగస్టు 25 వ తేదీలోపు మాకు చేరేట్టు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపేవారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 100/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది. ఒక ఎంట్రీమీద ఇరువురి పేర్లు వుండకూడదు.

Edited & Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony, Kodambakkam, Madras-600024 & Printed by D. Hanumantha Rao at Kranti Pres, 12, Francis Joseph Street, Madras 600 001.

JYOTHI SEPTEMBER Rs. 3/- REGD.NO.

